ఆదివారం ... నీ వారాంతపు నేస్తం (graphic)

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-10-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 246 పేజీలు: 10+4 వెల: 6.50


'వికసిత్ భారత్' దిశగా నెక్ట్స్‌జెన్ జిఎస్టీ: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

జీలకర్ర పొడి రీకాల్‌కు ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆదేశం 5



# విమానాన్ని కూల్చాలనుకున్నా!

### ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

**టెల్‌అవీవ్, అక్టోబరు 4:** ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం కేసులో నిందితుడైన కోపైలట్ హామామ్ అల్‌హామామీ విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించానని అంగీకరించాడు. చావంటే తనకు ఏమాత్రం భయం లేదని దర్యాప్తు అధికారులతో స్పష్టం చేశాడు. ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఎఫ్ జెడ్ 1073 విమానంలో పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి, ఆ తర్వాత తన పథకంప్రకారం దాడికి పాల్పడినట్లు >>2



# స్పెయిన్‌లో గృహ సంక్షోభం

### అద్దెల భారంపై మాడ్రిడ్‌లో భారీ నిరసన

**మాడ్రిడ్, అక్టోబరు 4:** స్పెయిన్‌లో గృహ సంక్షోభం తీవ్ర రూపం దాల్చింది. ఇళ్ల కొరత, విపరీతంగా పెరిగిన అద్దెలు, బలవంతపు ఖాళీలపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. రాజధాని మాడ్రిడ్‌తో పాటు దేశంలోని 50 నగరాల్లో శనివారం పదివేల సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వం ప్రతిపాదించిన అత్యవసర గృహనిర్మాణ చర్యలను >>2



# సంబంధం చూస్తాం ఎంపిక మీదే

### పిల్లలను కనండి.. జనాభా పెంచండి

### సరికొత్త 'డేటింగ్ యాప్‌' తెచ్చిన సింగపూర్ ప్రభుత్వం

**ప్యారిస్, అక్టోబరు 4:** దేశంలో రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయిన సంతానోత్పత్తి రేటు (ఫెర్టిలిటీ రేట్) సమస్యను అధిగమించేందుకు సింగపూర్ ప్రభుత్వం సంచలన ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. 21 నుంచి 35 సంవత్సరాల వయసున్న ప్రభుత్వ ఉద్యోగుల కోసం 'ఫస్ట్ డేట్స్' పేరిట అధికారిక మ్యాచ్‌మేకింగ్ (డేటింగ్) >>2




# జ్ఞానేష్‌కు చిక్కులు

### 20 యేళ్ల విజిలెన్స్ విచారణ..

### రీఓపెన్ చేసిన కేరళ సర్కార్

**తిరువనంతపురం, అక్టోబరు 4:** సిఇసి జ్ఞానేష్ కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2006లో ఆయన కేరళ ప్రజా పనుల శాఖ (పిడబ్ల్యుడి) కార్యదర్శిగా పనిచేసిన సమయంలో చోటుచేసుకున్న తీవ్ర అవకతవకలు, నాటి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కేరళ హోం మంత్రి రమేశ్ చెన్నిథాల విజిలెన్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్ కింద ఎంసి రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షించిన 'పాటిబెల్ట్' ఇండోమలేషియన్ కన్సార్టియంకు చెందిన ప్రాజెక్ట్ మేనేజర్, మలేషియా సివిల్ ఇంజనీర్ లీ సీ బీన్ 2006లో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆ >>2

# ఒకే ప్రాపర్టీ బిల్లు పోర్టల్

## హైదరాబాద్ నగరానికి సరికొత్త క్యూర్

### రిజిస్ట్రేషన్‌తోనే ఆటోమేటిక్‌గా మ్యూటేషన్

### పరిమిత సీలింగ్ మేరకు ఆస్తిపన్ను పెంపు

### ఆన్‌లైన్‌లో భవన అనుమతులు..

### ఆలస్యమైతే అప్పీల్

### రోడ్లు, ట్రాఫిక్, ప్రకృతి విపత్తులపై సమగ్ర వ్యవస్థ

### సిఎం రేవంత్ కార్యాలయం ప్రకటన



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు 4:** హైదరాబాద్ నగర ప్రజలకు మున్సిపల్ సేవలు మరింత సులభతరం చేసే కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం 70యేళ్ల నాటి జిహెచ్ఎంసి చట్టం స్థానంలో కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) చట్టం-2026 తీసుకొచ్చింది. అక్టోబర్ 2 నుంచి కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లకు ఈ చట్టం వర్తిస్తుంది. మున్సిపల్ శాఖను స్వయంగా చూస్తున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నగర పాలనపై నేరుగా పర్యవేక్షణ సాగించేలా కొత్త వ్యవస్థలో కీలక మార్పులు చేశారు. సిఎం అధ్యక్షతన క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ పనిచేస్తుంది. నగరాభివృద్ధి ప్రాధాన్యాలను ఈ కౌన్సిల్ నిర్ణయిస్తుంది. కార్పొరేషన్లు, పోలీస్, రెవెన్యూ, హెచ్ఎండిఎ, జలమండలి, విద్యుత్, మెట్రో, ఆర్టీసీ, హైడ్రా అధికారులు ఒకే వేదికపై చర్చించి నిర్ణయాలు తీసుకునే వ్యవస్థ కొత్త చట్టంలోకి వచ్చింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. 1955లో పాత మున్సిపల్ చట్టం వచ్చినప్పుడు హైదరాబాద్ జనాభా సుమారు 15 లక్షలు. ఇప్పుడు కోర్ అర్బన్ రీజియన్‌లో దాదాపు 1.3 కోట్ల మంది నివసిస్తున్నారు. నగరం భారీగా విస్తరించింది. వరదలు, ఎండ తీవ్రత, వాయు కాలుష్యం, నీటి కొరత, ట్రాఫిక్, చెరువులు-నాలాల ఆక్రమణలు, ఎత్తైన భవనాల్లో అగ్నిప్రమాదాల ముప్పు వంటి కొత్త సవాళ్లు వచ్చాయి. ఈ మార్పులకు అనుగుణంగా నగర పాలనా వ్యవస్థను మార్చేందుకు ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. మూడు కార్పొరేషన్ల ప్రస్తుత సరిహద్దులు మాత్రం మారవు. మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ, కమిషనర్, వార్డు కమిటీ వ్యవస్థ కొనసాగుతుంది. ఐదేళ్ల పదవీకాలం కూడా యథాతథంగా ఉంటుంది. ఇంటి కొనుగోలు తర్వాత మ్యుటేషన్‌కు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరాన్ని కొత్త చట్టం తగ్గించనుంది. >>2



## ఒక్కో కార్మికునికి రూ.1.10 లక్షల బోనస్

### సింగరేణిలో గత యేడాది కంటే రూ.7,250 పెరుగుదల

### యాజమాన్యం, కార్మిక సంఘాల చర్చల్లో ఏకాభిప్రాయం 2



తూప్రాన్‌లో అమూల్ డెయిరీ ప్లాంట్‌కు భూమిపూజ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు వివేక్, శ్రీధర్‌బాబు తదితరులు

# సహకారంతోనే రైతుకు సమృద్ధి

### తూప్రాన్ డెయిరీ ప్లాంట్‌తో శ్వేత విప్లవం..

### రూ.400 కోట్లతో అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్

### 18 నెలల్లో నిర్మాణం పూర్తి.. మహిళలు, యువతకు ఉపాధి

### కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

**తూప్రాన్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** సహకార వ్యవస్థతోనే రైతుల ఆర్థిక అభ్యున్నతి సాధ్యమని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తెలంగాణలో శ్వేత విప్లవం 2.0ను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్‌కు భూమిపూజ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్లాంట్ కేవలం పారిశ్రామిక ప్రాజెక్టు మాత్రమే కాదని, తెలంగాణ పాడి రైతుల ఆర్థిక భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాబోయే 18 నెలల్లో ప్లాంట్ నిర్మాణం పూర్తిచేసి, స్థానిక మహిళలు, >>2

## 15 రోజుల్లోగా గ్రామాల్లో కొత్త

# జాబ్ కార్డులు

### విబి జి రామ్ జి పథకం కింద దరఖాస్తుకు అవకాశం

**హైదరాబాద్, అక్టోబరు 4 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విబి జి రామ్ జి పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి జాబ్‌కార్డులు త్వరగా జారీ చేయాలని నిర్ణయించింది. కొత్త దరఖాస్తుదారులకు 15 రోజుల్లోనే జాబ్‌కార్డు అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల




కారణంగా ఇప్పటికే 18 జిల్లాల్లోని 265 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటల సాగు తగ్గింది. దీంతో వ్యవసాయ పనులపై ఆధారపడే కూలీలకు పనిదినాలు తగ్గి ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ప్రస్తుత జాబ్‌కార్డుదారులతో పాటు కొత్తగా ఉపాధి కోరుకునే వారిని కూడా నమోదు చేయాలని సూచించింది. గ్రామాల్లో ఉపాధి అవసరమున్న కుటుంబాలను గుర్తించి వారికి పనులు కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రతి గ్రామం నుంచి రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. వ్యవసాయ పనులు తగ్గిన సమయంలో గ్రామీణ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఉపాధి హామీ పనులు అందుబాటులో ఉండేలా అధికారులు >>2



శంషాబాద్‌లో ఆదివారం జరిగిన ఒబిసి సింహగర్జనలో ప్రసంగిస్తున్న పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

# ఇక బిసి సిఎం

### రాహుల్, రేవంత్ మద్దతుంటుంది: మహేష్ కుమార్ గౌడ్

### జనగణనలో ఒబిసి కులగణన చేపట్టాల్సిందే

### ఒబిసి సింహగర్జన సభలో పిసిసి చీఫ్

### కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

**శంషాబాద్ అక్టోబరు4,ప్రభాతవార్త :** దేశ జనగణనలో ఒబిసి కుల గణనను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా చేపట్టాలని అందరం ఎకమై మన హక్కులను సాధించుకుందామని పోరాటం చేస్తే పోయేది ఎం లేదని రాబోయే భవిష్యత్ తరాల కోసం మనం పోరాటం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం శంషాబాద్ మండలం గోల్లపల్లిలో టిపిసిసి ఒబిసి చైర్మన్ ,ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ సింహగర్జన సభ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్,మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లు హాజరైయ్యారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో వెనుకబడిన వర్గాల జనాభా ఎంత >>2

## కోట్లాది ఓట్ల తొలగింపు.. 7

## రాజ్యాంగ ఆత్మను దెబ్బతీస్తుంది

### 'సుప్రీం' జడ్జి ఉజ్జల్ భూయాన్ సంచలన వ్యాఖ్యలు



## ఆ 'మార్ఫింగ్'పై సైబర్ కేసు

'దేవర' పాటపై ఎఐ వీడియో.. 7

టెక్నాలజి దుర్వినియోగం

కమిటీ ఏర్పాటు చేయాలి: చిరంజీవి

# షీర్‌జోన్‌లో 79% పూర్తి



### ఎస్ఎల్‌బిసిలో సవాళ్లను అధిగమిస్తూ సొరంగం తవ్వకాలు

### 2028 జూన్‌కి జలసిరులు అందుబాటు: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, అక్టోబరు4,ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం ప్రమాదకరమైన భూగర్భ భౌగోళిక సవాళ్ళను అధిగమిస్తూ 700మీటర్లు తొలుచుకుంటూ అత్యంత భద్రతాప్రమాణాలు పాటిస్తూ ముందుకు వెళ్ళిందని నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ఎల్‌బిసి సొరంగం పనులతో పాటు కీలకమైన సాగునీటి ప్రాజెక్టులపై ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులతో ఆదివారం సెక్రటేరియట్‌లో సమావేశం జరిపారు. ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు పూర్తైతే కరువు దుర్భిక్షం కొట్టుమిట్టాడే ఎగువ ప్రాంతాలకు 30టిఎంసిల కృష్ణానీరు అందుబాటులోకి వస్తోందని శాశ్వతంగా కరువు దూరం అవుతోందని తెలిపారు. టన్నెల్-1లో రెండు వైపుల నుంచి సాగుతున్న తవ్వకాలు 2028 మే-జూన్ నాటికి కలిసే దశకు చేరుకుంటాయని మంత్రి >>2

# 'సర్'పై విచారణ

### ముంబయిలో 'విరాట్ గర్జన'

### నిరసనలో ఒకే వేదికపై థాకరే బ్రదర్స్!



**ముంబయి, అక్టోబరు 4:** సిఇసిని తక్షణమే తొలగించాలని, సర్ అక్రమాలపై సమగ్ర దర్యాప్తుజరిపించాలంటూ ఆదివారం ముంబైలో శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే ఇద్దరూ కలిసి ఈ భారీ నిరసన ర్యాలీకి నాయకత్వం వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. విరాట్ గర్జన మోర్చా పేరిట చేపట్టిన ఈ మహా నిరసన ప్రదర్శనకు విపక్షాల నుంచి భారీ స్పందన లభించింది. సౌత్ ముంబైలోని మెట్రో సినిమా ప్రాంతం నుంచి బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ మోర్చాలో ఏ రాజకీయ పార్టీ జెండాలకూ అనుమతి ఇవ్వకపోవడం గమనార్హం. పాల్గొన్న నాయకులు, వేలాది మంది కార్యకర్తలు కేవలం మువ్వన్నెల జాతీయ పతాకాన్ని మాత్రమే చేతబూని నిరసనల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్,శరద్ పవార్ వర్గానికిచెందినఎన్‌సీపీ అగ్రనేతలు >>2



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ఆదివారం న్యూఢిల్లీలో నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

## కూల్చాలనుకున్నా!

>> హామత్ ఒప్పుకున్నాడు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి కెప్టెన్ దృష్టి మరల్చి, విమానంలోని గోడలతో దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ ఘటనపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దర్యాప్తు బృందాలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. హామత్ యుఎఇలో జన్మించాడు. అతడి తండ్రి ఒమన్, తల్లి సిరియాకు చెందినవారు. [illegible] ముందు అతను ఒమన్, సిరియా, మొరాకోలలో నివసించాడు. సిరియాలో ఎక్కువకాలం నివసించినందున, అక్కడి సుదీర్ఘ అంతర్యుద్ధ సమయంలో అతను ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై (రాడికలైజ్) ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అతని సోషల్ మీడియా ఖాతాల్లో వేలకొద్దీ ఉగ్రవాద సంబంధిత పోస్టులు, సందేశాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న విషయాన్ని మాత్రం అతను ఇంకా వెల్లడించలేదు. కేసులో విచారణ కొనసాగుతోంది.

## స్పెయిన్‌లో గృహ సంక్షోభం

>> పార్లమెంట్ తిరస్కరించిన మరుసటి రోజే ఈ ఆందోళనలు జరగడం గమనార్హం. మాడ్రిడ్‌లో జరిగిన ప్రదర్శనలో సుమారు 70,000 మంది పాల్గొన్నారని అధికారులు అంచనా వేయగా, ఈ సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. అద్దెలు తగ్గించాలని, ఇళ్ల ఖాళీ చేయించకుండా బలమైన చట్టపరమైన రక్షణ కల్పించాలని, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌లు నివాస గృహాలను కొనుగోలు చేయడంపై ఆంక్షలు విధించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. కొందరు దేశవ్యాప్త సమ్మెకు కూడా పిలుపునిచ్చారు. గత నెలలో జరిగిన ఒక సంఘటన ఈ ఆందోళనలకు మరింత ఆజ్యం పోసింది. దశాబ్దాలుగా ఒకే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న 87యేళ్ల మారికార్మెన్ అబాస్కల్‌ను ఇంటి నుంచి బలవంతంగా ఖాళీ చేయించారు. ఆ భవనాన్ని కొనుగోలు చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ అద్దెను భారీగా పెంచడంతో ఆమె చెల్లించలేకపోయారు. ఈ ఉదంతం దేశవ్యాప్తంగా ప్రజల ఆగ్రహానికి ప్రతీకగా నిలిచింది. ప్రస్తుతం స్పెయిన్‌లో దాదాపు 7 లక్షల ఇళ్ల కొరత ఉన్నట్లు అంచనా. 2025లో సగటున అద్దెలు 8.5శాతం పెరగ్గా, మాడ్రిడ్, బార్సిలోనా వంటి నగరాల్లో ఈ పెరుగుదల ఇంకా ఎక్కువగా ఉంది. దీంతోపాటు ఇళ్ల ధరలు కూడా ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో ప్రధాని పెడ్రో సాంచెజ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం రెండు కీలక డిక్రీలను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. బలహీన వర్గాల వారిని 2030 వరకు ఇళ్ల నుంచి ఖాళీ చేయించకుండా నిలిపివేయడం, కొన్ని అద్దె ఒప్పందాలను పొడిగించడం వంటి చర్యలు ఇందులో ఉన్నాయి. అయితే, ప్రతిపక్షాలైన పాపులర్ పార్టీ, వోక్స్, జంట్స్ పార్టీలు వ్యతిరేకించడంతో ఈ ప్రతిపాదనలు వీగిపోయాయి.

## సంబంధం చూస్తాం ఎంపిక మీదే

>> సర్వీస్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించింది. ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన ప్రసిద్ధ 'గేల్‌షాప్లీ అల్గారిథమ్' ఆధారంగా ఈ ప్లాట్‌ఫారమ్ పనిచేయనుంది. కేవలం సాధారణ డేటింగ్ యాప్‌లలా కాకుండా, ప్రతి దశలో ఒక్కో భాగస్వామితో మాత్రమే డేట్ ఏర్పాటు చేసేలా దీనిని రూపొందించారు. భద్రత, పారదర్శకత కోసం ఉద్యోగులు సింగపూర్ జాతీయ డిజిటల్ ఐడెంటిటీ సిస్టమ్ (సింగ్‌పాస్) ద్వారా లాగిన్ అయ్యేలా వ్యవస్థను అనుసంధానించారు. జనాభా క్షీణతను అడ్డుకునేందుకు ప్రభుత్వం నేరుగా ఉద్యోగులకు సంబంధాలు కుదిర్చే బాధ్యతను తీసుకోవడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నూతన కార్యక్రమంపై పౌరులు, ఉద్యోగుల నుంచి భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## జ్ఞానేష్‌కు చిక్కులు

>> సమయంలో లీ రాసిన ఆత్మహత్య లేఖలో పిడబ్ల్యూడి అధికారుల వేధింపులతో పాటు నాటి కార్యదర్శి జ్ఞానేశ్ కుమార్ పేరును కూడా ప్రస్తావించడం తీవ్ర సంచలనం సృష్టించింది. అప్పట్లో ఈ ఘటన పై విజిలెన్స్ విచారణ ప్రారంభమైనప్పటికీ, బాహ్య ఒత్తిళ్లు, రాజకీయ జోక్యం కారణంగా ఆ దర్యాప్తు మూలనపడిందని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. అసలు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు బయటి శక్తులు ప్రభావం చూపాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో, ఈ కేసులోని అన్ని కోణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని హోం మంత్రి రమేశ్ చెన్నిథాల విజిలెన్స్ డైరెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. విజిలెన్స్ విచారణలో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హోం మంత్రిత్వ శాఖ కార్యాలయం పేర్కొంది. కేంద్ర ఎన్నికల సంఘంపై దేశవ్యాప్తంగా రాజకీయ రచ్చ నడుస్తున్న తరుణంలో, రెండు దశాబ్దాల క్రితం నాటి పాత కేసులో సిఇసి జ్ఞానేష్ కుమార్‌పై కేరళ ప్రభుత్వం విచారణకు ఆదేశించడం జాతీయ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది.

## 'సర్'పై విచారణ

>> కూడా ఈ ర్యాలీలో పాల్గొని ఉద్ధవ్, రాజ్‌లకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత లోపించిందని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు ముప్పు వాటిల్లుతోందని ఆరోపిస్తూ దేశ రాజధాని ఢిల్లీలోనూ నిరసనలు మిన్నంటాయి. జంతర్ మంతర్ వైపు మార్చ్ నిర్వహించేందుకు యత్నించిన సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ఐసా జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాతో పాటు దాదాపు 150 మంది ప్రతిపక్ష, విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇండియా గేట్ వద్ద ధర్నా నిర్వహించి ఎన్నికల సంఘం వైఖరిని ఎండగట్టారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజాస్వామ్యవాదుల్లో నమ్మకం సన్నగిల్లుతోందని, ఓటర్ల ముసాయిదా జాబితాలో నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేర్పులు చేశారనేది ఆందోళనకారుల ప్రధాన ఆరోపణ. ముంబై, ఢిల్లీలతో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ప్రజాసంఘాలు, పౌర సమాజం వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలోనే ముంబైలోని శివాజీ పార్క్ వద్ద జైల్ భరో కార్యక్రమాలు కూడా జరిగాయి. సీఈసీ తన పదవి నుంచి తప్పుకునే వరకు ఈ పోరాటాన్ని ఆపేది లేదని ప్రతిపక్ష నాయకులు స్పష్టం చేస్తున్నారు.

## సింగరేణి కార్మికులు ఒక్కొక్కరికి రూ.1.10 లక్షల బోనస్

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త :** గత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంస్థ కార్మికులకు పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ (పిఎల్‌ఆర్) ఇవ్వాలని సింగరేణి కాలరీస్ యాజమాన్యం నిర్ణయించింది. దీంతో సింగరేణి ఉద్యోగులకు రూ.1,10,250 పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ బోనస్ అందనుంది. గతేడాదితో పోలిస్తే బోనస్ రూ.1,03,000కు అదనంగా ఈ ఏడాది రూ.7,250 పెరుగుదల చోటు చేసుకుంది. ఈ మేరకు కోల్‌కతాలోని కోల్ ఇండియా ప్రధాన కార్యాలయంలో జరిగిన అపెక్స్ జేసీసీ సమావేశంలో యాజమాన్యం, కేంద్ర కార్మిక సంఘాల మధ్య దీనిపై ఒప్పందం జరిగింది. వృత్తి, భద్రతా పరమైన కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై ఇందులో చర్చించారు. యూనియన్ల ప్రతినిధులు ఈ బోనస్‌ను రూ.1.20 లక్షలను డిమాండ్ చేయగా, యాజమాన్యం చేసిన ప్రతిపాదనలపై చర్చ జరిగింది. చివరకు రూ.1,10,250 చొప్పున పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ బోనస్‌ను ఇచ్చేందుకు యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ పిఎల్‌ఆర్ బోనస్‌ను కోల్ ఇండియాలో దసరాకు ముందు, సింగరేణిలో దీపావళికి ముందు ఉద్యోగులకు చెల్లించనున్నారు.

## కొత్త జాబ్ కార్డులు

>> ఏర్పాట్లు చేయనున్నారు. ముఖ్యంగా కరవు ప్రభావిత మండలాల్లో ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52.46 లక్షల కుటుంబాలకు చెందిన 1.08 కోట్ల మంది జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. వీరికి కొనసాగుతున్న ఉపాధి అవకాశాలతో పాటు కొత్తగా పనులు కోరుకునే కుటుంబాలను కూడా పథకంలోకి తీసుకురావడం ద్వారా కరవు పరిస్థితుల్లో ఆదాయ నష్టాన్ని కొంతమేర తగ్గించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. 18 ఏళ్లు నిండిన గ్రామీణులు జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందు కోసం నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఆధార్‌కార్డు, ఫొటోను జత చేయాలి. సంబంధిత పత్రాలతో దరఖాస్తును గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలి. కార్యదర్శి దరఖాస్తును పరిశీలించిన అనంతరం మండల కార్యాలయానికి పంపిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో దరఖాస్తు, సంబంధిత పత్రాలను పరిశీలించి అర్హతను నిర్ధారిస్తారు. అనంతరం జాబ్‌కార్డు జారీ చేస్తారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి ఈ ప్రక్రియను వేగవంతం చేసి 15 రోజుల్లోనే కార్డు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## వారం - వర్జ్యం

05-10-2026, సోమవారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్త కార్తె,
తి. దశమి రా.2.08,
న. పుష్యమి రా.11.10,
వ.ఉ.7.53 -ఉ.9.25,
దు.మ.12.19 - మ.1.07,2)మ.2.42 - మ.3.30,
రాహు. ఉ .7.30- ఉ.9.00,
శుభ. స. ఉ.6.00 - ఉ .7.00.

## వార్తాఫలం

**మేషం :** మీ నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. నూతన విషయాలు తెలుసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

**వృషభం :** కోపతాపాలకు దూరంగా వుండటం. అన్ని విధాలా మంచిది. గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా వుండవు.

**మిథునం :** ఉద్యోగ యత్నాలు కలిసి వస్తాయి. అనుకోని ప్రయణాలలో నూతన మిత్రుల పరిచయాలు వుంటాయి.

**కర్కాటకం :** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. సంఘంలో విశేష ఆదరణ లభిస్తుంది.

**సింహం :** నూతన వస్తు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు పొందుతారు.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. దీర్ఘకాలిక సమస్యలు చికాకు కలిగిస్తాయి.

**తుల :** ఆస్తి, వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం :** బంధువులను కలిసి ఉత్సాహంగా గడుపుతారు. బాధ్యతలు పెరిగినా సకాలంలో నిర్వహిస్తారు.

**ధనుస్సు :** దీర్ఘకాలిక రుణాలు కొంత వరకు తీరుస్తారు. ప్రముఖులతో పరిచయాలు. సంఘంలో గౌరవం పొందుతారు.

**మకరం :** బాధ్యతలు మరింత పెరుగుతాయి. ఉద్యోగాలలో స్థానచలనం వుంటుంది. మానసిక ప్రశాంతత.

**కుంభం :** కొత్త వ్యక్తుల పరిచయమై నూతన కార్యక్రమాలు చేపడతారు. సోదరుల నుండి ఆస్తి లాభం పొందుతారు.

**మీనం :** శ్రమకు తగిన ఫలితం కష్టమే. రాజకీయ పారిశ్రామిక రంగాలలోని వారికి సన్మానాలు అందుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఒకే ప్రాపర్టీ బిల్లు పోర్టల్

>> రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే మ్యూటేషన్ ఆటోమేటిక్‌గా కొనసాగుతుంది. ప్రతి ఆస్తికి ఇంటిగ్రేటెడ్ ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్ ఇస్తారు. ఆస్తికి సంబంధించిన మున్సిపల్ వివరాలన్నీ ఈ గుర్తింపు సంఖ్యతో అనుసంధానమవుతాయి. ఆస్తిపన్ను, నీటి బిల్లు, మురుగునీటి ఛార్జీలు, పారిశుద్ధ్య బకాయిలను కలిపి 'క్యూర్-1' పేరుతో ఒకే బిల్లు ఇస్తారు. మున్సిపల్ సేవలు, అనుమతులు, లైసెన్సులను ఒకే పోర్టల్ ద్వారా పొందే విధానం వస్తుంది. ఆస్తిపన్ను విధానంలో కీలక మార్పు చేశారు. ఇక వార్షిక అద్దె విలువకు బదులుగా రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే గైడ్‌లైన్ విలువ ఆధారంగా పన్ను లెక్కిస్తారు. 375 చదరపు అడుగుల వరకు ఉన్న ఆస్తులకు రూ.101 నామమాత్రపు పన్నే కొనసాగుతుంది. మిగతా నివాస ఆస్తులకు గైడ్‌లైన్ విలువపై 0.10 శాతం నుంచి 0.50 శాతం మధ్య రేటును ఆయా కార్పొరేషన్లు నిర్ణయిస్తాయి. నివాసేతర ఆస్తులకు 0.20 శాతం నుంచి 2 శాతం మధ్య రేటు ఉంటుంది. కొత్త రేట్లు ఖరారయ్యే వరకు నివాస ఆస్తులకు 0.15 శాతం వర్తిస్తుంది. నివాసేతర ఆస్తులకు 0.75 శాతం రేటు ఉంటుంది. కొత్త విధానంతో ఒక్కసారిగా పన్ను భారం పెరకుండా పరిమితులు విధించారు. గత ఏడాది పన్నుతో పోలిస్తే ఏ సంవత్సరంలోనూ పెరుగుదల 10 శాతం దాటదు.

ప్రస్తుతం రూ.10 వేల ఆస్తిపన్ను చెల్లిస్తున్న వ్యక్తి మొదటి ఏడాది గరిష్ఠంగా రూ.11 వేలే చెల్లిస్తారు.
భవన అనుమతుల ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో సాగుతుంది. నిర్ణీత సమయంలో అధికారులు నిర్ణయం తీసుకోకపోతే దరఖాస్తు పైస్థాయికి వెళ్తుంది. నిర్ణయం రాని సందర్భాల్లో డీమ్డ్ అప్రూవల్‌కు చట్టం అవకాశం ఇస్తోంది. లైసెన్సింగ్ విధానాన్ని కూడా సులభతరం చేశారు. రాత్రివేళల్లో ఎక్కువ సమయం వ్యాపార కార్యకలాపాలు కొనసాగే నైట్ ఎకానమీ జోన్లను ప్రభుత్వం ప్రకటించనుంది. చిన్న ఉల్లంఘనలకు క్రిమినల్ కేసులు పెట్టే పాత విధానంలోనూ మార్పు వస్తుంది. చాలా ఉల్లంఘనలకు సివిల్ జరిమానాలు ఉంటాయి. ముందుగా షోకాజ్ నోటీసు ఇస్తారు. ఆ తర్వాతే జరిమానాపై నిర్ణయం తీసుకుంటారు. నగరంలో ఒక శాఖ వేసిన రోడ్డును మరో శాఖ కొద్ది రోజులకే తవ్వే పరిస్థితులకు చెక్ పెట్టేలా కొత్త వ్యవస్థ వస్తోంది. యుటిలిటీ కోఆర్డినేషన్ కమిటీ రోడ్డు తవ్వకాలపై శాఖల మధ్య సమన్వయం చేస్తుంది. ట్రాఫిక్ నిర్వహణకు క్యూర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ అథారిటీ పనిచేస్తుంది. ఫుట్‌పాత్‌లు, పాదచారుల క్రాసింగ్‌లు, కర్బ్ ర్యాంపులు, వీధి దీపాలు, ట్రాఫిక్ సిగ్నళ్లపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. పాఠశాలల వద్ద సేఫ్ స్కూల్ జోన్లు ఏర్పాటు చేసే అవకాశం కూడా కొత్త చట్టంలో ఉంది.
చెరువులు, నాలాలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల పరిరక్షణకు కొత్త చట్టం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. చెరువు, నాలా, ఇతర జలవనరుల్లో మురుగునీరు లేదా కాలుష్య వ్యర్థాలను వదలరాదు. చెరువులు, నాలాలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో ఆక్రమణలు, వ్యర్థాలపై చర్యలకు హైడ్రాకు చట్టబద్ధమైన బలం లభిస్తుంది. నిర్మాణ వ్యర్థాలను అనుమతి లేకుండా పారేస్తే కఠిన జరిమానా ఉంటుంది. నాలా, చెరువు, ఫుట్‌పాత్‌పై పారేస్తే జరిమానా రెట్టింపు అవుతుంది. నిర్దేశిత విస్తీర్ణం దాటిన భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. పర్యావరణహిత చర్యలు తీసుకునే ఆస్తులకు అదనపు ఆస్తిపన్ను రాయితీ ఇచ్చే అవకాశం ఉంది. కోర్ అర్బన్ రీజియన్ మొత్తానికి ఒకే విపత్తు నిర్వహణ ప్రణాళిక ఉంటుంది. క్యూర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ విపత్తుల నివారణ, ముందస్తు సన్నద్ధత, స్పందన, పునరుద్ధరణ చర్యలను సమన్వయం చేస్తుంది. హైడ్రా విపత్తు స్పందన సంస్థగా పనిచేస్తుంది.
ఎత్తైన భవనాలు సహా నిర్దేశిత భవనాలకు ఫైర్ ఆడిట్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసే అవకాశం ఉంటుంది. ప్రమాద స్థాయిని బట్టి తనిఖీలు చేపడతారు. ప్రాణాలకు తక్షణ ముప్పు ఉన్న భవనాన్ని లోపాలు సరిచేసే వరకు సీల్ చేయవచ్చు.
వీధులు, పార్కులు, బస్‌స్టాప్‌లు, రవాణా కేంద్రాల్లో తగిన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలి. మార్కెట్లు, రవాణా ప్రాంతాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో సిసి కెమెరాల నిఘాకు చట్టం ప్రాధాన్యం ఇచ్చింది.
మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులు, చిన్నారులు, వృద్ధుల అవసరాలను నగర మౌలిక వసతుల్లో పరిగణనలోకి తీసుకోవాలని కొత్త చట్టం చెబుతోంది. జెండర్ ఇన్‌క్లూజన్ సెల్ ఏర్పాటు చేస్తారు. ప్రతి కార్పొరేషన్‌లో ట్రాన్స్‌జెండర్ సమాజం నుంచి ఒకరికి ప్రాతినిధ్యం ఉంటుంది.
గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు విశ్రాంతి ప్రదేశాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, పార్కింగ్, ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. వీధి వ్యాపారులకు వెండింగ్ జోన్లలో మౌలిక సదుపాయాలు అందించవచ్చు. 70యేళ్ల నాటి చట్టంలో వందకు పైగా కాలం చెల్లిన నిబంధనలు ఉన్నాయి. టాంగాలు, జట్కాలు, ఎద్దుల బండ్లు, గుర్రాలు, ఒంటెలు, ఏనుగులపై పన్నుల ప్రస్తావన కూడా పాత చట్టంలో ఉంది. నగరంలోకి వచ్చే సరుకుపై ఆక్ట్రాయ్ వసూలు, ఆవిరి విజిల్ వాడకంపై అనుమతి, ఐదు నుంచి ఇరవై రూపాయల జరిమానాలు వంటి పాత నిబంధనలకు కొత్త చట్టం ముగింపు పలికిందని సిఎం పేర్కొన్నారు.

## షీర్‌జోన్‌లో 79% పూర్తి

>> ఆశాభావం వ్యక్తం చేశారు. తవ్వకాలతోపాటే సొరంగం లోపలి గోడలను బలపరిచే స్ప్రే లైనింగ్ పనులు చేపడుతున్నారని, దీంతో సొరంగం అనుసంధానం పూర్తయ్యేలోపే లైనింగ్‌లో అధిక భాగాన్ని పూర్తి చేసే అవకాశం ఉందని సమీక్షలో వివరించారు. ప్రధాన సొరంగంతోపాటు టన్నెల్-2, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఇతర అనుబంధ పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. వీటిలో ఏ పని అసంపూర్తిగా ఉన్నా నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. సుమారు 7.1 కిలోమీటర్ల పొడవున్న టన్నెల్-2లో సుదీర్ఘ విరామం తర్వాత లైనింగ్ పనులు తిరిగి ప్రారంభమైనట్లు తెలిపారు. సొరంగం మొత్తం నిడివి 43.968 కిలోమీటర్ల ప్రధాన సొరంగం పనులు సుమారు 79 శాతం పూర్తయ్యాయని, మరో 9.1 కిలోమీటర్ల మేర తవ్వకాలు మిగిలి ఉన్నాయని తెలిపారు అత్యంత ప్రమాదకరమైన షియర్ జోన్‌ను దాటడం ప్రాజెక్టులో ముఖ్యమైన ముందడుగని ఉత్తమ్ పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసిన అధికారులు, కార్మికుల కృషిని అభినందించారు. ఈ పురోగతిని కొనసాగిస్తూ సొరంగంలో 20 కిలోమీటర్లకు పైగా లోపల పనిచేస్తున్న సిబ్బంది భద్రతను కాపాడేందుకు అధికారులు, గుత్తేదారు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌ఎల్‌బిసి సొరంగం ప్రస్తుతం రెండు వైపులా కలిపి రోజుకు సుమారు ఎనిమిది మీటర్ల మేర పురోగతి నమోదవుతోందని వెల్లడించారు. నిరంతరంగా రోజుకు ఏడు నుంచి ఏడున్నర మీటర్లు తవ్వడం జరుగుతోందని, ఒకట్రెండు రోజుల్లో తవ్వకం వేగం పది మీటర్లకు కూడా చేరేఅవకాశం కూడా ఉందని వివరించారు. అవుట్‌లెట్ వద్ద మూడు డ్రిల్లింగ్ భుజాలున్న బూమర్ యంత్రం ఇప్పటికే పనిచేస్తోందని, అక్కడ పనులు అవసరమైన వేగానికి చేరువలో ఉన్నాయని తెలిపారు. గతంలో ఒక్క దఫా పని చక్రం పూర్తయ్యేందుకు సుమారు 48 గంటలు పట్టేదని, ప్రస్తుతం దానిని 20 నుంచి 24 గంటలకు తగ్గించినట్లు ప్రాజెక్టు బృందం వివరించారు. అదనపు యంత్రాలు, వేగవంతమైన తరలింపు వ్యవస్థతో ఈ సమయాన్ని పది గంటలకు తగ్గించగలమని అంచనా వేసింది. అక్టోబర్ చివరి లేదా నవంబర్ ప్రారంభం నుంచి పనుల వేగం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అవసరమైన యంత్రాలను సకాలంలో సమకూర్చి, తవ్వకాల ప్రతి దశలో సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. సొరంగం పనులకు నేతృత్వం వహిస్తున్న భారత సైన్యానికి చెందిన సొరంగ నిర్మాణ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఇన్‌లెట్ వద్ద ఎదురైన పరిస్థితులను వివరించారు. బలహీనమైన నేల, రాళ్లు ఒక్కసారిగా విరిగిపడే రాక్ బర్స్ట్ వంటి ప్రమాదకర పరిస్థితుల కారణంగా మరో ప్రమాదం జరగకుండా తొలి నెలల్లో తవ్వకాల వేగాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించినట్లు తెలిపారు. టన్నెల్ బోరింగ్ మెషిన్ (టిబిఎం) చిక్కుకుపోయిన ప్రాంతాన్ని చుట్టి వెళ్లేలా చేపట్టిన మళ్లింపు తవ్వకాల్లో మరింత బలహీనమైన శిలల మండలం ఎదురైందని వివరించారు. ఈ ప్రాంతాన్ని సురక్షితంగా దాటేందుకు 140 మిల్లీమీటర్ల సీమ్‌లెస్ పైపులతో తవ్వకాలు జరిగే భాగానికి ముందుగా గొడుగు మాదిరి రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమీక్షలో ఎంపీలు కె. రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, కె. జైవీర్‌రెడ్డి, వేముల వీరేశం, అనిల్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్; నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్; ఇంజినీర్ ఇన్ చీఫ్ ఓ.వి. రమేష్‌బాబు, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.


అహ్మదాబాద్‌లో జరగబోయే 'నవరాత్రి' ఉత్సవాల కోసం ఆదివారం పూర్తిస్థాయి డ్రెస్ రిహార్సల్ నిర్వహిస్తున్న పంఘాట్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ గ్రూప్ సభ్యులు

## సహకారంతోనే రైతుకు సమృద్ధి

>> యువతకు ఉపాధి కల్పించడంతోపాటు పాడి రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యమన్నారు. రైతు ఉత్పత్తులకు విలువ జోడింపే లక్ష్యంరైతులు ఉత్పత్తి చేసిన పాలకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం, నిల్వ, ప్రాసెసింగ్, బ్రాండింగ్ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఆశించిన ఆదాయం పొందలేకపోతున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. తూప్రాన్ డెయిరీ ద్వారా పరిసర ప్రాంతాల రైతుల నుంచి పాలు సేకరించి ఇక్కడే ప్రాసెసింగ్ చేయడంతోపాటు పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీ, పన్నీర్, ఐస్‌క్రీమ్, నెయ్యి వంటి ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల పాలకు విలువ జోడింపుతో రైతులకు మెరుగైన ధర లభించడంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వ్యవసాయం అంటే వరి, పత్తి, మిర్చి పంటలే కాకుండా భూమి ఉన్నా లేకపోయినా పశుపోషణ ద్వారా జీవనోపాధి పొందవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పాడి పరిశ్రమ అదనపు ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు. అమూల్ విజయమే రైతుల విజయంసహకార వ్యవస్థతో ఎలాంటి మార్పు సాధ్యమో సాబర్ డెయిరీ ప్రయాణమే నిదర్శనమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 1964లో 19 సహకార సంఘాలతో రోజుకు 5,100 లీటర్ల పాల సేకరణతో ప్రారంభమైన సాబర్ డెయిరీ నేడు రోజుకు సుమారు 50 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ స్థాయికి చేరిందన్నారు. సుమారు 50 వేల మంది పాల ఉత్పత్తిదారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారని, 2025,26లో రూ.10,500 కోట్ల వార్షిక టర్నోవర్ సాధించిందని తెలిపారు. అమూల్ సహకార నెట్‌వర్క్ ద్వారా ఏటా సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నుల పశువుల దాణాను రైతులకు అందిస్తున్నారని, పశువైద్య సేవలను రైతుల ఇళ్ల వద్దకే తీసుకెళ్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా అమూల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, 50కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అమూల్ సాధిస్తున్న గుర్తింపు భారత రైతుల విజయానికి నిదర్శనమన్నారు. 2029 నాటికి 75 వేల కొత్త సంఘాలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకార శాఖను ఏర్పాటు చేసి సహకార రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారని కిషన్‌రెడ్డి అన్నారు. శ్వేత విప్లవం 2.0లో భాగంగా 2029 నాటికి దేశవ్యాప్తంగా 75 వేల కొత్త పాడి సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తెలంగాణలోనూ 1,525 కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. మహిళా సంఘాలు, పాడి రైతులు సహకార సంఘాలుగా ఏర్పడి పశుపోషణను విస్తరించాలని సూచించారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా లభించే రూ.20 లక్షల వరకు రుణాలను సద్వినియోగం చేసుకొని పశువులను కొనుగోలు చేయడం, పాల ఉత్పత్తిని పెంచడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. రైతు బలపడితే దేశం బలపడుతుంది. ప్రపంచంలోనే అత్యధిక పాల ఉత్పత్తి చేస్తున్న దేశంగా భారత్ నిలిచిందని, ప్రపంచ పాల ఉత్పత్తిలో దాదాపు నాలుగో వంతు వాటా భారత్‌దేనని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. హరిత విప్లవం వ్యవసాయ రంగానికి, నీలి విప్లవం మత్స్య రంగానికి కొత్త శక్తినిచ్చినట్లే శ్వేత విప్లవం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో సహకార రంగం కీలక స్తంభంగా నిలవాలన్నదే లక్ష్యమని తెలిపారు. మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ఈ ప్లాంట్ వల్ల సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద నాణ్యమైన పాలు పాఠశాల విద్యార్థులకు అందచేయవచ్చని, రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మందికి నాణ్యమైన పాలు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అందిస్తున్న వివరించారు. మెట్రో కార్యక్రమాల్లో కేంద్రం నుంచి శాఖ సహాయ సహకారాలు అందించాలని మంత్రి కిషన్ రెడ్డి నీ కోరారు. అమూల్ ప్లాంటును చెన్నూరులో ఏర్పాటు చేయాలని , చెన్నూరు పరిసర ప్రాంతాలతో పాటు మహారాష్ట్రలో కూడా మంచి మార్కెటింగ్ ఉంటుందని తెలిపారు. ఐటి శాఖామంత్రి దుద్దెల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల వెన్నెముక పాల డైరీ అన్నారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అనేక పరిశ్రమలను ప్రోత్సహిస్తుందన్నారు. అమూల్ ప్లాంట్ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు గ్రామీణ రైతుల ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని తెలిపారు.

## ఇక బిసి సిఎం

>> ఉందో కచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే జనగణనతో పాటు ఓబిసి కుల గణన నిర్వహించడం అవసరమని పేర్కొన్నారు. కుల గణన ద్వారా ఓబీసీల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై సమగ్ర సమాచారం లభిస్తుందని నేతలు అన్నారు. జనాభా ప్రాతిపదికన వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల్లో తగిన అవకాశాలు కల్పించేందుకు కుల గణన కీలకమని తెలిపారు. ఓబిసిల కోసం మాట్లాడే ఇంత ధైర్యం ఎవ్వరు ఇచ్చారని అంటే అది రాహుల్ గాంధీ ఇచ్చాడని బలహిన వర్గాల కోసం రాహుల్ గాంధీ జోడో యాత్ర చేసి బడుగుబలహిన వర్గాల కోసం పోరాటం చేస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బిసి ముఖ్యమంత్రి ఖచ్చితంగా అవుతున్నారని దానికి రాహుల్ గాంధీ ,రేవంత్ రెడ్డి మద్దతు ఉంటుందన్నారు. కులల మద్దతుతోనే మాకు రావాల్సిన వాటాలను తీసుకుంటామని అవసరమైతే లాక్కుంటామని అన్నారు. బిసిల నమ్మకద్రోహి మోడీ అన్ని బిసిలుగా చెప్పుకుంటూ బిసిలను మోసం చేస్తున్నారని రాష్ట్రంలో చేపట్టిన ఓబిసి పిలుపు మోడికి వినబడాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం 50శాతం బిసిలను సర్పంచ్‌లను చేసిందని అన్నారు. మోడీకి రోజులు మూడినాయి ఒక రెండు సంవత్సరాలల్లో మోడీ దిగిపోవక తప్పందని రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం అనాడు దేశం వ్యాప్తంగా సర్వే చేసుకుంటాం మా వాటా తీసుకుంటాం మా హక్కులు సాధించుకుంటామన్నారు. మంత్రి పోన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ... ఓబీసీల హక్కులు, అవకాశాల విషయంలో స్పష్టమైన విధానాలు రూపొందించాలంటే ముందుగా వారి జనాభా వివరాలు ఖచ్చితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఓబీసీల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఎవ్వరి హక్కులను మనం గుచ్చుకోవడం లేదు ఓబిసిలకు రావాల్సిన హక్కులనే మనం అడుగుతున్నామని కేంద్రప్రభుత్వం వెంటనే కులగణనలో ఓబిసి గణన చేపట్టాలని పోరాటలతోనే ఎద్దైనా సాధించుకుంటామని బలహీన వర్గాలకు అధికారం రావలంటే ఖచ్చితంగా ఓబిసి కులగణన చేయాలన్నారు. మా లెక్కలు తేల్చాలని మా హక్కులు మాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయి నుండి తీర్మాణాలు చేసి కేంద్రానికి పంపాలని కోరారు. అంతకముందు పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కుల గణన విషయంలో కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకుని, జనగణన ప్రక్రియలోనే కులాల వారీగా జనాభాను నమోదు చేయాలని కోరారు. ఓబీసీల హక్కుల సాధన కోసం రాష్ట్రంలో విస్తృతంగా చర్చ, ఉద్యమం కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే కుల గణన అవసరమని అభిప్రాయపడ్డారు. కేంద్రం వెంటనే కుల గణన చేపట్టి వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగబద్ధంగా లభించాల్సిన హక్కులు, అవకాశాలను మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి చేసిన కులగణనను కేంద్రప్రభుత్వం ఆదర్శంగా తీసుకొని ఓబిసి కుల గణనను చేపట్టాలని కేంప్రప్రభుత్వానికి ఎట్లా చేయాల్లో తెలియకపోతే తెలంగాణ రండి చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఓబీసీ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్, ఏఐసీసీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, ఏఐపీసీ చైర్మన్ మధు యాస్కీ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు , చల్లా వంశిచంద్, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, నవీన్ యాదవ్, బిర్ల ఐలయ్య, తదితర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో ఇండిగో విమానానికి తప్పిన ప్రమాదం

**శంషాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త :** శంషాబాద్‌లో ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. పుణె నుండి శంషాబాద్ వస్తున్న ఇండిగో 6ఈ352 విమానాన్ని మార్గమధ్యలో పక్షి ఢీకొట్టింది. దీంతో విమానం ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. పైలెట్ అప్రమత్తమై విషయాన్ని అధికారులకు తెలియజేయడంతో విమాన నిపుణులు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం విమానం శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. ఈ విమానం శంషాబాద్ నుంచి చండీగఢ్ వెళ్ళాల్సి ఉండగా.. పక్షి ఢీకొన్న ఘటన నేపథ్యంలో సర్వీసును రద్దు చేశారు. విమానానికి జరిగిన నష్టాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.



రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ కార్యాలయంలో శుభ్రం చేస్తున్న జిఎం లలిత్‌కుమార్

## సింగరేణిలో పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ

### నెల రోజులపాటు కార్యక్రమాలకు నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని సింగరేణి ఉద్యోగులకు పిలుపునిచ్చింది. దీనికి సంబంధించి సింగరేణి కాలరీస్, రామగుండం ఏరియా1 జనరల్ మేనేజర్ కార్యాలయంలో నెల రోజుల పాటు పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షి ంచేందుకు, అధీకృత రీసైక్లర్లు, రిజిస్టర్డ్ ఏజెన్సీల ద్వారా ఇవ్యర్థాలను సక్రమంగా సేకరించి, వేరుచేసి, పారవేయాల్సి న అవసరాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు. పరిశుభ్రతను పాటించడం ప్రతి ఉద్యోగి సమిష్టి బాధ్యత అని తెలిపారు. కార్యాలయాలు, పని ప్రదేశాలు, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య కార్యక్రమాలలో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన సిబ్బందిని కోరారు. ఈ ప్రచారం అక్టోబర్ 2 నుండి 31 వరకు కొనసాగు తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ అధికారి వేణు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారితో పరిశుభ్రతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం, లలిత్ కుమార్ సీఎంపీఎఫ్ కార్యాలయ ప్రాంగణంలోని పార్కులో ఉన్న కలుపు మొక్కలను, చెత్తను తొలగించారు. అధికారులు, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రపరిచారు.

## కామారెడ్డిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

**హైదరాబాద్,అక్టోబరు4,ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అఖిల్ ఆత్మహత్య చేసుకోవడంతో ఆ గ్రామంలో విషాదం నిండింది. హైదరాబాద్‌లోని ఒక కంపెనీలో ఉద్యోగం చేస్తున్న అఖిల్ తలితండ్రులను చూసేందుకు వారం క్రితం గ్రామానికి వచ్చారు. అఖిల్ పడుకొనే గది నుంచి బయటకు రాకపోవడంతో ఆదివారం ఉదయం ఆయన తలితండ్రులు ఆయను పిలిచారు. గదికి గడియపెట్టి ఉండటంతో ఎంతపిలిచిన ఆస్పందన రాకపోవడంతో గదిలోపలికి వెళ్ళి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కన్పించారు. సమాచారం అందుకొన్న పోలీసులు సంఘటనా స్థలం వెళ్ళి మృతదేహాన్ని బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. గతకొన్ని రోజులుగా అఖిల్ కడుపునొప్పితో బాధపడుతున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తండ్రి నారాయణ పేర్కొన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఓటమి భయంతో రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై కాంగ్రెస్ విషప్రచారం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 4 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఎదురవుతున్న వరుస ఎన్నికల పరాజయాలను తట్టుకోలేక, ప్రజాతీర్పును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అవమానిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో వరుసగా మూడు పర్యాయాలు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించి, నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రధానిగా ఆశీర్వదించడాన్ని ఆ పార్టీ నాయకత్వం జీర్ణించుకోలేక పోతోందని పేర్కొన్నారు. ప్రధాని పీఠం కేవలం నెహ్రూ గాంధీ కుటుంబానికి మాత్రమే సొంతమనే రాచరికపు అహంకారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, ఒక సామాన్య చాయ్‌వాలా దేశ ప్రధాని పదవిని చేపట్టి విజయవంతంగా పరిపాలన సాగించడాన్ని ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ బూటకమని, వాటిని రద్దు చేయాలంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడటం భారత ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును వినియోగించుకున్న కోట్ల మంది పౌరుల వివేకాన్ని అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీతో పాటు ప్రకాశ్ రాజ్ లాంటి శక్తులు ఏకమై భారత అత్యున్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు), రాష్ట్రపతి కార్యాలయం, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వంటి రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు. ఈ విధంగా వ్యవస్థలను బలహీనపరిచి దేశ సమగ్రతకు భంగం కలిగించేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని విమర్శించారు.

హైదరాబాద్ నగర పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ( ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఈ ప్రక్రియను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగమే నిర్వహిస్తోందని, ఏవైనా అభ్యంతరాలుంటే వాటిపై ఎన్నికల సంఘం క్షేత్రస్థాయి విచారణ జరిపిన తర్వాత మాత్రమే ఓట్ల తొలగింపుపై నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఫామ్7 సమర్పించినంత మాత్రాన ఓట్లు నేరుగా తొలగించబడవని, దొంగ ఓట్లు, నకిలీ ఓట్ల ఏరివేత కోసమే నిబంధనల ప్రకారం ఫామ్7 విధానం ఉందని గుర్తుచేశారు. పైగా బిజెపికి చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్ఏ1, బిఎల్ఏ2) ఎవరూ కూడా అటువంటి దరఖాస్తులు సమర్పించలేదని స్పష్టం చేశారు. విచారణ దశలోనే ఉన్న అంశంపై ఇప్పుడే ఓట్లు తొలగించేస్తున్నారంటూ కాంగ్రెస్ రాద్ధాంతం చేయడం పూర్తిగా అభ్యంతరకరమని అన్నారు. ఎక్కడైనా ఎన్నికల్లో గెలిస్తే వ్యవస్థలు సక్రమంగా ఉన్నాయని, ఓడిపోతే మాత్రం ఈవి ఎంలు, ఎస్ఐఆర్ ప్రక్రియలపై నిందలు వేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. కేరళ వంటి రాష్ట్రాల్లో గెలిచినప్పుడు ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రశంసించిన ఆ పార్టీ నేతలు, ఓడిపోయే చోట మాత్రం బురదజల్లుతున్నారని ఆక్షేపించారు. దేశంలో ఇప్పటికే అధిక భాగం కాంగ్రెస్ ముక్త్ భారత్ ఏర్పడిందని, మిగిలిన రెండు మూడు రాష్ట్రాల్లోనూ ప్రజలు ఆ పార్టీని తిరస్కరించడం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కించపరుస్తూ, నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ పన్నుతున్న కుట్రలను భారత ప్రజలు ఎక్కడికక్కడ తిప్పికొడతారని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బిజెపి రాజీలేని పోరాటం చేస్తుందని ఎన్. రాంచందర్ రావు హెచ్చరించారు.



బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర చీఫ్ ఎన్.రాంచందర్‌రావు

# నేటి నుండి రాష్ట్రంలో మళ్లీ వర్షాలు

### గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు
### తెలంగాణలో భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలు
### అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 39.7 డిగ్రీల నమోదు

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** వేసవి కాలాన్ని మించి పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఎండ వేడిమికి ఉక్కిరి బిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ తీపికబురు చెప్పింది. ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. భానుడి ప్రతాపం కారణంగా ఉదయం నుంచే ఎండలు మండుతుం డడంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ క్రమంలో మూడురోజుల పాటు వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది. ఈ నెల 5 నుంచి రాష్ట్రంలోని కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. అలాగే, ఈ నెల 6న కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట్, మహబూబాబాద్, భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురిసే అవకాశాలున్నాయని అంచనా వేసింది. అలాగే, 7వ తేదీన భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని వివరించింది.

**భారీగా 40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు**

కాగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. సాధారణం మించి నమోదవుతున్నాయి. వేసవి కాలాన్ని మించి ఉష్ణోగ్రతలు నమోదవుతుం డటంతో ఎండలు మంటపెడుతున్నాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లా 39.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోత్రలు రికార్డయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా సగటున 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 24 జిల్లాల్లో 36 డిగ్రీల నుండి దాదాపు 40 డిగ్రీల వరకూ గరిష్ట ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి. మరో 6 జిల్లాల్లో 35 డిగ్రీలకు పైబడి నమోదుకావడం గమనార్హం. గ్రేటర్ హైదరాబాద్‌లో 35.1 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

## వానాకాలం సన్నాల గుర్తింపునకు శిక్షణ పొందిన సిబ్బంది నియామకం

### వ్యవసాయ శాఖ చర్యలు

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ప్రస్తుత వానాకాలం మార్కెటింగ్ సీజనులో కొనుగోలు కేంద్రాల్లో సన్న రకాల వరి ధాన్యాన్ని గుర్తించేందుకు వ్యవసాయ శాఖ శిక్షణ పొందిన ఉద్యోగులను నియమించనుంది. అధికారవర్గాల సమాచారం మేరకు ఈ ఏడాది బోనస్‌కు అర్హత ఉన్న ఏడు నాణ్యమైన వరి రకాలను గుర్తించడంలో తీవ్ర సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉండటంతో దీన్ని అధిగమించేందుకు శిక్షణ పొందిన వారు అవసరమని భావిస్తోంది. గత ఏడాది దాదాపు 40 వరి రకాలకు బోనస్ ఇవ్వగా, ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం దాన్ని ఏడు రకాలకు మాత్రమే పరిమితం చేసింది. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన దొడ్డు, సన్న రకం ధాన్యానికి సంబంధించి పొడవు, వెడల్పులో ఒకదానికొకటి చాలా దగ్గరగా పోలి ఉండటం వల్ల, వాటి రకాలను గుర్తించడం ఒక సవాలు ఎదురుకానుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, బీఎస్సీ పట్టభద్రులతో సహా అర్హతగల సిబ్బందిని నియమించడానికి వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఎంపికైన అభ్యర్థులకు సేకరణ కేంద్రాలలో నియమించే ముందు వారికి శిక్షణ కూడా ఇవ్వనుంది. కాగా బోనస్‌కు అర్హత ఉన్న ఏడు సన్నాలు వరి రకాల్లో బిపిటి5204, హెచ్‌ఎంటి సోనా, జై శ్రీరామ్, కెఎన్ఎమ్ 1638, కెఎన్ఎమ్ 7715, ఆర్ఎన్ఆర్ 15048, డబ్ల్యుజిఎల్ 44 ఉన్నాయి. అయితే, పరిమాణంలో వీటిని పోలిన మరో 30 రకాలు కూడా ఉన్నాయి. అయితే, ధాన్యపు గింజల పరిమాణం పొలానికి పొలానికి కొద్దిగా మారుతూ ఉండటం వల్ల, అర్హత ఉన్న ఏడు రకాలను గుర్తించడం సమస్య అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు.

## బిజెపి సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్‌తో ఎంపి డికె అరుణ భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్‌తో ఎంపి డికె అరుణ భేటి అయ్యారు. రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమి తులైన మధుకర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మా నించి, శుభాకాంక్షలు తెలిపారు. తాజా రాజకీయ పరిణామాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌రోల్‌మెంట్, సేవ సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో కర్ణాటక సహ ఇంచార్జ్ కాచం వెంకటేశ్వర్లు, ఎంపి గోడెం నగేశ్, నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌పై మజ్లిస్ అధినేత ఆరోపణలు

### జైళ్ల శాఖ ఖండన

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ఈ యేడాది మే నెల 23వ తేదీన నాంపల్లిలో హత్యకు గురైన హైకోర్టు న్యాయవాది ఖాజా మొయిజు ద్దీన్ (63) హత్య కేసులో నిందితుడుగా చంచల్‌గూడ జైల్లో రిమాండులో వున్న 83 ఏళ్ల వృద్ధుడికి బెయిల్ లభించిన విషయంలో తమ ప్రమే యం ఏమీ లేదని జైళ్ల శాఖ డిఐజి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హత్య కేసులో ని ందితుడుగా ఐదు నెలలుగా చంచల్‌గూడ జైల్లో వున్న వృద్ధుడికి అనారోగ్య కారణాలతో హైకోర్టు బెయిల్ ఇచ్చిందని డిఐజి శ్రీనివాస్ ఈ సందర ్భంగా తెలిపారు. ఇందులో చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ ప్రమేయం కానీ ఇతర అధికారుల పాత్ర కానీ ఏమీ లేదని ఆయన తెలిపారు. దీనిపై మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసి సహా ఇతర నేతలు తమపై ఆరోపణలు చేయడం సరికాదని ఆయన తెలిపారు.

రాష్ట్ర జైళ్ల శాఖలోని అన్ని జైళ్లు నిబంధ నలకు లోబడి పనిచేస్తున్నాయని, అంతా పారదర్శకంగానే వుంటుందని, ఎక్కడా ఎలాంటి అవినీతికి తావులేదని, జైళ్లలో ఖైదీల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన తెలిపారు. హత్య కేసులో నిందితుడికి బెయిల్ రావడానికి చంచల్‌గూడ జైలు సూపరింటెండె ంట్ రెండు కోట్ల రూపాయలు లంచం తీసుకున్నారని ఆరోపణలు చేయడం సరైంది కాదని. ఇది ముమ్మాటికి అబద్దమని డిఐజి శ్రీనివాస్ తెలిపారు.

## రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి గుండెపోటుతో రైతు మృతి

### రికార్డుల్లో భూమి లేదని చూపిస్తున్నారని కుటుంబసభ్యుల ఆరోపణ
### సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని గ్రామస్థుల డిమాండ్

**షాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త :** భూమి సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన ఓ పేద రైతు గుండెపోటుతో మృతి చెందిన విషాద ఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడలో చోటుచేసుకుంది. భూమికి సంబంధించిన సమస్య పరిష్కారం కాకపోవడంతో కొంతకాలంగా తీవ్ర మనస్తాపానికి గురైన రైతు వారణాసి యాదయ్య (55) శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో తన భూమి విషయంపై మాట్లాడి నిద్రపోయాడు. ఆదివారం తెల్లవారుజామున ఆయన గుండె పోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 483లో వారణాసి యాదయ్యకు నాలుగు ఎకరాల లావణి భూమి ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఈ భూమిని ప్రభుత్వం అభివృద్ధి పనుల నిమిత్తం స్వాధీనం చేసుకుని టీఎస్ఐఐసీకి అప్పగించింది. అసైన్డ్ భూములకు పరిహారంగా హెచ్ఎండీఏ లేఅవుట్‌లో ఎకరాకు 800 గజాల చొప్పున ఇంటి స్థలం కేటాయించే విధానం ఉందని తెలిపారు. అయితే యాదయ్యకు సంబంధించిన నాలుగు ఎకరాల భూమి ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. భూమి వివరాలను సరిచేయడంతో పాటు తనకు రావాల్సి న ప్లాట్లు కేటాయించాలని కోరుతూ యాదయ్య పలుమార్లు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరిగినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులను కలిసి తన సమస్యను చెప్పుకున్నా పరిష్కారం లభించలేదని అన్నారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన యాదయ్య అనారోగ్యానికి లోనై గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రికార్డులపై అనుమానాలుసర్వే నంబర్ 483కు సంబంధించిన భూ రికార్డుల్లో అవక తవకలు జరిగాయనే అనుమానాలు గ్రామ స్తులు వ్యక్తం చేస్తున్నారు. ఉన్న భూమిని లేనట్లు, లేనివారికి ఉన్నట్లు రికార్డుల్లో చూపించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. భూ రికార్డులపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన రైతులకు న్యాయం చేయాలని గ్రామ సర్పంచ్ చెన్నయ్య, గ్రామస్తులు ఆంజనేయులు డిమాండ్ చేశారు. షాబాద్ తహసీల్దార్ అన్వర్ అర్హులందరికీ తప్పనిసరిగా పరిహారం అందేలా చర్యలు తీసు కుంటున్నామని షాబాద్ తహసీల్దార్ అన్వర్ తెలి పారు. లబ్ధిదారుల జాబితా ఇంకా తుది దశకు రాలేదని, గ్రామస్తుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపడుతున్నామని చెప్పారు. విచారణ అనంతరం అర్హులకు ప్లాట్లు కేటాయిస్తామని, అనర్హు లను జాబితా నుంచి తొలగిస్తామన్నారు.



యాదయ్య (ఫైల్)

## ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వివక్ష ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వివక్షకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు మానిటరింగ్ కమిటీ సభ్యులు కవ్వంపల్లి సతీష్ ఆదివారం పోలీస్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసి తదుపరి మాట్లాడారు. దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినప్పుడు కేసు నమోదు చేయడంలో ఎలాంటి జాప్యం చేయకూడదన్నారు.

నిజమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులను భయాందోళనకు గురిచేసే ఉద్దేశంతో కౌంటర్ కేసులు పెట్టే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి నెల చివరి రోజున నిర్వహించే పౌరహక్కుల దినోత్స వానికి పోలీసు శాఖ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖ ద్వారా అన్ని శాఖలకు ముందస్తుగా సమాచారం అందుతున్నందున, పోలీసు అధికారులు కూడా సమావేశాల్లో పాల్గొని ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. బాధితుల ఫిర్యాదుల విషయంలో ఏ అధికారి అయినా నిరక్ష ్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా పర్యవేక్షణ ఉండాలని కోరారు.

## గ్రామకంతాలుగా గుర్తించి భూసమీకరణ నుంచి మినహాయింపు: ఏపి సిఎం చంద్రబాబు

**అమరావతి,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో గ్రామకం తాలుగా గుర్తించి భూసమీకరణ నుంచి ఇచ్చిన మినహాయింపులను పునః పరిశీలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. నిబంధనల ప్రకా రమే గ్రామ కంతాలను నిర్ధారించారా? మినహాయింపులు సక్రమంగా ఇచ్చా రా? అనే అం శాలను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికను సీఆర్డీఏ అథా రిటీకి సమర్పిం చాలని సూచించారు. ఈ అంశంపై పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణతో ఇప్పటికే సమావేశమై కీలకంగా చర్చించారు. రాజ ధాని పరిధిలోని 29గ్రామాల్లో 2014-19 మధ్య గ్రామకంతం కింద పరిగణిం చిన భూములను భూసమీకరణ నుంచి మిన హాయించారు. రాజధాని ప్రకటన చేసే నాటికి ఉన్న గ్రామకంతాలతో పాటు విస్తరించిన ప్రాంతాలను ఉపగ్రహ చిత్రాలు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా గుర్తించారు.

## కొనసాగుతున్న భక్తుల రద్దీ



**తిరుమల,అక్టోబరు 4ప్రభాతవార్తప్రతినిధి:**పెరటాసి మాసంకావడంతో తిరుమలేశుని దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.భారీగా భక్తులు రావడంతో కొండపై రద్దీ అనూహ్యంగా పెరిగింది. ఆదివారం ఉదయానికి వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్ మెంట్లు భక్తులతో నిండిపో యాయి. శ్రీవారి సర్వదర్శనానికి ఉదయం 5గంటలకే శిలాతోరణం వరకు భక్తులు వెలుపల వేచి ఉన్నారు.సాయంత్రంవరకు 52వేలమంది భక్తులు స్వామివారిని దర్శ నంచేసుకున్నారు. ప్రతి భక్తునికి 2నుండి 4లడ్డూల వరకు విక్రయిస్తున్నారు.

## కెసిఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని పాదయాత్ర

### మంథని నుండి 5 రోజుల పాదయాత్ర చేసి ఎర్రవెల్లికి చేరుకున్న అభిమానులు

**హైదరాబాద్,అక్టోబరు4,ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావు తిరిగి ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష రోజు రోజుకూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో బలపడుతున్న దని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు ఇప్పటికే పలు సందర్భాల్లో పాదయాత్రలు, తదితర దీక్షల ద్వారా కేసీఆర్ పట్ల తమ అభిమానాన్ని చాటుకుంటున్న విషయం తెలిసిందే. ఇదే కోవలో మరో ముగ్గురు యువకులు మంథని నుండి పాదయాత్ర చేస్తూ ఆదివారం నాడు ఎర్రవెల్లి కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. తెలంగాణ ప్రగతి సాధకుడు కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి గాడిలో పడుతుందని, ఉద్యోగ ఉపాధి రంగాల్లో తెలంగాణ యువతకు అవకాశాలు మెరుగవుతాయని పాదయాత్ర చేసిన ముగ్గురు యువకులు మంథని బెన్నిపాల్, బూర్ల వెంకటేశ్, కొండ వెంకటేశ్ తెలిపారు.మంథని నుండి పాదయాత్ర చేస్తూ వచ్చిన బిఆర్ఎస్ యువ కార్యకర్తలను సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ గారు వారితో కాసేపు ముచ్చటించారు. తనపట్ల వారు చూయించిన అభిమా నానికి ధన్యవా దాలు తెలిపారు. కాగా.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అను గుణంగా పనిచేయ డంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవ్వడమే గాక, పూర్తి విరుద్ధంగా పని చేస్తున్నదనే విషయాన్ని ప్రజలు గ్రహించారని, తమ పాదయాత్ర సంద ర్భంగా ప్రజలతో వారి అనుభవాలను కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. కేసీఆర్ పాలనలో తాము అనుభవించిన పాలనా ఫలితాలను రాష్ట్ర ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుం టున్నారని, కాంగ్రెస్ హామీ లను నమ్మి మోస పోయి తాము ఏమి కోల్పోయామో అర్థం చేసుకు న్నారని వారు తెలిపారు.



మంథని నుండి పాదయాత్ర చేస్తూ వచ్చి మాజీ సిఎం కెసిఆర్‌ను ఎర్రవెల్లి నివాసంలో కలుసుకున్న యువకులు.. బూర్ల వెంకటేశ్, కొండా వెంకటేశ్, మంథని బెన్నిపాల్.

# నిజాం షుగర్స్ మరింత జాప్యం

### చొరవ చూపని కేబినెట్ ఉప సంఘం

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** నిజాం దక్కన్ షుగర్స్ పునరుద్ధరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ ఉపసంఘం నిద్రావస్థల్లో కొట్టుమిట్టాడుతోంది. మంత్రివర్గ ఉపసంఘం గత ఏడాదిగా చర్చలు జరపకపోవడంతో, నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డిఎస్ఎల్) పునఃప్రారంభం మరింత జాప్యమవుతోందనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ప్రైవేట్ సంస్థ డెల్టా పేపర్స్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదరకపోవడమే ఈ ఆలస్యానికి కారణమని చెబుతున్నారు. ఇందుకు మంత్రివర్గ ఉపసంఘం చొరవ చూపడం లేదని పలువురు రైతులు అంటున్నారు. ఫ్యాక్టరీ 11 ఏళ్లుగా మూసి ఉండటంతో సంప్రదాయ చెరకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫ్యాక్టరీ లేకపోవడంతో ఎక్కువ మంది రైతులు ఇతర పంటలకు, ముఖ్యంగా వరికి మారినప్పటికీ, కొంతమంది మాత్రం సాంప్రదాయ చెరకు రైతులు సాగును కొనసాగిస్తూ, తమ పంటను కామారెడ్డిలోని ఒక ప్రైవేట్ చక్కెర కర్మాగారానికి పంపుతున్నారు. దీని ఫలితంగా, చెరకు సాగు విస్తీర్ణం తీవ్రంగా తగ్గిపోయింది. కాగా 2014 ఎన్నికల ప్రచార సమయంలో, ప్రైవేట్ యాజమాన్యం నుండి ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుంటామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఆ హామీని అమలు చేయకపోగా, 2015 డిసెంబర్ 23న మూడు యూనిట్లను మూసివేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో చక్కెర కర్మాగారాలను తిరిగి తెరుస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు నేతృత్వంలో ఒక కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. కమిటీ తన నివేదికను సమర్పించే ముందు ఫ్యాక్టరీని సందర్శించి రైతులతో చర్చించింది. ఆ నివేదిక ఆధారంగా, ప్రభుత్వం రూ. 400 కోట్ల బకాయిలకు గాను, ఒకేసారి పరిష్కారం కింద రూ.190 కోట్ల బ్యాంకు రుణాలను మంజూరు చేసింది. అయితే 51 శాతం మెజారిటీ వాటా ఉన్న డెల్టా పేపర్స్‌తో ప్రభుత్వం ఒక అవగాహనకు తీసుకొచ్చే దిశగా మంత్రివర్గ ఉప సంఘం ఎటువంటి చర్యలూ తీసుకోలేదని, అందువల్ల పునఃప్రారంభం ఆలస్యమైందని రైతు సంఘాల నేతలు విమర్శిస్తున్నారు.

వార్త

మానవుడు పక్షిలా ఆకాశంలో ఎగరడం, చేపలా నీటిలో ఈదడం నేర్చుకున్నాడు కాని, మనిషిగా భూమి మీద బతకడం నేర్చుకోలేదు.

- బెర్ట్రాండ్ రస్సెల్

# సమర 'శాంతి' ఏదీ?

కురుక్షేత్ర యుద్ధం 18 రోజులు జరిగేసరికి పాండవులు కౌరవుల్ని మట్టి కరిపించారు. అది ఇతిహాస చరిత్ర చెప్పే విషయం. కానీ తాజాగా ఈ భూమ్మీద జరుగుతున్న యుద్ధాలకు సుదీర్ఘకాలమైనా ముగింపు పలకడం లేదు. ఎప్పటికప్పుడు కూడదీసుకున్న శక్తితో ఇరాన్ అమెరికా మీద, ఉక్రెయిన్ రష్యా మీద ఒంటికాలి మీద లేస్తున్నాయి. అటూ ఇటూ రెండు యుద్ధాల్లోనూ చెప్పుకోదగిన ప్రాణనష్టమే జరిగింది. ఉక్రెయిన్, ఇరాన్‌కు పెద్ద ఎత్తున ఆస్తినష్టం సంభవించినా మనస్తత్వంతో యుద్ధతంత్రంలో వెనుకడుగు లేదు. ఎంత కష్టం ఎదురైనా ఎంత నష్టాలు కలిగినా 'యుద్ధ భేరి' ఆపడం వారి తరమూ కావడం లేదు. కిందపడినా మళ్లీ మళ్లీ లేస్తూనే ఉన్నారు. వీరందరిదీ విరామం అటు పిమ్మట పోరు, మళ్లీ విరామం ఇలా ఆటవిడుపు యుద్ధానికి అంతెక్కడ అనే ధోరణిలో ప్రశ్నించుకోవాల్సి వస్తోంది. అసలు, సిసలు అణ్వాయుధాలు తయారు చేస్తుందేమోనన్న భయంతోనే అమెరికా ఇరాన్‌పై యుద్ధం మొదలు పెట్టింది. అడపాదడపా హెచ్చరికలు, కొన్ని సందర్భాల్లో అసురుసురు అంటూనే అనేక అంతరాయాల మధ్య అమెరికా కాలుదువ్వుతూనే ఉంది. అణ్వాయుధాలున్న రష్యా మాత్రం ఉక్రెయిన్‌పై ఉపరితల విన్యాసాల ద్వారానే యుద్ధంచేస్తోంది. కానీ తాజాగా ఉక్రెయిన్ రష్యా మీద గురువారం తొలిసారిగా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించింది. అదే రష్యాకు, చిర్రెత్తుకొచ్చింది. ఉక్రెయిన్ ప్రధానంగా యుద్ధానికి గురిపెడుతున్న బాలిస్టిక్ క్షిపణిదీర్ఘశ్రేణి డ్రోన్ల కంటే చాలా ఎక్కువ దాడి శక్తిని అందిస్తుంది. డ్రోన్లు బలమైనవే అయినా రష్యా బంకర్లు, వంతెనలు, కాంక్రీట్ భవనాల వంటి లక్ష్యాలను ధ్వంసం చేయలేవు. బాలిస్టిక్ క్షిపణి అనగానే డ్రోన్ల కన్నా అత్యంత వేగంగా ప్రయోగించిన అనంతరం వాతావరణం బయటకు వెళ్లి గంటకు వేల కి.మీ వేగంతో లక్ష్యంపై గురిపెడుతుంది. అందుకే రష్యా భయపడుతున్నట్లుంది. ఒక్కసారిగా అణ్వస్త్ర ప్రసక్తి తెచ్చింది. రష్యా భూభాగమైన కలినిన్ గ్రాడ్‌పై నేరుగా దాడి జరిగితే అణ్వాయుధాలను ప్రయోగించేందుకుకూడా వెనుకాడబోమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరించారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమ దేశాలు ఉద్రిక్తతలను మరింత పెంచితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని చెప్పడాన్నిబట్టి రష్యా అవసరమైతే తన వ్యూహాన్ని మార్చుకుంటుందని అర్థం చేసుకోవాలి. ఉక్రెయిన్ సొంత బాలిస్టిక్ క్షిపణి సాధించగానే రష్యా వెంటనే అణుబాంబు కార్డు తీసింది. ఉక్రెయిన్ ఇప్పుడు 200-250కి.మీ దూరం లక్ష్యంతో క్షిపణి తయారుచేయగలిగితే, రేపెప్పుడో 500కి.మీ.అటుపై రష్యాను గురిచూసి కొట్టగల క్షిపణిని తయారు చేయదన్న గ్యారంటీ ఏమీ లేదు. అందుకే తన హెచ్చరికలతో ముందరి కాళ్లకు బంధం వేసింది. ఎఫ్‌పి7 బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించిన రోజే రష్యా అధ్యక్షుడు పుతిన్ వాల్దాయ్ ఫోరమ్‌లో 'రష్యాపై ప్రత్యక్ష దాడి జరిగితే, మా ఆయుధరంగంలో ఉన్న అన్ని రకాల ఆయుధాలను వాడేస్తాం' అని ఓ బెదరింపు వ్యాఖ్యచేశారు. కలినిన్ గ్రాడ్‌పై దాడి జరిగితే అణ్వస్త్ర ప్రతిస్పందన హెచ్చరికల వచ్చింది. అన్నీ కలిసి వస్తే ఉక్రెయిన్ వెనుకడుగువేయదు. అందుకే రష్యాఅన్ని కోణాల నుంచి నరుక్కువస్తోంది. రష్యా నిఘాసంస్థద్వారా బ్రిటన్, ఫ్రాన్స్ రహస్యంగా ఉక్రెయిన్‌కు అణ్వస్త్ర సాంకేతికను అందచేస్తున్నట్లు ప్రచారం కొనసాగిస్తోంది. పనిలో పనిగా అధిక సామర్థ్యపు క్షిపణులు తయారీకి అవకాశం రానీయకుండా అణ్వాయుధ ప్రస్తావనతో పశ్చిమదేశాలు ఉక్రెయిన్‌కు ఆర్థికసంపత్తి నివ్వకుండా పరోక్ష హెచ్చరికలు చేసిందనే చెప్పాలి. ఇదో రకం యుద్ధతంత్రం. 2024లో రష్యా ప్రతిపాదించిన అణ్వాయుధ సిద్ధాంతం ప్రకారం ఇప్పుడు అణ్వాయుధం లేని ఏదేశమైనా, అణ్వాయుధం కలిగిన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాలతో కలిసి తమ దేశంపై ఎలాంటి దాడి చేసినా దానిని ఉమ్మడి దాడిగా పరిగణించి 'అణ్వస్త్ర' ప్రయోగాన్ని తలపెట్టవచ్చు. ఇప్పటి పరిస్థితులను రష్యా తనకుఅనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది. గతమూడేళ్లుగా రష్యాఇస్కాందర్, కింజల్ వంటి బాలి స్టిక్ క్షిపణులతో ఉక్రెయిన్‌పై ఆధిపత్యం చెలాయించింది. దాంతో ఉక్రెయిన్ తానూ బాలిస్టిక్ క్షిపణిని తయారు చేయగల సామర్థ్యాన్ని సాధించేసరికి రష్యాకు ఎటూతోచడం లేదు. అందుకే మళ్లీ రష్యా అణ్వస్త్ర ప్రయోగానికి తమకేదీఅడ్డుకాదన్న ధోరణితో హెచ్చరికలు చేసింది. ఉక్రెయిన్ మాత్రం దేశ రక్షణ స్వావలంబనకు నిదర్శనంగా బాలిస్టిక్ క్షిపణి తయారీని పేర్కొంటోంది. నిజానికి ఆ క్షిపణిని ఉక్రెయిన్ ప్రైవేట్ రక్షణ సంస్థ 'ఫైర్ పాయింట్' తయారు చేసింది. రష్యా అణ్వస్త్రం వాడితే 'నాటో' నేరుగా యుద్ధక్షేత్రంలోకి దిగే ప్రమాదం ఉంది. కనుకనే రష్యా తన జాగ్రత్తలు తాను తీసుకుంటోంది. 200కి.మీ టాక్టి కల్ క్షిపణి వల్ల రష్యా మనుగడకు ముప్పేమీ లేదు. రష్యా బలహీనతకు ఇదో సంకేతం అనుకోవాల్సిందే. ఉక్రెయిన్‌కు తమ సరిహద్దుకు 200 కి.మీలోపల ఉన్న రష్యాఆయుధ డిపోలు, కమాండ్ సెంటర్లను మాత్రమే ఏమార్చగలవు. నాటోసభ్య దేశాలైన పోలండ్, లిథువేనియాల మధ్యఉన్న కలినిన్‌గ్రాడ్ ప్రాంతం రష్యాకు కీలక వ్యూహాత్మక ప్రాంతం. అందువల్లనే రష్యాఅణ్వాయుధ తంత్రాన్ని బయటకు తెచ్చింది. నాటో సైనికంగా రష్యాకన్నా రెండింతలు పెద్దది. అందుకే పుతిన్ 'కలినిన్ గ్రాడ్'పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉక్రెయిన్‌కు యూరప్ కర్మాగారాలు ఆయుధసరఫరా చేస్తున్నందున రష్యాబహుముఖ వ్యూహాలు పన్నుతోంది. రష్యా ఉక్రెయిన్‌ల మధ్య చిచ్చు రగిలి, యుద్ధం ప్రారంభమై ఇప్పటికి1683 రోజులైంది. అయినా యుద్ధ విరమణ ఎప్పుడో చెప్పగలిగిన పరిస్థితి లేదు.

మాటలతో నీ శక్తిని వ్యర్థం చేయక కార్యరూపంలో సాధించి చూపెట్టు.



స్వామి వివేకానంద

ఆశ ఉత్తర ధృవం, విధి దక్షిణ ధృవం ఈ రెండింటి మధ్య ఎగిరిపడే ప్రహసనమే మానవుడు.



బాలగంగాధర్ తిలక్

## ప్రజావాక్కు



### రూపాయి క్షీణత

డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.96 అంచుకు చేరడం భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ఒత్తిళ్లకు సంకేతంగా మారింది. ప్రస్తుతం రూపాయి సుమారు రూ.95.97వద్ద కదలాడుతుండగా, దానిక్షీణతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రూపాయిని నిలబెట్టేందుకు రిజర్వు బ్యాంకు జోక్యం చేసుకుంటున్నప్పటికీ, సమస్యకు మూలకారణాలను పరిష్కరించడంమరింత అవసరం. రూపాయిపైప్రధానంగా రెండుఅంశాలు ఒత్తిడి పెంచుతున్నాయి. మొదటిది ముడిచమురు ధరల పెరుగుదల. భారతదేశం తనచమురు అవసరాల్లో దాదాపు90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరిగినప్పుడల్లా డాలర్లకు డిమాండ్ పెరిగి రూపాయి బలహీనపడుతుంది. రెండోది విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ. విదేశీ నిధులు బయటకు వెళ్లడం వల్ల కూడా డాలర్లకు డిమాండ్ పెరిగి మారకం విలువపైప్రభావం పడుతోంది. రూపాయి క్షీణత ప్రభావం చివరకు సామాన్యుడి జీవితంపైనే పడుతుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### భారత్, దక్షిణాఫ్రికాల స్నేహ బంధాలు

యూనెస్కో హెరిటేజ్ లిస్ట్‌లో భారత్‌నుండి 5 ప్రాంతాలు చోటు సంపాదించాయి. అందులో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని 4ప్రదేశాలు, భారత్ దక్షిణాఫ్రికాలోని గాంధీ గడిపిన ప్రదేశాలు లిస్ట్‌లో చోటు దక్కించుకోవడం విశేషం. ఇక ఇక్కడే ఒక ప్రత్యేకత ఉన్నది గాంధీ గడిపిన సబర్మతి ఆశ్రమం కావొచ్చు ఆగాఖాన్ ప్యాలేస్ కావొచ్చు ఇంకా పీటర్ బర్గ్ స్టేషన్ కావొచ్చు ఇవన్నీ ఆ లిస్ట్‌లో చోటు సంపాదించాయి. ఇది భారత్, దక్షి ణాఫ్రికాకు గర్వకారణం.

- భారత అవినాష్, జనగామ

### యువత తెలుసుకోవాలి

నేటి యువత ఏది నిజం, ఏది అబద్ధం అనేది నిజ నిర్ధారణ చేసుకుని మాట్లాడాలి. ఎక్కడఎలా ఏమి మాట్లాడాలి. మాట్లాడితే భవిష్యత్‌లో జరిగే పరిణామాలు ఏంటి అనేది ఆలోచించాలి. కొందరు యువత అడ్డగోలుగా మాట్లాడతారు. అసలు దేనికి ఏం మాట్లాడాలో అసలు వాళ్ళు ఏం మాటాడుతున్నారో వాళ్లకు కూడా తెలియదు. కొందరికి బానిసలుగా మారి చిన్నపెద్ద తేడాలేకుండా ఊకదంపుడు మాటలు మాట్లాడతారు. మన స్థాయి ఏంటి మనం మాట్లాడేవారి స్థాయి ఏంటి అనేది తీసుకోవాలి. అడ్డం పొడవు మాట్లాడి ఆదేరువు ఉండదు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### కల్కికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలా!

కల్కిజీవితమేమిటో ప్రజలందరికీ తెలుసు. ఎన్ని ఈడి కేసులున్నాయి? గతంలో ఆశ్రమం మీద ఈడి దాడులు జరిగినప్పుడు వేలకోట్లు పట్టుబడితే, ఈ కేసుల నుండి విముక్తి చేస్తామని ఇద్దరు బీజేపీ నాయకులు 40 కోట్లు లంచం తీసుకున్నారన్న వార్తలు దేశమంతా తెలుసు. ఆశ్రమంలో దాసాజీలు మత్తు పదార్థాలు తీసుకొని చేసిన వికృత చేష్టలు చూసి, అంతకు ముందుఆశ్రమానికి లక్షలులక్షలు డబ్బులు ఇచ్చిన మహిళలు, వీరికా మేము డబ్బులిచ్చింది అని బూతులు తిట్టుకున్నారు. అటవీ భూములు, అసైన్డ్ భూములు, బినామీ పేర్లతో వేలాది ఎకరాలు ఆక్రమించాడు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసులున్నాయి. లోకాయుక్తలో కేసులున్నాయి. ఆశ్రమం మీద ఇంకా పలు కేసులున్నాయి. ఇలాంటి దొంగబాబా చనిపోతే, ప్రభుత్వపరంగా అంత్యక్రియలు నిర్వహిస్తే కేసులమీద ప్రభావం పడదా! అసలు దొంగబాబాకు అంత్యక్రియలు నిర్వహించటానికి ప్రభుత్వానికి ఏమి అవసరం వచ్చింది?

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### బకాయిల చెల్లింపులు

ఏది ఏమైనప్పటికీ, 8వ వేతన సంఘం సిఫార్సులను పరిశీలించడం, వివిధ రాష్ట్ర సంఘాల నుండి సమాచారాన్ని సేకరించడం వంటి ప్రక్రియలు దాదాపు ఒక కొలిక్కి వచ్చాయి. ఇంకా మూడునెలల సమయం మిగిలిఉంది. ఈ వ్యవధిలో, మరో ఆరు నెలల గడువు పొడిగింపును కోరకుండా ఆర్థికవేత్తలు, సంఘం సభ్యులు, ప్రభుత్వం కలిసి వేతనాలు, భత్యాలకు సంబంధించిన 'ఫిట్‌మెంట్'అంశాన్ని ఖరారు చేయడానికి సమష్టి కృషి చేస్తే, అది అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందనడంలో సందేహం లేదు. బకాయిల చెల్లింపు వల్ల పడే భారీ ఆర్థిక భారాన్ని ప్రభుత్వ అధికారులు పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతిపాదనల సమీక్ష, తుది అమలుకు మరో ఆరు నెలలకి ఈ భారం విపరీతంగా పెరిగిపోతుంది.

- జి. సీతారామయ్య, హైదరాబాద్

### యువతరం కదిలింది

జన్‌జీ తెలివయిన వాళ్లుఎదయినా అనుకుంటే సాధించేవరకూ నిద్రపోరు. హక్కులకై పోరాటంప్రజలకు ఆశాదీపం అంటే అతిశయోక్తికాదు. అపరిమితమైన టెక్నాలజీతో అగ్రదేశాలు పరుగులు పెడుతున్న రోజులివి. మనం రేసులో ఉన్నప్పటికి చేయవలసినది చాలానే ఉంది. అన్యాయాన్ని ప్రశ్నించే రైట్స్ ప్రతి ఒక్కరికి ఉందన్న విషయాన్ని మరువకూడదు. దేశ రాజధాని ఢిల్లీలో వరించిన విజయం తొలిమెట్టు మాత్రమే.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రమాదం అంచున ప్రజాస్వామ్యం!

***చరిత్ర మనకు ఒక విషయం స్పష్టంగా చెబుతోంది ప్రజాస్వామ్యం ఒక్కసారిగా కూలిపోదు, సంస్థల స్వాతంత్య్రం, పారదర్శకత, జవాబుదారీతనం ఒక్కొక్కటిగా బలహీనపడినప్పుడు దాని పునాది నెమ్మదిగా క్షీణిస్తుంది. అదే సమయంలో, భారత రాజ్యాంగ చరిత్రలోనే అటువంటి పరిణామాల క్షీణతను అడ్డుకున్న న్యాయపరమైన, సంస్థాగత ఉదాహరణలు కూడా ఉన్నాయి. ప్రజాస్వామ్యాన్ని ఎవరు కాపాడాలి? ఎన్నికల కమిషనర్ కాదు, ప్రభుత్వం ఒక్కటే కాదు, న్యాయమూర్తులు మాత్రమే కాదు, ప్రజలే చివరి రక్షకులు. కానీ ప్రజలు రక్షకులుగా మారాలంటే వారికి నిజమైన సమాచారం అందించే మీడియా కావాలి, అంతటి సమాచారం కావాలంటే స్వతంత్రమైన సంస్థలు కావాలి. సంస్థలు స్వతంత్రంగా ఉండాలంటే రాజ్యాంగ పరిరక్షణ కావాలి. రాజ్యాంగాన్ని కాపాడాలంటే ప్రజలలో ప్రజాస్వామ్య చైతన్యం కావాలి.***



డా. ఎ. భాగ్యరాజ

ప్రస్తుతం దేశంలో పరిస్థితి చూస్తుంటే మరో ఉద్యమానికి బాటలు వేస్తున్నట్లుంది వ్యవస్థల తీరుతో. భారతరాజ్యాంగం ప్రజలకు ఒక గొప్ప హామీ ఇచ్చింది. ప్రభుత్వం ప్రజలది, ప్రజల చేత, ప్రజల కోసం నడవాలి. కానీప్రజాస్వామ్యం కేవలం ఐదేళ్లకోసారి ఓటు వేయడం కాదు. ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలి. ఎన్నికల సంస్థ నిష్పాక్షికంగా ఉండాలి. అధికారంలో ఉన్నవారు అధికార దుర్వినియోగం చేయకూడదు. ప్రతిపక్షానికి సమాన రాజకీయ అవకాశం ఉండాలి. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించాలి. మీడియా ప్రశ్నించగలగాలి. ప్రజలకు ప్రభుత్వ నిర్ణయాలపై సమాచారం అందుబాటులో ఉండాలి. ఈ వ్యవస్థలలో ఏ ఒక్కటి బలహీనపడినా ప్రజాస్వామ్యానికి నష్టం జరుగుతుంది. 'అందుకే ప్రశ్న ఎవరు గెలిచారు?' అనేది మాత్రమే కాదు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందా?' అధికారంలో ఉన్నవారిని ఎన్నికల సంఘం సమానంగా ప్రశ్నించగలదా?' 'రాజకీయ విరాళాల విషయంలో ప్రజలకు తెలుసుకునే హక్కు ఎంత?' 'కోర్టులు ప్రజాస్వామ్య హక్కులకు చివరి రక్షణగా పనిచేస్తున్నాయా?' అనే ప్రశ్నలు కూడా అంతే ముఖ్యమైనవి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల పర్యవేక్షణ, దిశానిర్దేశం, నియంత్రణను ఎన్నికల సంఘానికి అప్పగించింది. ఎన్నికల సంఘం 25 జనవరి 1950న ఏర్పడిన రాజ్యాంగబద్ధ సంస్థ. అంటే ఎన్నికల సంఘం ఒక సాధారణ ప్రభుత్వ శాఖ కాదు. అది అధికార పార్టీకి కూడా నియంత్రణ విధించాల్సిన సంస్థ. ఎన్నికల సంఘం స్వయంగా చెబుతున్న ప్రవర్తనా నియమావళి ప్రకారం అధికారంలో ఉన్న పార్టీ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎన్నికల ప్రయోజనాలకు ఉపయోగించకూడదు, ప్రభుత్వ నిధులతో రాజకీయ ప్రచారం చేయకూడదు, అధికారిక పర్యటనలను ఎన్నికల ప్రచారంతో కలపకూడదు. ఇక్కడే అసలు పరీక్ష మొదలవుతుంది. చట్టం ఉండటం ఒక విషయం. దాన్ని అందరికీ సమానంగాఅమలు చేయడం మరో విషయం. 2023 చట్టం ద్వారా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్రమంత్రిని ఎంపిక కమిటీలో చేర్చారు. ఈ వ్యవస్థపై సవాళ్లు సుప్రీంకోర్టులో కొనసాగి, 2026లో కూడా ఈ నియామక వ్యవస్థపై విచారణ సందర్భంగా కోర్టు పార్లమెంట్ చాలాకాలం నియామక చట్టం చేయకపోవడంపై తీవ్ర వ్యాఖ్యలు కూడా చేసింది. ఇక్కడ సమస్య ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎవరు అయ్యారనే విషయం కాదు. ఎన్నికలను నిర్వహించే సంస్థకు రాజకీయ కార్యనిర్వాహక వ్యవస్థ నుంచి ఎంత దూరం ఉండాలి? అనేదే అసలు రాజ్యాంగ ప్రశ్న. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి సంబంధించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఫిర్యాదులపై ఎన్నికల సంఘం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు నోటీసులు జారీ చేసింది. ఇది వ్యక్తిగత అభ్యర్థులకు కాకుండా రాజకీయ పార్టీలకు నోటీసులు పంపిన కొత్త విధానంగా అప్పట్లో వార్తల్లో చర్చనీయాంశమైనది. ఇక్కడ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఎన్నిసార్లు ప్రశ్నలు లేవనెత్తినా ఎన్నికలసంఘంసరైన సమాధానమివ్వలేదు. ఎన్నికల సంఘం తీరుచూస్తే అయినవాడికి మంచంలో కానివాడికి కంచంలో అన్నట్లుంది. 2014నుంచి ఏ ఎన్నికలు




చూసినా పారదర్శకంగా ఉన్నట్లు తెలుస్తుందా? ప్రశ్నించుకుంటే అగమ్యగోచరంగా ఉంది. ఎన్నికల వ్యవస్థపై చర్చలో అత్యంత సున్నితమైన అంశం ఈవీఎం. 2024 ఏప్రిల్ 26న సుప్రీంకోర్టు ఈవీఎంవి.వి.పాట్ వ్యవస్థను పరిశీలించిన కేసులో 100శాతం వి.వి.పాట్ లెక్కింపు లేదాబ్యాలెట్ పేపర్‌కు తిరిగి వెళ్లాలని కోరిన పిటిషన్లను తిరస్కరించింది. అదే సమయంలో కొన్ని అదనపు భద్రతా చర్యలను కూడా ఆదేశించింది. ఈవీఎంపై అనుమానం వ్యక్తం చేయడంప్రజాస్వామ్య హక్కు. కానీ ఆ నమ్మకాన్ని పరీక్షించుకునే పారదర్శక వ్యవస్థ కూడా చాలా అవసరం. ఉదాహరణకు మన చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌లో ఎక్కోడో ఉన్న సైబర్ నేరగాళ్లు మనప్రమేయం లేకుండా ఎలాడబ్బును తీస్తున్నారో చూస్తున్నాము. అంటే చరిత్ర మనకు రెండు పాఠాలు చెబుతుంది. అధికార కేంద్రీకరణ ప్రమాదకరం. అదే సమయంలో సంస్థలు దాన్ని అడ్డుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. ప్రజాస్వామ్యం అంటే కేవలం మెజారిటీ పాలన కాదు, అది రాజ్యాంగ పాలన, సమాఖ్య వ్యవస్థ, న్యాయపరమైన సమీక్ష, వ్యక్తిగత హక్కులు, ఎన్నికల స్వేచ్ఛ, సంస్థాగత సమతుల్యత వంటి అన్నింటి సమాహారమే ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఒక్క ఎన్నికల కమిషనర్ వల్ల కాదు. ఒక్క ప్రభుత్వం వల్ల కాదు. ఒక్క న్యాయమూర్తి తీర్పు వల్ల కాదు. అసలు ప్రమాదం సంస్థలు ఒకదానిపై మరొకటి అధికార నియంత్రణ, సమతుల్యత కోల్పోయినప్పుడు. ఒక వ్యవస్థను అధికార రాజకీయాలు ప్రభావితం చేస్తే మరో వ్యవస్థ ప్రశ్నించక పోతే, మూడో వ్యవస్థ ఆలస్యంగా స్పందిస్తే, మీడియా ప్రశ్నించడం మానేస్తే, ప్రజలు సమాచారాన్ని పరిశీలించకుండా ప్రచారాన్ని మాత్రమే నమ్మితే అప్పుడు ప్రజాస్వామ్యపు బాహ్య నిర్మాణం మిగిలి, దాని అంతర్గత స్ఫూర్తి బలహీనపడే ప్రమాదం ఉంది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1949 నవంబర్ 25న రాజ్యాంగ సభలో ఒక కీలకమైన హెచ్చరిక చేశారు. రాజ్యాంగం ఎంత మంచిదైనా దాన్ని అమలు చేసే వ్యక్తులు చెడ్డవారైతే అది వారికి అనుకూలంగా మార్చుకుంటారు, చెడుగా మారవచ్చు. రాజ్యాంగం లోపభూయిష్టమైనదైనా దాన్ని అమలు చేసే వారుమంచివారైతే అది మంచి ఫలితాలను ఇవ్వగలదని అన్నారు. సుప్రీంకోర్టు ప్రచురించిన అంబేద్కర్ రాజ్యాంగ సభ ప్రసంగాల అధికారిక సంకలనంలో ఈ భావన నమోదైంది. ఇదే నేటి భారతదేశానికి అత్యంత ముఖ్యమైన పాఠం. రాజ్యాంగం కాగితంపై గొప్పగా ఉండటం మాత్రమే సరిపోదు. రాజ్యాంగ సంస్థలను నడిపే వ్యక్తులు రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని బలపరచడానికి అధికార పార్టీ అయినా, ప్రతిపక్షం అయినా ఒకే ప్రమాణం ఉండాలి. ఎన్నికల డేటాలో గరిష్ఠ పారదర్శకత పోలింగ్, లెక్కింపు తదితర సమాచారాన్ని సాధ్యమైనంతవరకు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలి. ఎవరు రాజకీయ పార్టీలకు ఎంత విరాళం ఇస్తున్నారు అనే అంశంలో ప్రజల సమాచార హక్కుకు ప్రాధాన్యత, పారదర్శకత ఉండాలి. న్యాయవ్యవస్థలో వేగవంతమైన ఎన్నికల కేసుల విచారణ విధానం అవసరం. ప్రజాస్వామ్య సంస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండే విధానాలు బలపడాలి. ఢిల్లీలో 'సర్' ప్రక్రియలో అవకతవకలే ప్రధానమైనది. ఢిల్లీలో 1.45కోట్ల ఓటర్లలో 47లక్షల మంది ఓటర్ల పేరును 'సర్' ఎన్యూమరేషన్ దశలోనే తొలగించి, ముసాయిదా జాబితాలలోని 97లక్షల మంది ఓటర్లలో 33లక్షల మందికి తార్కికమైన వైరుధ్యాలు అనే కారణంతో నోటీసులు జారీ చేసి, దశాబ్దాలుగా ఓటు వేస్తున్నవారిని తమకు ఓటు హక్కు ఉందని నిరూపించుకోవాలని నోటీసులివ్వడం, అలాగే ఓటర్ జాబితాల నుంచి లక్షలాది ఓటర్ల పేర్లను తొలగించి ప్రజలు ఆగ్రహానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. చరిత్ర మనకు ఒక విషయం స్పష్టంగా చెబుతోంది ప్రజాస్వామ్యం ఒక్కసారిగా కూలిపోదు, సంస్థల స్వాతంత్య్రం, పారదర్శకత, జవాబుదారీతనం ఒక్కొక్కటిగా బలహీనపడినప్పుడు దాని పునాది నెమ్మదిగా క్షీణిస్తుంది. అదే సమయంలో, భారత రాజ్యాంగ చరిత్రలోనే అటువంటి పరిణామాల క్షీణతను అడ్డుకున్న న్యాయపరమైన, సంస్థాగత ఉదాహరణలు కూడా ఉన్నాయి. ప్రజాస్వామ్యాన్ని ఎవరు కాపాడాలి? ఎన్నికల కమిషనర్ కాదు, ప్రభుత్వం ఒక్కటే కాదు, న్యాయమూర్తులు మాత్రమే కాదు, ప్రజలే చివరి రక్షకులు. కానీ ప్రజలు రక్షకులుగా మారాలంటే వారికి నిజమైన సమాచారం అందించే మీడియా కావాలి, అంతటి సమాచారం కావాలంటే స్వతంత్రమైన సంస్థలు కావాలి. సంస్థలు స్వతంత్రంగా ఉండాలంటే రాజ్యాంగ పరిరక్షణ కావాలి. రాజ్యాంగాన్ని కాపాడాలంటే ప్రజలలో ప్రజాస్వామ్య చైతన్యం కావాలి. •

# పరిశ్రమలతో యువత భవిష్యత్తుకు అడుగులు

ఎన్.సీతారామయ్య

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన 10,060 ప్రభుత్వ ఉద్యోగాల జాబ్ క్యాలెండర్తో రాష్ట్ర యువతలో కొత్త ఆశలను, ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నాయి. ఉద్యోగాల భర్తీకి ముందుగానే దశలవారీగా తేదీలను ప్రకటించడం అభినందనీయం. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది యువతకు ఇది ఒక స్పష్టమైన అవకాశమార్గాన్ని చూపించింది. నాలుగు దశల్లో నియామకాలను చేపట్టేందుకు రూపొందించిన ఈ కార్యాచరణలో వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి ప్రణాళిక సిద్ధమైంది. ఉన్నత విద్యాశాఖలోని 1,523 పోస్టులతో ప్రారంభమైన నియామక ప్రక్రియ, తదుపరి దశల్లో మరిన్ని పోస్టుల భర్తీకి విస్తరించనుంది. సెప్టెంబర్ 15న 3,231 పోస్టులకు, అక్టోబర్ 15న మరో 2,311 పోస్టులకు, తదుపరి 2,995 పోస్టులకు ప్రకటనలు వెలువడేలా రూపొందించిన క్యాలెండర్‌ద్వారా మొత్తం10,060 ఉద్యోగాలను భర్తీచేయాలనే లక్ష్యం ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ యువత తలరాతను మారుస్తుంది ఏపీపీఎస్సీ, పోలీసు నియామక మండలి, ఉపాధ్యాయ నియామకాలు, ఇతర శాఖలద్వారా జరిగే నియామ కాలు ప్రభుత్వ యంత్రాంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రతిభావంతులైన యువతకు ప్రజాసేవలోకి ప్రవే శించే అవకాశాలను అందనున్నాయి. కూటమి ప్రభుత్వం పరిశ్రమలు, సూక్ష్మ చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎంఎస్ ఎంఈలు), అంకుర సంస్థలు, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రాష్ట్రఉపాధికి భవిష్యత్తుకు గట్టి పునాది ఏర్పడుతుంది. ఎంఎస్ఎంఈ రంగంలో ఐదేళ్లలో 760,000 కోట్ల పెట్టుబడులు, 1.75 లక్షల ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యం, ప్రతి శాసనసభ నియోజక వర్గంలో ఒకటి చొప్పున 175పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాలనే ప్రణాళిక స్థానికంగా పెద్దఎత్తున్న వ్యాపార, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రభుత్వ దృష్టిలో ఉద్యోగం పొందే యువతతో పాటు ఉద్యోగాలు సృష్టించే యువతను కూడా ప్రోత్సహించాలనే విస్తృత ఆలోచనతో ఈప్రభుత్వం ముందుకువెళ్తుంది. ఒక ప్రభుత్వ ఉద్యోగం ఒక కుటుంబానికి స్థిరత్వాన్ని అందించగలిగితే, ఒక విజయవంతమైన పరిశ్రమ అనేక కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కల్పించగలదు. అందువల్ల ప్రభుత్వ నియామకాలు, పరిశ్రమల విస్తరణ, ఎంఎస్ఎంఈల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ, సంస్థలకు సహకారం ఈ అంశాల సమన్వయం ఆంధ్రప్రదేశ్ ఉపాధి భవిష్యత్తును మరింత బలోపేతం చేయగలదు. ఉద్యోగ మార్కెట్ వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యతోపాటు సాంకేతిక పరిజ్ఞానం, సమాచార సాంకేతిక నైపుణ్యాలు, సంభాషణా సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యాలు, వృత్తిపరమైన శిక్షణ వంటి అంశాలు యువతకు కీలకంగా మారుతున్నాయి. ఆంధ్రప్రదేశకుఉన్న మానవ వనరులే బలం. సముద్రతీరం, వ్యవసాయ వనరులు, పారిశ్రామిక అవకాశాలు, విద్యాసంస్థలు రాష్ట్రాన్ని విభిన్న రంగాల్లో ఉపాధి కేంద్రంగా అభివృద్ధి చేయగల సామర్థ్యాన్ని కలిగిఉన్నాయి. ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం, పరిశ్రమలకు అనుకూల వాతావరణం, నైపుణ్య శిక్షణ, సంస్థలకు సహకారం సమన్వయంతో ముందుకుసాగితే యువతకు స్వస్థలంలోనే అవకాశాలు పెరిగేఅవకాశంలేకపోలేదు. ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలు ఫలప్రదం కావాలంటే యువత కూడా అదేస్థాయిలో బాధ్యత తీసుకోవాలి. ఉద్యోగాల కోసం క్రమశిక్షణతో సిద్ధం కావడంతోపాటు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం, స్వయం ఉపాధిసంస్థల వైపు అడుగులు వేయడం అవసరం. ప్రభుత్వం, పరిశ్రమలు సృష్టించే అవకాశాలు, యువత సాధించే నైపుణ్యాలు ఒకే దిశలో ప్రయాణించినప్పుడు ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాల్లోనూ మరింత ముందుకు సాగగలదు. •

# విశ్వసౌభాగ్యానికి ఉపాధ్యాయుల బోధనలే కీలకం



మేకిరి దామోదర్

ఉపాధ్యాయులు తరగతి గదిలో పలికిన మంచి మాటలు, విద్యార్థుల జీవితాల్ని మార్చగలదు. అలాగే వారు చూపిన మంచి మార్గం ఒక తరానికే దిశానిర్దేశం చేయగలదు. అందుకే ఉపాధ్యాయుడు కేవలంపాఠాలు చెప్పే వ్యక్తికాదు. భవిష్యత్తును నిర్మించే శిల్పి! ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం వెనుక ఇదేఅంతరార్థం ఉంది. ఉపాధ్యాయుల సేవలను గుర్తించడం, వారి హక్కులు-బాధ్యతలపై అవగాహన పెంపొందించడం, నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్రను గుర్తించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. యునెస్కో, అంతర్జాతీయ కార్మిక సంస్థతదితర సంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ వృత్తి ప్రాధాన్యతను ప్రపంచానికి గుర్తుచేసే రోజుగా ఇది నిలుస్తోంది. గురువులు వారి జ్ఞానబోధనలతో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతూ తద్వారా సమాజంలో విలువలు నెలకొల్పడానికి తోడ్పడుతారు. వారు జ్ఞానంతో, విలువలతో, సంస్కారంతో ఆ వృత్తికున్న గౌరవాన్ని, ప్రతిష్టను కొనసాగిస్తూ తరగతి గదిలో గురువు పలికే ప్రతి మాట, చూపించే ప్రతి ప్రవర్తన, పాటించే ప్రతి విలువ విద్యార్థుల మనసులపై చెరగని ముద్ర వేస్తుంది. అందుకే గురువుల చేతిలో ఉండేది కేవలం పుస్తకం మాత్రమేకాదు. ఒక తరం భవిష్యత్తు! తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే గురువులు వారి ఆలోచనలకు రూపమిస్తారు. కుటుంబం పిల్లలను పెంచితే పాఠశాల వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. అందుకే సమాజంలో ఎంతటి గొప్పవ్యక్తిగా ఎదిగినా, అతని ఎదుగుదల వెనుక ఏదో ఒక గురువు ప్రేరణ తప్పకుండా ఉంటుంది. గురువుల ప్రోత్సాహంతో విద్యార్థులు సమగ్ర వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా తీర్చిదిద్దబడతారు. విద్యార్థుల్లో విలువల నిలువలు పెరిగితేనే ఆదర్శవంతమైన సమాజం ఆవిర్భవిస్తుంది. మంచి టీచర్ అంటే విద్యార్థితో పాఠాన్ని కంఠస్థం చేయించే వ్యక్తి కాదు. స్వయంగా ఆలోచించేలా చేసేవాడే నిజమైన గురువు. విద్యార్థిలోని సందేహాన్ని ప్రశ్నగా, ప్రశ్నను ఆలోచనగా, ఆలోచనను ఆచరణగా మార్చగలిగినప్పుడే బోధనకు అసలైన సార్థకత. 'బాగా చదువు' అని చెప్పడం కంటే 'నువ్వు బాగా చదువుతావని నాకు తెలుసు' అని నమ్మకాన్ని కలిగించడం విద్యార్థిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. సరైన సమాధానం చెప్పినప్పుడు 'శభాష్, ఎక్సలెంట్, వెరీగుడ్' అంటూ అభినందించడం చిన్న విషయంలా కనిపించినా, అది మరింత సాధించాలనే తపనను రగిలిస్తుంది. నేటి పరిస్థితుల్లో గురువు కేవలం పాఠ్యాంశాల బోధకుడిగా ఉండటం సరిపోదు. మార్గదర్శి,




సలహాదారు, కౌన్సిలర్, అవసరమైనప్పుడు ఆప్యాయతతో పలకరించే స్నేహితుడి పాత్రనూ పోషించాలి. కుటుంబ సమస్యలు, చదువు ఒత్తిడి, భవిష్యత్తుపై అయోమయం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న విద్యార్థికి ముందుగా కావాల్సింది మందలింపు కాదు, అర్థం చేసుకునే మనసు. విద్య అంటే కేవలం అక్షరజ్ఞానం కాదు. లోకాన్ని అర్థంచేసుకోవడం, మంచి-చెడులను విచక్షణతో గుర్తించడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం, ఇతరులను గౌరవించడం కూడా విద్యలో భాగమే. అందుకే గురువు తన లోకానుభవాన్ని, ప్రాపంచిక జ్ఞానాన్ని నిరంతరం పెంచుకోవాలి. నిరంతరం నేర్చుకునే గురువే, నిరంతరం నేర్చుకునే విద్యార్థిని తయారు చేయగలడు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం మనకు గుర్తుచేసే ముఖ్యమైన సందేశం కూడా ఇదే. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ఉపాధ్యాయుడు కూడా నిరంతరం నేర్చుకుంటూ, కొత్త బోధనా పద్ధతులను అలవర్చుకుంటూ, సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు మార్గదర్శకుడిగా నిలవాలి. గురువుఎంత గొప్పగా బోధించినా, ఆయన ప్రవర్తన అందుకు విరుద్ధంగా ఉంటే ఆ బోధన ప్రభావం తగ్గిపోతుంది. ఎందుకంటే పిల్లలు మనం చెప్పే మాటలకంటే మనం ఆచరించే విధానాన్నే ఎక్కువగా గమనిస్తారు. క్రమశిక్షణ గురించి చెప్పే గురువు తన జీవితంలో క్రమశిక్షణను పాటించాలి. నిజాయితీని బోధించే గురువు నిజాయితీకి ప్రతిరూపంగా నిలవాలి. సమానత్వాన్ని చెప్పే గురువు ప్రతి విద్యార్థినీ వివక్ష లేకుండా సమానంగా చూడాలి. ఉపాధ్యాయుల మధ్య ఐకమత్యం లోపించినా, కుల, మత, ప్రాంతీయ అభిమానాలు హద్దులు దాటినా దాని ప్రభావం విద్యార్థులపై పడుతుంది. పాఠశాల విభేదాలకు వేదిక కాకుండా వైవిధ్యంలో ఏకత్వాన్ని నేర్పే వేదిక కావాలి. ప్రతి గురువులోనూ ఒక ప్రత్యేకత ఉంటుంది. పాఠం చెప్పే విధానంలోనో, విద్యార్థులను ప్రోత్సహించడంలోనో, ఆప్యాయంగా మాట్లాడటంలోనో ఆ ప్రత్యేకత కనిపిస్తుంది. దాన్ని గుర్తించి మరింత మెరుగుపరుచుకోవాలి. గురువు విజయం ఎన్ని పాఠాలు చెప్పాడన్న దానిలో లేదు. విద్యార్థి మనోభావాలను ఎంతగా గౌరవించాడు? అతనిలోని ప్రతిభను ఎంతగా గుర్తించాడు? ఆత్మవిశ్వాసాన్ని ఎంతగా పెంచాడు? అన్నదే అసలైన కొలమానం. గురువు చెప్పే పాఠం పరీక్షలో మార్కులు తెచ్చిపెట్టవచ్చు. కానీ గురువు చూపే ప్రవర్తన జీవితానికి దిశానిర్దేశం చేయగలదు. కోట్లాది తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో ప్రేమగా పెంచి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను గురువుల చేతుల్లో పెడతారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ఉపాధ్యాయుల పవిత్ర బాధ్యత. చదువుపై ఆసక్తిలేని విద్యార్థిలో జ్ఞానదాహాన్ని రగిలించవచ్చు. అల్లరి చేసే ఆకతాయిలో సృజనాత్మకతను గుర్తించి ప్రతిభావంతుడిగా తీర్చిదిద్దవచ్చు. ఇతరులకు కనిపించని ప్రతిభను విద్యార్థిలోముందుగానే గుర్తించడం. గురువు ఒక విద్యార్థిని కేవలం 'విద్యార్థి'గా చూస్తే అతడు అక్కడే ఆగిపోవచ్చు. కానీ 'నువ్వు సాధించగలవు' అనే నమ్మకాన్ని కలిగిస్తే అతడు ఊహకు అందని శిఖరాలను అధిరోహించగలడు. గురువు దిశ చూపిస్తాడు. శిష్యుడు ప్రయాణిస్తాడు. గురువు జ్ఞానాన్ని పంచుతాడు. శిష్యుడు దాన్నిఆచరణలో పెడతాడు. ఈగురు-శిష్యబంధమే సమాజ పరివర్తనకు పునాది. ప్రభుత్వాలు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. సమాజం ఉపాధ్యాయులను గౌరవించాలి. •

# 'వికసిత్ భారత్' దిశగా నెక్స్ట్‌జెన్ జీఎస్టీ


కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** ఒకే దేశం ఒకే పన్ను లక్ష్యంతో 2017లో ప్రవేశపెట్టిన జీఎస్టీ పరోక్ష పన్నుల విధానంలో ఒక చారిత్రాత్మక మార్పునకు శ్రీకారం చుట్టింది. ఆ తొమ్మిదేళ్ల అమల్లో ఎదురైన అనుభవాలు, పన్ను చెల్లింపుదారులు మరియు రాష్ట్రాల సూచనలను ప్రామాణికంగా తీసుకుని, ఇప్పుడు నెక్స్ట్‌జెన్ జీఎస్టీ రూపంలో ఆర్థిక వ్యవస్థను తదుపరి స్థాయికి తీసుకెళ్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టికి అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ నెక్స్ట్‌జెన్ జీఎస్టీకి ప్రధానంగా రెండు స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయి. మొదటిది పన్ను రేట్లను తగ్గించి, వాటిని సరళీకరించడం. రెండవది పన్ను నిబంధనలను సులభతరం చేయడం. ఇందులో భాగంగా సవరించిన నూతన పన్ను రేట్లు గత యేడాది సెప్టెంబరు22 నుండి ఇప్పటికే అమలులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించిన తదుపరి దశ ప్రక్రియ సంస్కరణలు త్వరలోనే జీఎస్టీ కౌన్సిల్ ముందుకు రానున్నాయి. ఈ సంస్కరణలన్నింటి లక్ష్యం ఒక్కటే. సామాన్య కుటుంబాల బడ్జెట్కు ఉపశమనం అందించడం, వ్యాపార వర్గాలకు స్పష్టత, నమ్మకాన్ని ఇవ్వడం మరియు పన్ను చెల్లింపుదారులు ఎలాంటి అనవసర ఇబ్బందులు లేకుండా తమ బాధ్యతలను సజావుగా నెరవేర్చుకునే అనుకూల వాతావరణాన్ని సృష్టించడం. జాతీయ లక్ష్య సాధన కోసం తమ బాధ్యతలను నెరవేరుస్తూనే, భాగస్వామ్య స్ఫూర్తిని చాటుకున్న రాష్ట్ర ప్రభుత్వాల నిబద్ధత అభినందనీయం. జీఎస్టీ సాధించిన ఈ పురోగతి అంతా కూడా సహకార సమాఖ్య స్ఫూర్తికి స్పష్టమైన నిదర్శనం. మనం చేపట్టిన సంస్కరణలు ఎంతటి సానుకూల ఫలితాలను ఇస్తున్నాయో గణాంకాలే చెబుతున్నాయి. 2025 అక్టోబర్ నుండి 2026 జూలై మధ్య కాలంలో, పన్ను పరిధిలోకి వచ్చిన వ్యాపార సరుకులు మరియు సేవల విలువ గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 25.8 శాతం పెరిగింది. పన్ను రేట్లను తగ్గించినప్పటికీ ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకోవడం హర్షణీయం. ఈ ఆర్థిక స్థిరత్వం రాబడి గణాంకాలలో కూడా స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. 2026 ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.12.46 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 11.6 శాతం వృద్ధి. రీఫండ్లు పోను నికర వసూళ్లు కూడా అర్ధ సంవత్సర కాలంలో 10.4 శాతం పెరిగాయి.ఈ వృద్ధి కేవలం ఒకటిరెండు రంగాలకే పరిమితం కాలేదు. దేశంలోని మొత్తం 11 వ్యాపార రంగాలు మరియు అన్ని ప్రధాన రాష్ట్రాలలో పన్ను విధించదగిన విక్రయాలు పెరిగాయి. సంస్కరణలతో నేరుగా వినియోగదారులకు జరిగిన అమ్మకాలు కూడా 26.7 శాతం మేర పుంజుకున్నాయి. కుటుంబాల కొనుగోలు శక్తి పెరిగితే మార్కెట్లో వస్తు సేవల డిమాండ్ పెరుగుతుంది. ఆ ప్రయోజనం క్రమంగా చిల్లర వ్యాపారి నుండి సరఫరాదారునికి, చివరికి ఉత్పత్తిదారునికి కూడా చేరుతుంది.

చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలకు జాతీయ మార్కెట్ ద్వారాలు తెరుచుకోవడం ఎంతో లాభదాయకం. టైర్2, టైర్3 నగరాల్లోని చిన్న వ్యాపారాలు తమ పరిధిని దాటి ఇతర ప్రాంతాల వినియోగదారులను చేరుకోగలిగినప్పుడే అసలైన ప్రగతి సాధ్యమవుతుంది. జీఎస్టీ తెచ్చిన ఉమ్మడి జాతీయ వ్యవస్థ ఈ అనుసంధానానికి ఎంతగానో సహకరిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి కేంద్ర, రాష్ట్ర పరిధిలోని జీఎస్టీ రిజిస్ట్రేషన్ల సంఖ్య దాదాపు 1.71 కోట్లకు చేరింది. ఇది గతేడాదితో పోలిస్తే 15 శాతం పెరుగుదల. అలాగే 2026 ఏప్రిల్-జూలై కాల వ్యవధిలో గడువు తేదీలలోగా దాఖలైన జీఎస్టీఆర్3బీ రిటర్నులు 12.6 శాతం పెరిగాయి. భాగస్వామ్యం పెరుగుతున్న కొద్దీ పన్ను పరిపాలనా విభాగంపై బాధ్యత కూడా పెరుగుతుంది. మరోవైపు, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ప్రక్రియ కూడా గణనీయంగా మెరుగైంది. చెల్లించాల్సిన పన్ను బాధ్యతలో క్రెడిట్ల వాటా పెరగడమే కాకుండా, పేరుకుపోయిన క్రెడిట్ పరిమాణం తగ్గింది. చిన్న పరిశ్రమలకు వర్కింగ్ క్యాపిటల్ అనేది రక్త ప్రసరణ లాంటిది. క్రెడిట్లు సకాలంలో లభించడం వల్ల చిన్న వ్యాపారులు సులభంగా ఇన్పుట్లు కొనుగోలు చేసి, ఆర్డర్లు పూర్తి చేయడానికి మార్గం సుగమమైంది. ఏప్రిల్‌సెప్టెంబర్ మధ్య కాలంలోనే దాదాపు రూ.1.80 లక్షల కోట్ల మేర రీఫండ్లను నేరుగా వ్యాపార సంస్థలకు వాపసు చేశాం. ఐజీఎస్టీ సెటిల్మెంట్లతో కలిపి రాష్ట్రాల మొత్తం ఎస్ జీఎస్టీ ఆదాయం ఈ ఏప్రిల్- సెప్టెంబర్ కాలంలో దాదాపు 16 శాతం పెరిగింది. ఈ నిధులు మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజా సంక్షేమానికి దోహదపడతాయి. అక్టోబర్ 7న జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రాబోయే ప్రతిపాదనలు ఈ దిశగానే పనిచేస్తాయి. రిజిస్ట్రేషన్, రిటర్న్లు, రీఫండ్లు, వివాదాల పరిష్కారం మరియు ఐటీసీ ప్రవాహాన్ని మరింత సులభతరం చేసి, వ్యాపార వ్యయాన్ని తగ్గించడమే మా ప్రాధాన్యత. జీఎస్టీ అందించిన ఈ బలం, అనుభవంతో ప్రత్యక్ష పన్నులలో కూడా సంస్కరణలను ముమ్మరం చేస్తున్నాం. వ్యాపార రంగానికి ఆ నమ్మకాన్ని అందిస్తూ, ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచనలకనుగుణంగా సమర్థవంతమైన, సమ్మోహనకరమైన వికసిత్ భారత్ వైపు అడుగులు వేద్దాం.



## ప్రేయర్ చేసుకుంటానని వెళ్లి.. వెనుక నుంచి గొడ్డలితో నరికాడు

### పైలట్ స్మిత్ మచ్చర్

**అబుదాబి, అక్టోబరు 4:** ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో భారత పైలట్ స్మిత్ మచ్చర్‌పై కో-పైలట్ దాడి చేసిన ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ దాడికి సంబంధించి కెప్టెన్ మచ్చర్ కీలక విషయాలు వెల్లడించారు. విమానం నడుపుతున్న సమయంలో కో-పైలట్ ప్రార్థన చేసుకుంటానని చెప్పి తన వెనక్కి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంత పైలట్లు ఇలా ప్రార్థనలు చేసుకోవడం సర్వసాధారణ విషయం కావడంతో తాను అడ్డు చెప్పలేదన్నారు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే కాక్‌పిట్‌లో ఉండే గొడ్డలితో తనపై వెనకనుంచి దాడి జరిగినట్లు గుర్తు చేసుకొన్నారు.దీంతో వెంటనే తాను అప్రమత్తమై కాక్‌పిట్ తలుపులు తెరిచినట్లు వెల్లడించారు. కానీ, అతడు తనను అడ్డుకొని తలుపులు తిరిగి మూసివేశాడన్నారు.ఎలాగైనా ప్రయాణికులను కాపాడాలనే ఆలోచనతో బలం కూడదీసుకొని మరోసారి తలుపులు తెరిచి సాయం కోరడంతో ప్రయాణికులు లోపలికివచ్చి అతడిని బంధించారన్నారు.

**విద్యార్థిగా రెండేళ్లు ఆస్ట్రేలియాలో..** ఈ దాడిలో నిందితుడిగా భావిస్తున్న ఒమన్‌కు చెందిన హమామ్‌అల్-హమ్మామీగా(29)కు ఉగ్రవాద భావజాలం ఉన్నట్లు ఇప్పటికే అధికారులు పేర్కొన్నారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతడు ఒమన్, సిరియా, మొరాకోల్లోనే కాకుండా ఆస్ట్రేలియాలోనూ రెండేళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. 2015లో విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియా వెళ్లి 2017 వరకు అక్కడే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో అతడు ఎటువంటి కార్యకలాపాల్లో పాల్గొన్నాడనే విషయంపై ఆస్ట్రేలియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ ఆర్గనైజేషన్ (ఎఎస్ఐఒ) సహా పలు ఏజెన్సీలు దర్యాప్తు చేపట్టాయి.

**హామామ్‌కు అల్‌ఖైదా మద్దతు**

మరోవైపు ఉగ్రవాద సంస్థ అల్-ఖైదా కో-పైలట్ హమామ్ అల్-హమ్మాదీకి మద్దతుగా పలు పోస్టులు చేస్తోంది. 9/11 దాడులను ప్రస్తావిస్తూ అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందిన విమానాల్లో ఇటువంటి దాడులు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈమేరకు దాని వారపత్రికలో కథనం ప్రచురించింది. అంతేకాకుండా ట్విన్ టవర్స్‌పై దాడి, ఫ్లైదుబాయ్ విమానానికి సంబంధించిన దృశ్యాలను సైతం దీనిలో ప్రచురించడం గమనార్హం.



## బాలిక కడుపులో వెంట్రుకల గడ్డ

### తొలగించిన వైద్యులు

**తిరువనంతపురం, అక్టోబరు 4:** వైద్య శాస్త్రంలోనే అత్యంత అరుదుగా కనిపించే కేసు ఒకటి కేరళలో వెలుగుచూసింది. 9 ఏళ్ల బాలిక కడుపులో పేరుకుపోయిన కిలో బరువున్న వెంట్రుకల గడ్డను వైద్యులు విజయవంతంగా తొలగించారు. తీవ్రమైన కడుపునొప్పి, వాంతులతో బాధపడుతున్న ఆ చిన్నారికి రాపుంజెల్ సిండ్రోమ్ అనే అరుదైన వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఘటన తిరువనంతపురం సమీపంలోని నెయ్యట్టింకరలో ఉన్న నిమ్స్ మెడిసిటీ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. కొద్ది రోజులుగా తగ్గని కడుపునొప్పి, తరచూ వాంతులు అవుతుండటంతో కుటుంబ సభ్యులు బాలికను నిమ్స్ మెడిసిటీకి తీసుకొచ్చారు. ప్రాథమికంగా సమస్యను గుర్తించలేని వైద్యులు, బాలిక ఆరోగ్య పరిస్థితిని లోతుగా పరిశీలించేందుకు అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో బాలిక జీర్ణాశయంలో, చిన్న పేగుల్లో ఏదో అసాధారణమైన అడ్డంకి ఉన్నట్లు గుర్తించారు. దీంతో మరింత స్పష్టత కోసం ఎండోస్కోపీ పరీక్ష నిర్వహించగా, వైద్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. బాలిక కడుపు, చిన్న పేగుల్లో పెద్ద మొత్తంలో వెంట్రుకలు ఒక ముద్దలా పేరుకుపోయి ఉన్నాయని తేలింది. ఈ వెంట్రుకల గడ్డ కారణంగానే పేగుల్లో తీవ్రమైన అడ్డంకి ఏర్పడిందని, దానివల్లే బాలిక అనారోగ్యానికి గురైందని నిర్ధారించారు. వెంటనే శస్త్రచికిత్స చేసి దానిని తొల గించాలని నిర్ణయించారు. పీడియాట్రిక్ సర్జరీ విభాగం వైద్య బృందం ఈ క్లిష్టమైన శస్త్ర చికిత్సను చేపట్టింది. గంటల తరబడి శ్రమించి, బాలిక కడుపు, చిన్న పేగుల నుంచి సుమారు కిలో బరువున్న వెంట్రుకల గడ్డను పూర్తిగా తొలగించారు. ఈ వైద్య పరిస్థితిని రాపుంజెల్ సిండ్రోమ్ అని పిలుస్తారని వైద్యులు వివరించారు. ఇది ఒకరకమైన ట్రైకోబెజోర్. తమ వెంట్రుకలను తామే పీక్కుని తినే మానసిక అలవాటు (ట్రైకోఫేజియా) ఉన్నవారిలో ఇది కనిపిస్తుంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 100 లోపే ఇలాంటి కేసులు నమోదైనట్లు వైద్య నివేదికలు చెబుతున్నాయి. ఇది ఎక్కువగా యుక్తవయసు బాలికలలో కనిపిస్తుంది. క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్యబృందాన్ని పలువురు అభినందించారు.

## జీలకర్ర పొడి రీకాల్‌కు ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆదేశం




**పనాజి, అక్టోబరు 4:** దేశవ్యాప్తంగా ఆహార భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేసే నేపథ్యంలో భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ప్రముఖ బ్రాండ్లు, సంస్థలపై కఠిన చర్యలు చేపట్టింది. నాణ్యతా లోపాలు, తీవ్రమైన పరిశుభ్రతా లోపాలు వెలుగుచూడటంతో ఈ సంచలన నిర్ణయాలు తీసుకున్నట్లుగా అధికారిక ప్రకటన వెలువడింది. ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రీప్యాక్డ్ జీలకర్ర పొడి నమూనాలు ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లుగా తేలడంతో, ఆ సంస్థ వెంటనే ఆ ఉత్పత్తులను మార్కెట్ నుంచి వెనక్కి తీసుకోవాలని ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆదేశించింది. గోవాలోని మెస్సర్స్ రివర్సైడ్ రిసార్ట్స్, హాలిడే హోమ్స్ ఫ్యాక్టరీ నుంచి సేకరించిన ఈ జీలకర్ర పొడి నమూనాను ఫుడ్ అనలిస్టులు పరీక్షించగా, అనుమతించిన గరిష్ఠ పరిమితిని మించి అజోక్సిస్ట్రోబిన్, థియామెథోక్సమ్ పురుగు మందుల అవశేషాలు ఉన్నట్లుగా తేలింది. ఈ నమూనాను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్2006 ప్రకారం సురక్షితం కాదని ప్రకటించారు. కంపెనీ అప్పీల్ మేరకు రిఫరల్ ఫుడ్ లాబొరేటరీలో జరిపిన పరీక్షల్లోనూ ఇది సేఫ్ కాదని నిర్ధారణ కావడంతో, సంబంధిత బ్యాచ్ నెం.ని080668761 ఉత్పత్తులను తక్షణమే మార్కెట్ నుంచి రీకాల్ చేయాలని స్పష్టం చేశారు.

అదేవిధంగా మెస్సర్స్‌క్రియేటివ్ బేకర్స్ అండ్ కన్ఫెక్షనర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎఫ్ఎస్ ఎస్ఏఐ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేశారు. ఆహార ఉత్పత్తి, హ్యాండ్లింగ్ ప్రాంతాల్లో ధూళి, గ్రీజు, బూజు గూళ్లు, ఈగలు వంటి తీవ్రమైన పరిశుభ్రతా లోపాలు తనిఖీల్లో వెలుగుచూశాయి. తుప్పు పట్టిన కంటైనర్లలో ముడి పదార్థాలను నిల్వ చేయడం, కీటకాల బెడదను నివారించడంలో విఫలమవడం, కిటికీలకు కీటకాల నిరోధక మెష్‌లు లేకపోవడం వంటి లోపాలు గుర్తించారు. ఆహార భద్రత రికార్డులను సరిగా మెయిన్‌టెయిన్ చేయకపోవడం, వ్యర్థాలు పేరుకుపోవడం వంటి కారణాలరీత్యా ఈ చర్యలు తీసుకున్నట్లుగా అధికారుల వెల్లడించారు.

## మాజీ సిఎం శంకర్‌సింహ్ వాఘేలా వ్యాఖ్యల దుమారం



**అహ్మదాబాద్, అక్టోబరు 4:** గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నేత శంకర్‌సింహ్ వాఘేలా చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. రిజర్వేషన్లను వ్యతిరేకించే అగ్రవర్ణాల వారు మ్యాన్యువల్ స్కావెంజింగ్ చేస్తే నెలకు రూ.50,000 ఇస్తానని ఆయన చేసిన సవాల్ వివాదాస్పదంగా మారింది. నర్మదా జిల్లాలోని సాగ్‌బారాలో జరిగిన ఆదివాసీ రైతుల సమావేశంలో వాఘేలా మాట్లాడారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ అది ఎవరూ ఇస్తున్న భిక్షకాదని, దశాబ్దాలుగా అనుభవించిన వివక్షకు బదులుగా లభించిన హక్కు అని స్పష్టం చేశారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే పటేల్, బనియా, బ్రాహ్మణ సామాజిక వర్గాలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. వాఘేలా వ్యాఖ్యలపై బీజేపీ, పాటీదార్, బ్రాహ్మణ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బీజేపీ నేత, బ్రహ్మ సమాజ్ నాయకుడు యజ్ఞేశ్ దవే తీవ్రంగా స్పందిస్తూ వాఘేలానే తన ఇంట్లో ఆ పని చేస్తే నెలకు రూ.5 లక్షలు ఇస్తానని ప్రతి సవాలు విసిరారు. పాటిదార్ నాయకుడు అల్పేష్ కథీరియా కూడా వాఘేలా తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆసక్తికరంగా, ఈ కార్యక్రమానికి గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమిత్ చావ్డాతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు కూడా హాజరయ్యారు. ఇదే సమయంలో శంకర్‌సింహ్ వాఘేలా తిరిగి కాంగ్రెస్ గూటికి చేరబోతున్నారనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. 2017లో పార్టీని వీడిన ఆయన, బీజేపీని ఓడించేందుకు తిరిగి కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమని ఇటీవల ప్రకటించారు. దీనికి సంబంధించిన చర్చలు చివరి దశలో ఉన్నాయని సమాచారం. త్వరలో జరగనున్న గాంధీనగర్ మున్సిపల్ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ తరఫున ప్రచారం కూడా చేయనున్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలపై వివాదం కొనసాగుతుండగా, కాంగ్రెస్‌లో ఆయన చేరికపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## రష్యాలో భారతీయులకు 70వేల ఉద్యోగాలు: కేంద్ర మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయి. ఈ ఏడాది సుమారు 70వేల మంది నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులకు తమ దేశంలో ఉపాధి కల్పించేందుకు రష్యా అంగీకరించింది. ముఖ్యంగా నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాల్లో ఈ నియామకాలు జరగనున్నాయి. ఈ కీలక విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్వయంగా వెల్లడించారు. పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. భారత్ రష్యా సంబంధాలపై జరిగిన ఈ సమావేశానికి జైశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, కనెక్టివిటీ, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాలు వంటి పలు అంశాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని వివరించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సమతుల్యంగా విస్తరించాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని, ఇందులో భాగంగా ఏడు కీలక రంగాల్లో రష్యాకు భారత ఎగుమతులు పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఆటోమొబైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆహార ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు, టెక్స్‌టైల్స్ రంగాల్లో ఈ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇంధన సహకారంపై మాట్లాడుతూ బహుళ వనరుల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగించడం ద్వారా భారత వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని జైశంకర్ స్పష్టం చేశారు. చెన్నైవ్లాదివోస్టాక్ కారిడార్, అంతర్జాతీయ నార్త్‌సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్, నార్తర్న్ సీ రూట్ వంటి కనెక్టివిటీ ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. భారత్‌యురేషియన్ ఎకనామిక్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునే అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఇదే సమయంలో ఉక్రెయిన్ సంక్షోభంపై భారత్ దౌత్యపరమైన ప్రయత్నాలను జైశంకర్ కమిటీకి వివరించారు. చర్చలు, శాంతియుత పరిష్కారానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుందని పునరుద్ఘాటించారు. రష్యా సైన్యంలో సహాయక విధుల పేరుతో చిక్కుకున్న భారతీయ పౌరుల విడుదల కోసం చేస్తున్న ప్రయత్నాలను కూడా ఆయన సభ్యులకు తెలియజేశారు. ఇప్పటివరకు సుమారు 140 మందిని సురక్షితంగా విడిపించామని, మరో 55 మంది ఆచూకీ కోసం రష్యా అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు.

## విరిగిపోయిన రడ్డర్‌తో విమానం ల్యాండ్ ఓ అద్భుతం



**వాషింగ్టన్, అక్టోబరు 4:** ఫ్లైదుబాయ్ విమానం 'ఎఫ్‌జడ్ 1073' ల్యాండ్ కావడం ఏవియేషన్ అద్భుతం. దీనిలోని కో-పైలట్ హమామ్ అల్-హమ్మామీ, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై 'క్రాష్ యాక్స్' (అత్యవసర సమయంలో వాడే గొడ్డలి)తో విచక్షణా రహితంగా దాడి చేయడంతో విమానం అసాధారణ స్థాయిలో అదుపు తప్పినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా విశ్లేషణలో తేలింది. ఒక దశలో దాదాపునిటారుగా విమానం భూమి దిశగా దూసుకొచ్చినట్లు తేలింది. ఆ తర్వాత విమానం తిరిగి అదుపులోకి వచ్చినా, భౌతికంగా దెబ్బ తినడంతో ల్యాండింగ్ సవాలుగా మారిందని అమెరికా మీడియాసంస్థ ఓ కథనంలో వెల్లడించింది.

**దాదాపు శబ్ద వేగాన్ని అందుకుని:** ఫ్లైదుబాయ్ 'ఎఫ్‌జడ్ 1073'.. బోయింగ్ 737 మ్యాక్స్ శ్రేణికి చెందిన భారీ విమానం. ఇది అత్యధికంగా మ్యాక్ 0.82 వేగాన్ని మాత్రమే తట్టుకోగలదు. ఇంతకు మించిన వేగంతో ప్రయాణిస్తే విమానం భౌతికంగా దెబ్బతినే ప్రమాదం పొంది ఉంది. ఈ విమానం దాడి సమయంలో.. 0.9 మ్యాక్ వేగంతో (దాదాపు 1 మ్యాక్ అంటే శబ్ద వేగానికి సమానంగా) భూమి దిశగా రావడం మొదలుపెట్టిందని 'ఫ్లైట్ రాడార్24' డేటా వెల్లడించింది. 92 సెకన్లలో 17,000 ఎత్తు తగ్గి.. విమానం కిందకు పడిపోయే సమయంలో కొన్ని రెట్ల జీఫోర్స్ (గురుత్వాకర్షణ శక్తి)కి లోనైంది. ఫలితంగా విమానం దిశను మార్చుకునేందుకు వినియోగించే రడ్డర్ దెబ్బతింది. విమానం ముక్కుభాగం సాధారణంగా ల్యాండింగ్ సమయంలో 3 డిగ్రీల కోణంలో కిందకు దిగుతుంది. కానీ, ఫ్లైదుబాయ్ 'ఎఫ్‌జడ్ 1073' మాత్రం అక్టోబరు 1న 39 డిగ్రీల కోణంలో భూమి దిశగా దూసుకెళ్లింది. కేవలం 92 సెకన్లలో 17,000 అడుగుల కిందకు పడిపోయింది. ఆ సమయంలో విమానం బాడీపై సాధారణ జీఫోర్స్ కంటే మూడు రెట్లు అదనంగా పడింది. సాధారణంగా 737 మ్యాక్స్ రకం విమానం 2.5 పాజిటివ్ జీఫోర్స్ మాత్రమే అత్యధికంగా తట్టుకోగలదు. ఏ కమర్షియల్ ఫ్లైట్ అయినా ఇంతే. విమానంలో ఉన్న డెడ్‌హెడ్ పైలట్స్ (విధులు ముగించుకొని.. లేదా వేరే చోట్ల విధులకు వెళుతున్నవారు) కంట్రోల్స్‌ను అదుపు చేసినా దాని తోక వద్ద రడ్డర్ దెబ్బతింది. వీరి సాదీలోని తబుక్ విమానాశ్రయంలో అత్యవసర ల్యాడింగ్‌కు వెళుతున్న సమయంలో కూడా హఠాత్తుగా 500 అడుగుల ఎత్తు తగ్గిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఈ విమానం సౌదీలోనే ఉండిపోయింది. ఇక నిపుణులు మాత్రం దీని ఎయిర్ ఫ్రేమ్ సహా అన్ని భాగాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే మళ్లీ వాడొచ్చా లేదా అన్నది నిర్ధారిస్తారు.

# సంక్షిప్త వార్తలు

## మచ్చర్‌కు ఇజ్రాయెల్ ప్రధాని అరుదైన ఆహ్వానం



**టెల్ అవీవ్, అక్టోబరు 4:** ఫ్లైదుబాయ్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రశంసలు కురిపించారు. స్మిత్‌తో ఫోన్‌లో మాట్లాడిన నెతన్యాహూ ఇజ్రాయిల్ స్వాతంత్ర్య దినోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ గౌరవం సాధారణంగా ఇజ్రాయిల్ పౌరులకు మాత్రమే దక్కుతుందని, అయి తే మచ్చర్ విషయంలో ఇజ్రాయిల్ ప్రజలంతా ఆయనను తమవాడిగా స్వీకరించారని అన్నారు. తాను ఎలాంటి దాడిని తట్టుకుని విమానాన్ని రక్షించాననే విషయాన్ని మచ్చర్ నెతన్యాహూకు వెల్లడించారు. మచ్చర్ చెప్పిన వివరాలు విన్న నెతన్యాహూ ఆయన ధైర్యాన్ని ప్రశంసించారు. మచ్చర్‌కు తన భార్య తరపున నెతన్యాహూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఇరాన్ దౌత్యవేత్తలు అమెరికా విడిచి వెళ్లిపోవాలి



**వాషింగ్టన్, అక్టోబరు 4:** ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల కోసం అమెరికాకు వెళ్లిన ఇద్దరు ఇరాన్ దౌత్యవేత్తల్ని ఆ దేశం బహిష్కరించింది. సర్వసభ్య సమావేశాలుముగిసిన తర్వాత అమెరికా విడిచి వెళ్లిపోవాలని అమెరికా విదేశాంగశాఖ వారిని ఆదేశించింది. ఈ ఆదేశాలను ధిక్కరించిన కారణంగా ఇద్దరు దౌత్యవేత్తలను ట్రంప్‌సర్కార్ బహిష్కరించింది. ఒక దౌత్యవేత్త శుక్రవారం అమెరికా విడిచి వెళ్లగా, మరొకరు శనివారం బయటకు వెళ్లినట్లు అమెరికా అధికారి తెలిపారు.

## పాక్ మళ్లీ అక్రమ చొరబాట్లు:ఇద్దరు కాల్చివేత



**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** సరిహద్దుల గుండా అక్రమ చొరబాట్లను పాకిస్థాన్ ప్రోత్సహిస్తోందంటూ భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై గట్టి నిరసన తెలిపేందుకు, నిన్నఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ తాత్కాలిక దౌత్య అధికారికి సమన్లు జారీ చేసింది. అక్టోబర్ 2వ తేదీన పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్ వద్ద అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించారు. వెనక్కి వెళ్లిపోవాలని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వారు పట్టించుకోలేదు. దీంతో కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు.

## ప్రపంచం ప్రశంసిస్తుంటే కాంగ్రెస్ మౌనం దేనికి?: బిజెపి



**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** ఫ్లైదుబాయ్ ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ఘటన దేశంలో రాజకీయ వేడిని రగిల్చింది. ముఖ్యంగా రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కాంగ్రెస్‌లపై బీజేపీ విరుచుకుపడుతోంది. స్మిత్ సాహసాన్ని ప్రపంచమంతా కొనియాడుతున్నా, కాంగ్రెస్ నేతలు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నిస్తోంది. బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది ఇదే విషయంపై కాంగ్రెస్‌ను విమర్శించారు. గతంలో జాకీర్ నాయక్, అఫ్జల్ గురు, బుర్హాన్ వానీ, యాకూబ్ మెమన్ వంటి వ్యక్తుల అంశాలపై కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యలు చేశారని, బాట్లాహౌజ్ ఎన్‌కౌంటర్‌పై కాంగ్రెస్ మాట్లాడిందని త్రివేది అన్నారు. కాంగ్రెస్ ఓటు బ్యాంక్ రాజకీయాల్లు చేస్తోందని ఆరో పించారు. ఉత్తర్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ చేసిన నాయకత్వ మార్పులపై కూడా ఆయన విమర్శలు చేశారు. యూపీలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా బ్రహ్మణ వ్యక్తిని, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముస్లిం నేతలను నియ మించడంపై త్రివేది ఈ విమర్శలు చేశారు. దీనికి ఉత్తర్ ప్రదేశ్ ప్రజలే సమాధానం చెబు తారని వ్యాఖ్యానించారు.

## వేధింపులపై పోలీసులకు కొల్లాం యువతి ఫిర్యాదు

**కొల్లాం, అక్టోబరు 4:** వరకట్నం పేరుతో పెళ్లయిన వారం రోజుల నుంచే భర్త, అత్తమామల నుంచి వేధింపులు మొదలయ్యాయి. దీనిని తాళలేక కొల్లామ్‌లోని నీందకారా ప్రాంతానికి చెందిన అంజు అనే యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తమామ, భర్తపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఎఫ్ఐఆర్‌లో అంజు పేర్కొన్న విషయాలను బట్టి చూస్తే నాలుగు నెలల క్రితం అంజు నందులకు వివాహం జరిగింది. అయితే పెళ్లి అయిన వారం రోజుల నుంచే ఆమెపై అత్తింటి వేధింపులు స్టార్ట్ అయ్యాయి. అదనపు కట్నం కోసం తనను మానసిక, శారీరకంగా వేధింపులకు గురి చేసినట్లు అంజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

## త్రిపురలో అర్ధరాత్రి భూప్రకంపనలు



**అగర్తలా, అక్టోబరు 4:** ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా భూమి కంపించడంతో జనం తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ధలై జిల్లా కేంద్రంగా భారీ శబ్దంతో ప్రకంపనలు రావడంతో, నిద్రలో ఉన్న జనం భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 3.8గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. సరిగ్గా అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట ప్రాంతంలో ఈ సంఘటన జరగడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (ఎన్‌సీఎస్) అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం ఈ రోజు తెల్లవారుజామున 00:57:38 గంటలకు భూమి అంతర్భాగంలో ప్రకంపనలు మొదలయ్యాయి. ధలై జిల్లాలోని రేఖాంశం 23.757 ఉత్తరం, అక్షాంశం 91.995 తూర్పు ప్రాంతంలో, భూ ఉపరితలానికి దాదాపు 30 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం నమోదైంది. ఈ మేరకు సీస్మోలజీ విభాగం ఎక్స్ వేదికగా అధికారికంగా సమాచారాన్ని పంచుకుంది. స్వల్ప తీవ్రతతో వచ్చిన భూకంపం కావడంతో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఆస్తి నష్టం గానీ సంభవించినట్లు నివేదికలు అందలేదని స్థానిక యంత్రాంగం స్పష్టం చేసింది.

## ఇండియా కూటమిలోకి టివికె



**చెన్నై, అక్టోబరు 4:** తమిళనాడు రాజకీ యాల్లో కీలక పరిణామం చోటుచేసు కుంది. ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ ప్రతిపక్షాల ఇండియా కూటమిలో చేరింది. ఈ విషయాన్ని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు బి.మాణికం టాగోర్ అధికారికంగా ప్రకటించారు. చెన్నైలోని టీపీసీసీ కార్యాలయంలో జరిగిన బహుళ పార్టీ సమా వేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమా వేశానికి టీవీకే తరఫున మంత్రులు ఆధవ్ అర్జున, ఎన్.మేరీ విల్సన్ హాజరయ్యారు.

టీవీకే చేరికను చారిత్రక దినంగా అభివర్ణించిన మాణికం ఠాగోర్, ఈ పరిణామంతో తమిళనాడులో బీజేపీ వ్యతిరేక కూటమి మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## చాట్‌జిపిటిని వాడుకున్న కేతన్ హంతకి



**పూణె, అక్టోబరు 4:** ప్రేమించి, నిశ్చితార్థం చేసుకున్న యువకుడినే అత్యంత కిరా తకంగా హత్య చేసిన ఘ టనలో సంచలన విష యాలు వెలుగు లోకి వచ్చాయి. పుణేలోని లోహగడ్ కోట వద్ద కేతన్ అగర్వాల్ మరణం కేసులో పోలీసులు దాఖలు చేసిన 5,053 పేజీల చార్జిషీట్ ప్రేమ ముసుగులో జరిగిన ఘోరమైన కుట్రను, టెక్నాలజీని నేరానికి ఎలా వాడుకున్నారో కళ్లకు కట్టింది. ఈ హత్య కేసులో కేతన్‌కు కాబోయే భార్య సియా గోయల్, ఆమె స్నేహితులు చేతన్ చౌదరి, రితేష్ హంగేలను పోలీసులు నిందితులుగా పేర్కొన్నారు. చార్జిషీట్ ప్రకారం, సియా గోయల్ ఈ హత్యకు ప్రధాన సూత్రధారి. హత్యకు నెల రోజుల ముందు, అంటే మే 31న, సియా తన ప్రియుడు కేతన్‌ను లోహగడ్ కోటకు తీసుకెళ్లింది. సరిగ్గా అతడిని ఎక్కడైతే లోయలోకి తోసి చంపాల నుకుందో, అదే ప్రదేశంలో వెనుక నుంచి వివిధ యాంగిల్స్‌లో ఫోటోలు తీసింది. ఇది పక్కా ప్రణాళికలో భాగమేనని పోలీసులు అనుమాని స్తున్నారు. అనంతరం జూన్ 18న, ఓ ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా కేతన్‌ను ఆకర్షించి, మరోసారి లోహగడ్ కోటకు రప్పించారు. అక్కడ, ముందుగా సియా గోయల్ కేతన్‌ను బలంగా నెట్టగా, ఆమె స్నేహితుడు చేతన్ చౌదరి బలంగా తన్ని లోయలోకి పడేశాడని చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో డిజిటల్ ఆధారాలు అత్యంత కీలకంగా మారాయి. హత్యకు ముందే సియా కేతన్ తల్లికి క్షమాపణ చెబుతూ ఓ సందేశాన్ని రాయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనమైన చాట్‌జీపీటీ సాయం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతటితో ఆగకుండా, హత్య తర్వాత దుఃఖాన్ని ఎలా నటించాలి ఒకవేళ పోలీసులు పట్టుకుంటే ఎలా తప్పించుకోవాలి విచారణను ఎలా ఎదుర్కోవాలి వంటి ప్రశ్నలను కూడా చాట్‌జీపీటీలో వెతికినట్లు ఆధారాలు లభించాయి. క్రైమ్, మర్డర్ మిస్టరీ సినిమాలు చూడటం, పాడ్‌కాస్ట్‌లు వినడం కూడా ఈ కుట్రలో భాగమేనని పోలీసులు తమ నివేదికలో తెలిపారు. కేతన్ మరణం తొలుత ప్రమాదవశాత్తు జరిగిందని అందరూ భావించారు. అయితే, కుటుంబ సభ్యుల అనుమానాలు, పోలీసుల లోతైన విచారణతో ఇది ముందస్తు ప్రణాళికతో జరిగిన హత్య అనే కోణం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం నిందితులు జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా, కోర్టులో విచారణ కొనసాగుతోంది.ఈ 5,053 పేజీల చార్జిషీట్ కేసు విచారణలో కీలక ఆధారం కానుంది.



ఆదివారం గుజరాత్‌లోని ఎక్తానగర్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఛైర్మన్ సంతోష్ యాదవ్‌తో సమావేశమైన తెలంగాణ ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

## ఎన్‌హెచ్‌ఎఐ ఛైర్మన్ సంతోష్‌యాదవ్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ

**హైదరాబాద్,అక్టోబరు4,ప్రభాతవార్త:** ఎక్తా నగర్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఛైర్మన్ సంతోష్ యాదవ్‌తో ఆదివారం గుజరాత్‌లో తెలంగాణ ఆర్‌అండ్‌బి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. ఈ సమావేశంలో మంత్రితో పాటు ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ కూడా ఉన్నారు. తెలంగాణలో చేపట్టాల్సిన రోడ్ల ప్రతిపాదనలను కేంద్రాన్ని కోరిన పలు రహదారి ప్రాజె క్టులను కూడా ఆయన సానుకూలంగా పరిశీలించి మంజూరు చేయాలని సంతోష్ యాదవ్‌కు మంత్రి తెలిపారు. అందుకే దేశవ్యాప్తంగా రహదారుల అభివృద్ధి వేగంగా సాగుతోందని అన్నారు. దేశంలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తి కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అత్యంత కీలకమని తెలిపారు. రాష్ట్ర అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కేంద్రం చేపడుతున్న కొత్త విధానాలు, పథకాలను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ సమావేశం ఉపయోగపడుతుందని తెలిపారు. తెలంగాణ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రహదారి ప్రాథమిక వసతులను అభివృద్ధి చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ రాష్టానికి అవసరమైన అన్ని కీలక ప్రాజెక్టులను సాధించేందుకు కృషి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సంతోష్‌యాదవ్ స్పష్టం చేశారు.

## నేడు మహేశ్‌కుమార్‌గౌడ్ 'సత్యాగ్రహదీక్ష'

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ప్రత్యేక సమగ్ర ఎన్నిక జాబితా సవరణతో దేశవ్యాప్తంగా అర్హులైన ఓటర్లను తొలగించడానికి జరిగిన కుట్రను నిరసిస్తూ పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ గాంధీభవన్‌లో సోమవారం సత్యాగ్రహదీక్ష చేపడుతున్నారు. ఉదయం పదిన్నరకు ప్రారంభమయ్యే తెలంగాణ ప్రభుత్వంలో ప్రాతినిధ్యం వహించే మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కూడా సంఘీభావం తెలుపుతూ హాజరవుతారు. భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని ప్రధానంగా సత్యాగ్రహదీక్షలో మహేష్‌కుమార్ చేయనున్నారు. జ్ఞానేశ్‌కుమార్ ఎలక్షన్ ప్రాసెస్‌ను రిగ్గింగ్ చేశారని భారత ఎన్నికల వ్యవస్థపై అపనమ్మకం సృష్టించిన ఇతనిని అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

## పెండింగ్‌లో రైతు బీమా

### నెలలు గడుస్తున్న ఇంకా పరిశీలనలో 2,587 క్లైములు

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** బీమా పరిహారం రాక మృతి చెందిన రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. దరఖాస్తులు చేసుకుని నెలల తరబడి అయినా వాటికి దిక్కుమొక్కు లేకుండా పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో రైతు బీమా పథకాన్ని నిలిపివేసినప్పటికీ, అంతకు ముందు రైతుల కుటుంబాలు దాఖలు చేసిన వేలాది క్లెయిమ్ దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. రైతు బీమీ పథకాన్ని నిలిపివేసే సమయానికి ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ తేదీకి ముందు వచ్చిన వేల దరఖాస్తులు పరిష్కారానికి నోచు కోవడంలేదు. ప్రభుత్వం నిర్దేశించిన తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా రైతు బీమాకు సంబంధించి 2,587 దరఖస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 413 దరఖాస్తులను వివిధ కారణాలు చూపుతూ తిరస్కరించింది. కాగా రైతు బీమా పథకం కింద, రైతులు మరణించిన పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం వారికి రూ.5 లక్షల బీమా కవరేజీని అందిస్తుంది. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం దాదాపు రూ. 1,350 కోట్ల ప్రీమియం చెల్లిస్తోంది. జీవిత బీమా సంస్థకు ప్రీమియం చెల్లించడానికి ఈ ఏడాది ఆగస్టు 14. చివరి తేదీ, అయినా రైతులకు భీమా కవరేజీని విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించకుండా నిలిపివేసింది. అయితే అంతకు ముందు వరకూ బీమా దరఖాస్తులకు మాత్రం పరిహారం ఇవ్వడం జరుగుతుందని ప్రకటించింది. కానీ వాటిని ఇప్పటి వరకూ పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉంచినట్లు పలు రైతు కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.



సమస్యను మీడియాకు వివరిస్తున్న తల్లి, తండ్రి, కుమారుడు

## నా ప్రాణాలకు ముప్పంది.. రక్షణ కల్పించండి

### బిఆర్‌ఎస్ నాయకుడు నిమ్మల శ్రావణ్‌రెడ్డి

**హైదరాబాద్ (నాచారం), అక్టోబరు 4, ప్రభాతవార్త:** తనపై 15 రోజులుగా వరుసగా వ్యక్తిగత దాడులు జరుగుతున్నాయని, వీటివెనుక స్థానిక కాంగ్రెస్ నాయకులు, వారి అనుచరుల ప్రమేయం ఉందని బీఆర్‌ఎస్ నాయకుడు, శ్రావణ్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం బాధితుడు శ్రావణ్‌ర్డ్డి, ఆయన తండ్రి వెంకట్ రెడ్డి, తల్లి అమృత నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తన ప్రాణాలకు ముప్పు ఉందని, తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. రాత్రి వేళల్లో తన ఇంటిపై దాడులు చేసి అద్దాలు ధ్వంసం చేస్తున్నారని, తాను ఇంట్లో లేని సమయంలోనే ఘటనలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు మూడు వేర్వేరు ఘటనలపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఐపీఎస్, మహేష్ భగవత్, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి తదితర అధికారులను కలిసి రక్షణ కల్పించాలని కోరినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తనకు ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు స్థానిక కాంగ్రెస్ నాయకులే బాధ్యత వహించాలని శ్రావణ్ అన్నారు. తనకు అండగా నిలిచిన కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో తనకు వ్యక్తిగత విభేదాలు లేవని, ఆయన నాయకత్వంలో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. తనపై దుష్ప్రచారం కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ సందర్భంగా శ్రావణ్ తల్లి అమృత, తండ్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తమ కుమారుడిపై అసత్య ప్రచారాలు చేస్తూ కుటుంబాన్ని మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. గత 40 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో నివసిస్తున్న తమ కుటుంబాన్ని కక్షపూరితంగా లక్ష్యంగా చేసుకుం టున్నారని, ఇప్పటికే మూడుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా సరైన స్పందన లభించలేదని తెలిపారు. తమ కుమారుడి పరువుకు భంగం కలిగించేలా వ్యవ హరిస్తే పరువునష్టం దావా వేస్తామని హెచ్చరిస్తూ ప్రభుత్వం, పోలీసులు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే తాము నెమలి రవి, అనిల్, చింటు, రఘువరన్, రాజేశ్ తదితరులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు పేర్కొన్నారు.

# రోడ్ల అభివృద్ధితో నితిన్ గడ్కరి దేశాభివృద్ధికి తోడ్పాటు

### ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

### గుజరాత్‌లో 2 రోజులపాటు చింతన్ శివిర్ వర్క్‌షాప్




వడోదరలో మీడియాతో మాట్లాడుతున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** పర్వతమాల, రోప్‌వే సిస్టమ్, భారత్‌మాల పరియోజ, హ్యామ్‌రోడ్ వంటి పథకాలతో నేషనల్ హైవేలతోపాటు మారుమూల గ్రామాల్లో రోడ్లను అభివృద్ధి పరుస్తూ దేశాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన సోమవారం నుంచి రెండు రోజుల జరుగనున్న చింతన్ శివిర్ 2026 వర్క్‌షాప్‌లో పాల్గొనడానికి ఆదివారం గుజరాత్ రాష్ట్రంలోని వడోదర చేరుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారి వికాస్‌రాజ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ గురించి మాట్లాడటం లేదని నితిన్‌గడ్కరి ఒక విజన్ ఉన్న వ్యక్తి అని కితాబు ఇచ్చారు. దేశవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధి జరగా లనే చిత్తశుద్ధి కలిగిన వ్యక్తి అని కాంగ్రెస్, టివికె, ప్రాంతీయ పార్టీలు అంటూ ఏ వివక్ష చూపకుండా అన్ని ప్రాజెక్టులు అవసరాన్ని బట్టి బిజెపి, కాంగ్రెస్, ప్రాంతీయపార్టీలు పాలించే రాష్ట్రాలకు మంజూరు చేస్తారని అయన చెప్పారు. గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా జిల్లా, ఎక్తానగర్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద రెండు రోజుల పాటు సోమవారం,మంగళవారం(5,6 తేదీల్లో) కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన,కేంద్ర ఉపరితల రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో జరగనున్న రెండు రోజుల చింతన్ శివిర్ 2026 వర్క్‌షాప్ లో రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డితో పాటు అధికారుల బృందం పాల్గొననుంది. మంత్రి వెంట వెళ్లే అధికార బృందంలో రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్లు బి.వి రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, పలువురు అధికారులు ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2:30 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్టు నుండి వడోదరకు బయలుదేరి వెళ్లారు. సాయంత్రం గుజరాత్ రాష్ట్ర ఎక్తానగర్, స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణానికి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి బృందం చేరుకున్నారు.

సోమవారం ఉదయం 6:30 గంటల నుండి చింతన్ శివిర్ 2026 కార్యక్రమాలు మొదలవుతాయి. రెండు రోజుల పాటు 5 సెషన్స్‌గా చర్చలు జరుగుతాయి. పిఎం గతి శక్తి పలు ఇన్ఫ్రా ప్రాజెక్టుల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంపై చింతన్ శివిర్ లో ప్రధానంగా చర్చిస్తారు.

చింతన్ శివిర్ 2026 లో దేశంలోని అన్ని రాష్ట్రాల ఆర్ అండ్ బి శాఖ మంత్రులు పాల్గొననున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు కీలక ప్రాజెక్టులపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చర్చిస్తారు. రీజనల్ రింగ్ రోడ్డు, ఎన్‌హెచ్ -65 విస్తరణ, ఎల్బీనగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్, భారత్ ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, పలు నేషనల్ హైవే ప్రాజెక్ట్స్‌పై మంత్రి కోమటిరెడ్డి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా చర్చిస్తారు.

రాష్ట్ర ప్రాజెక్టుల సాధనకు,కేంద్ర సహకారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి బృందానికి దిశా నిర్దేశం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ముఖ్యమంత్రి పలు కీలక ప్రాజెక్టుల నిర్మాణ అంశాలపై చర్చించారు.

# పెరిగిన తెలంగాణ ఓవర్‌డ్రాఫ్ట్

### రూ.2,407 కోట్లు రూ. 2,733 కోట్లకు పెంపు

### వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ సలహా కమిటీ సిఫార్సు

### రూ.326 కోట్లు పెంచుతూ రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పుడు ఉపయోగించుకునే ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని పెంచుతూ రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. 2022-23 నుండి 2024-25 మధ్య కాలంలో రాష్ట్ర సర్దుబాటు చేసిన రాబడి వసూళ్ల ఆధారంగా, తెలంగాణ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ (డబ్ల్యూఎమ్ఎ) పరిమితిని రూ. 2,407 కోట్ల నుండి రూ. 2,733 కోట్లకు, అంటే 13.5 శాతం మేర పెంచాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ సలహా కమిటీ సిఫార్సు చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించిన సమాచారం ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రెవెన్యూ వసూళ్ల రూ.1,59,350 కోట్లు, 2023-24 లో రూ. 1,69,293 కోట్లు, 2024-25లో రూ. 1,67,804 కోట్లుగా ఉంటాయని సలహా కమిటీ లెక్కించింది. ప్రకృతి వైపరీత్యాల ఖర్చుల సర్దుబాటు తర్వాత, సగటు రాబడి రసీదులను పరిగణనలోకి తీసుకోగా రూ.1,65,662 కోట్లుగా తేలింది, దీని ఆధారంగా సవరించిన వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ పరిమితిని సిఫార్సు చేసింది. జూలై 2026 చివరి నాటికి తెలంగాణ కన్సాలిడేటెడ్ సింకింగ్ ఫండ్ (సిఎస్ఎఫ్)లో రూ.7,822 కోట్లు ఉన్నాయని, ఇది దాని బకాయి ఉన్న మార్కెటబుల్ రుణంలో 1.7 శాతానికి సమానమని నివేదిక పేర్కొంది. దీని గ్యారెంటీ రిడెంప్షన్ ఫండ్ (సిఆర్ఎఫ్) రూ. 6,448 కోట్లుగా ఉంది, ఇది దాని బకాయి గ్యారెంటీలలో 2.7 శాతానికి సమానం. రాష్ట్రాలు తమ బకాయి ఉన్న మార్కెట్ చేయదగిన రుణం, హామీలలో వరుసగా కనీసం 5 శాతం ఉండేలా తమ సిఎస్ఎఫ్, సిఆర్ఎఫ్ నిధులను క్రమంగా పెంచుకోవాలని కమిటీ సిఫార్సు చేసింది. తాత్కాలిక నగదు కొరతను తీర్చడానికి ఆర్‌బిఐ, రాష్ట్ర ప్రభుత్వాలకు స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ (ఎస్‌డిఎఫ్), వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్, ఓవర్‌డ్రాఫ్ట్ ద్వారా స్వల్పకాలిక ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. ఈ యేడాది మార్చిలో అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కాగ్ 202425 నివేదిక ప్రకారం, ప్రభుత్వం ఆర్థిక అవసరాలకు, ఆ సంవత్సరంలో రెండు రోజులు మినహా 363 రోజులపాటు ఆర్‌బిఐ నుండి రూ.27,730 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధి ని విని యోగించుకుంది. ఇది 298 రోజులపాటు రూ. 64,188 కోట్ల విలువైన ఓవర్ డ్రాఫ్ట్‌ను కూడా విని యోగించుకుంది. ఎస్‌డిఎఫ్, డబ్ల్యూఎమ్ఎ సౌక ర్యాలను వినియోగించుకున్నాక కూడా, ఒక రాష్ట్రం నగదు నిల్వ రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన కనీస స్థాయికంటే తక్కువకు పడిపోయినప్పుడు ఓవర్ డ్రాఫ్ట్‌ను తీసుకుంటారు. కాగా తెలంగాణకు నిర్దే శిత కనీస నగదు నిల్వ రూ. 1.38 కోట్లుగా ఉందని కేంద్రఆర్థిక మంత్రిత్వశాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

## సింగీతం శ్రీనివాసరావు మరణం భారతీయ చలనచిత్ర రంగానికి తీరనిలోటు

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు4,ప్రభాతవార్త:** సినీరంగంలో ఎన్నో వైవిధ్యభరితమైన చిత్రా లను అందించిన ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు చిత్రపరిశ్రమకు, భారతీయ చలనచిత్ర రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. వైవిధ్యమైన కథాంశాలను, వినూత్నమైన ఆలోచనలను తెరపై ఆవిష్కరిస్తూ తెలుగు సినిమాకు కొత్త దారులు చూపిన సృజనాత్మక దర్శకుడని స్మరించుకున్నారు. ప్రయోగాత్మకతకు పెద్దపీట వేస్తూ ఎన్నో చిరస్మరణీయ చిత్రాలను అందించిన సింగీతం శ్రీనివాసరావు తనదైన ముద్రను సినీ చరిత్రలో శాశ్వతంగా వేశారని అన్నారు. దర్శకుడిగానే కాకుండా రచయితగా, ఆలోచనాపరుడిగా, సినిమా పట్ల అపారమైన ప్రేమతో పనిచేసిన కళాకారుడిగా ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. సింగీతం శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ముఖ్యమంత్రి ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సినీ కళాభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.




చార్మినార్ వద్ద జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపి లక్ష్మణ్

## నషా ముక్త్.. భారత్ లక్ష్యం

### చార్మినార్ వద్ద భారీ ర్యాలీలో ఎంపి కె.లక్ష్మణ్

**హైదరాబాద్ (చార్మినార్), అక్టోబరు 4, ప్రభాతవార్త:** ప్రతీ ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మై భారత్ రాష్ట్ర తెలంగాణ శాఖ ఆధ్వర్యంలోచార్మినార్ నుంచి సిటీ కళాశాల వరకు నిర్వహించిన నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన చార్మినార్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని,యువతతో పాటు ప్రతీ ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్‌ను అరికట్టడానికి దృష్టి పెట్టాయని ఆయన తెలియజేశారు. చార్మినార్ నుంచి ప్రారంభమైన ర్యాలీ గుల్జారాహౌస్, చార్‌కమాన్, షెహరాన్ హోటల్, ఫత్తర్‌గట్టి, మదీనా, హైకోర్టు రహదారి మీదుగా సిటీ కళాశాల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌డిబి ఏడి విశాల్ రాజన, మైభారత్ రాష్ట్ర డైరెక్టర్ అన్వేషన్ చింతల, చార్మినార్ బిజెపి నాయకులు పవన్‌మిశ్రా, నితిన్ కుమార్ అగర్వాల్, ఆకాష్‌అగర్వాల్‌తోపాటు ప్రభుత్వ సిటీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో దూడను చంపిన చిరుతపులి

**హైదరాబాద్, అక్టోబరు 4,ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా పిట్లం మండలం చిల్లర్గి గ్రామ శివారులో శనివారం రాత్రి చిరుతపులి గ్రామానికి చెందిన రైతు పాశం సుధాకర్ గేదె దూడపై చిరుత దాడి చేసి చంపివేసింది. గ్రామస్థుల ఫిర్యాదుతో చిల్లర్గి అటవీ బీట్ అధికారి ప్రభు ప్రసన్న కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనను పరిశీలించారు. మృతి చెందిన గేదె దూడకు పంచనామా నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ హైమద్ దూడ మృతికి వన్యప్రాణి కారణమని పేర్కొంటు పోస్టుమార్టం నివేదిక అందించారు. చిరుతపులి సంచరిస్తుండటంతో గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్బిఓ ప్రభు ప్రసన్న కుమార్ సూచించారు.

ముఖ్యంగా రాత్రివేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పశువులను రాత్రివేళల్లో బయట ఉంచకుండా సురక్షిత ప్రదేశాల్లో కట్టివేయాలని సూచించారు. చిరుత కనిపించినప్పుడు దాని దగ్గరకు వెళ్లడం, దాన్ని తరిమే ప్రయత్నం చేయడం వంటివి చేయకూడదని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. చిరుత కదలికలను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లో నిఘా పెంచుతున్నామని తెలిపారు. గ్రామస్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చిరుత సంచారానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే అటవీశాఖకు తెలియజేయాలని ప్రభు ప్రసన్న కుమార్ సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

# బిసి విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి

### ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలి

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), అక్టోబరు 4, ప్రభాతవార్త:** బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో జాతీయ బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్ పటేల్, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అల్లం యాదయ్య, తెలంగాణ బీసీ ఫ్రంట్ ఛైర్మన్ జి.మల్లేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో 100 బీసీ కాలేజి హాస్టళ్లు, 100 బీసీ గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పేద విద్యార్థుల హాస్టళ్ల నిర్వహణ పట్ల ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ భూములను అమ్మే ఆలోచన విరమించుకోవాలని, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల కోసం స్వంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా అనేక జిల్లాలలో కాలేజి విద్యార్థులకు హాస్టల్ సీట్లు లభించక విద్యను మానుకుంటున్నారని, ప్రభుత్వం తక్షణమే బీసీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు నిర్మించాలని కోరారు. అన్ని పాఠశాలలకు స్వంత భవనాలు ఉన్నాయని, ప్రభుత్వ ఆఫీసులకు కూడా స్వంత భవనాలు ఉన్నాయని, కేవలం బీసీ హాస్టళ్లు, గురుకులాలకు మాత్రమే స్వంత భవనాలు లేకపోవటం విచారకరమని అన్నారు. వందల కోట్లు పెట్టి ఫ్లైఓవర్స్, సెక్రటేరియట్, మంత్రులకు, ఎమ్మెల్యేలకు క్వార్టర్స్ నిర్మించే ప్రభుత్వానికి పేద విద్యార్థుల హాస్టళ్లకు స్వంత భవనాలు నిర్మించాలని ఆలోచన లేకపోవటం, బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, బీసీ హాస్టళ్లకు స్వంత భవనాలు అన్ని సౌకర్యాలతో నిర్మించాలని, ఫీజుల బకాయిలు 8,500 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల ఉన్నత విద్యకు సంబంధించిన మొత్తం ఫీజులను ప్రభుత్వమే భరించాలని, కాలేజి హాస్టల్ విద్యార్థులకు బస్ పాస్, ఇతర చిల్లర ఖర్చులకు ప్రతి బాలికకు 1000 రూపాయలు, బాలుడికి 800 రూపా యలు పాకెట్ మనీ మంజూరు చేయాలని డిమాం డ్ చేశారు. హాస్టల్‌కు కేవలం ముగ్గురు వర్క ర్లు ఉండటం వల్ల సరిపోక ఇబ్బందులు ఎదు రవుతున్నాయని, ప్రతి హాస్టల్‌కు అదనంగా ఇద్దరు వర్కర్ల చొప్పున నియమించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పం దించి, బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షం విద్యార్థులతో కలసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమం లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.రాజేందర్, నాయకులు రామాంజనేయులు, బిసి విద్యార్థి జేఏసీ ఛైర్మన్ లింగ యాదవ్, శివకృష్ణ ముదిరాజ్, వేలాది మంది బీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

# డ్రంకన్ డ్రైవ్ దాడుల్లో 380 మంది మందుబాబుల పట్టివేత

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జంట నగరాలు, శివారు ప్రాంతాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొ నసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రి వేళలో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 380 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 343 మంది ద్విచక్ర వాహనదారులు, 12 మంది ఆటో డ్రైవర్లు, 25 మంది కార్లతో పాటు ఇత ర వాహనాల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 51 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 167 మంది 51 నుంచి 100 పాయి ంట్ల వరకు, 77 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 39 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 12 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఇద్దరు 251 నుంచి 300 పాయింట్ల వరకు, ముగ్గురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమి షనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

**సైబరాబాద్‌లో 97 మంది..**

ఇదిలావుండగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 80 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 76 మంది ద్విచక్ర వాహనదారులు, ఐదుగురు ఆటో డ్రైవర్లు, 15 మంది కార్ల డ్రైవర్లు, ఒకరు భారీ వాహనాల డ్రైవర్ వున్నారు. పట్టు బడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరు స్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అదనపు డిసిపి నరేందర్ తెలిపారు. కాగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 144 మంది బాబులు పట్టుబడ్డారు. వీరిలో 120 మంది ద్విచక్ర వాహనదారులు. ఆరుగురు ఆటో డ్రైవర్లు, 17 మంది కార్ల డ్రైవరు, మరొకరు భారీ వాహన డ్రైవర్ల వున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి తెలిపారు.

# రిటైర్డ్ రేస్‌హార్స్‌ల సంక్షేమానికి కృషి అభినందనీయం

### స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్

### రేస్2విన్ ఫౌండేషన్ హైదరాబాద్‌లో ఘనంగా ది డెక్కన్ డెర్బీ

**హైదరాబాద్ (మలక్‌పేట్), అక్టోబరు 4, ప్రభాతవార్త :** రిటైర్డ్ రేస్‌హార్స్‌ల సంక్షేమానికి కృషి చేయడం అభినందనీయమని స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పేర్కొన్నారు. రేస్2విన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ది డెక్కన్ డెర్బీ 2026 కార్యక్రమం హైదరాబాద్ రేస్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. రెస్ టు విన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వై. గోపీరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రేసింగ్, వ్యాపార, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు, రేసింగ్ అభిమానులు సహా సుమారు 250 మంది పాల్గొన్నారు.

గుర్రపు పందేల సందడితో పాటు రేసింగ్ నుంచి విరమించిన గుర్రాల పునరావాసం, జీవితకాల సంరక్షణ, సంక్షేమంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా 2027 మార్చిలో ఇన్విటేషన్ కప్ వీకెండ్ సందర్భంగా నిర్వహించనున్న రేస్2విన్ ఫౌండేషన్ గాలాను స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, రేస్ క్లబ్ ఛైర్మన్ సురేందర్ రెడ్డి, రేస్ టు విన్ నిర్వాహకులు గోపి రావు లు ఆవిష్కరించారు. స్టోరీస్ ఆఫ్ ఇండియా డాక్యుమెంటరీ ప్రమోషనల్ ఫిల్మ్‌ను కూడా విడుదల చేశారు. హైదరాబాద్ రేస్ క్లబ్‌లో నిర్వ హించిన రేసులో బడ్డీ విజేతగా నిలిచింది. ట్రైనర్ మగన్ సింగ్ ఆధ్వర్యంలో బడ్డీ ఈ విజయాన్ని సాధించింది. అనంతరం జరిగిన విజేతల సన్మాన కార్యక్రమంలో జేకే. కె. ముఖేష్ కుమార్, సుబోధ్ కుమార్ అనంతుల, డా. ప్రభాకర్ చౌదరి (తిపురాణి) తదితరులు పాల్గొని విజేతను అభినందించారు.

స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ హార్స్ రేసింగ్ కు చాలా చరిత్ర ఉందని, ఆరవ నిజాం కాలం నుంచి మలక్ పేట రేస్ క్లబ్ లో హార్స్ రేసింగ్ జరుగుతోందని తెలిపారు. రిటైర్ అయిన గుర్రాల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవడం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు. రేస్ క్లబ్ ఛైర్మన్ సురేందర్ రెడ్డి మాట్లా డుతూ హార్స్ రేసింగ్ ను క్రీడగా పరిగణించాలని కోరారు. పెంచిన జిఎస్టీని తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. రేస్ టు విన్ నిర్వాహకులు గోపి రావు మాట్లా డుతూ రేస్ టు విన్ ఫౌండేషన్ లక్ష్యం రేసింగ్ కెరీర్ ముగిసిన తర్వాత కూడా ప్రతి రేస్‌హార్స్‌కు సంరక్షణ, గౌరవం, సురక్షితమైన భవిష్యత్తు అందించడమే తమ ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. రిటైర్డ్ రేస్‌హార్స్‌ల కోసం స్థిరమైన ఆఫ్టర్‌కేర్ వ్యవస్థను నిర్మిస్తూ, రేసింగ్ కమ్యూనిటీతోపాటు సమాజాన్ని భాగస్వామ్యం చేయడం ద్వారా రేస్ ముగి సినా.. సంరక్షణకు ముగింపు ఉండకూడదు అనే సందేశాన్ని ఆచరణలోకి తీసుకు రావడమే ఫౌండేషన్ సంకల్పమని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.




రేస్ టు విన్ ఫౌండేషన్ గాలాను ఆవిష్కరిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, రేస్ క్లబ్ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, రేస్ టు విన్ నిర్వాహకులు గోపిరావు

# 919 ఆస్పత్రుల్లో నగదురహిత వైద్యం

## 15,395 చికిత్సలకు రూ.104.63 కోట్ల చెల్లింపు

## 7.56 లక్షల హెల్త్‌కార్డుల డౌన్‌లోడ్

## ఇహెచ్‌ఎస్‌కు విశేష స్పందన: సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం ప్రకటన

**హైదరాబాద్,అక్టోబరు4,ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, వారి కుటుంబ సభ్యుల కోసం అమల్లోకి తెచ్చిన న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఎన్ఈహెచ్ఎస్)కు మంచి స్పందన లభిస్తోంది. జూలై 17న ప్రారంభమైన ఈ పథకం పరిధిలోకి ఇప్పటికే 919 ఆస్పత్రులు వచ్చాయి. 15,395 చికిత్సలకు రూ.104.63 కోట్ల ముందస్తు అనుమతులు ఇచ్చారు. వీటిలో 778 ప్రైవేటు, 141 ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. ఉద్యోగులు, పింఛనుదారులతోపాటు అర్హులైన కుటుంబ సభ్యులకు కూడా ఈ పథకం వర్తిస్తోంది. సెప్టెంబర్ 1 నుంచి పోలీసు శాఖను కూడా పథకంలో చేర్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈపథకం నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసింది. ఉద్యోగులు, పింఛనుదారుల బేసిక్ పే లేదా బేసిక్‌పెన్షన్ నుంచి 1.5 శాతం చొప్పున జమ చేస్తుంది. ప్రభుత్వం కూడా అంతే మొత్తాన్ని తన వాటాగా చెల్లిస్తోంది.

ఉద్యోగులు, పింఛనుదారుల నుంచి నెలకు రూ.44 కోట్లు సమకూరుతుంది. ప్రభుత్వం మరో రూ.44 కోట్లు అందిస్తోంది. దీంతో ప్రతి నెలా రూ.88 కోట్ల నిధి అందుబాటులోకి వస్తోంది. ఇప్పటికే మూడు నెలలకు సం బంధించిన నిధులను ట్రస్ట్‌కు బదిలీ చేశారు. ఈ పథకానికి వార్షిక బడ్జెట్ రూ.1,056 కోట్లు అంచనా వేశారు. ఆస్పత్రిలో చేరి చికిత్స పొందే సేవలతోపాటు ఔట్‌పేషెంట్ సేవలనూ పథకంలో చేర్చారు. వెల్‌నెస్ కేంద్రాల్లో వైద్యుల సంప్రదింపులు, పరీక్షలు, మందులను నగదురహితంగా అందిస్తున్నారు. ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తున్నాయి,మరో 25 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో 21 కేంద్రాలను వివిధ జిల్లాల్లో, మరో నాలుగింటిని హైదరాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే వెల్‌నెస్ కేంద్రాల సంఖ్య 37కు చేరుతుంది. ఇన్‌పేషెంట్ వైద్య సేవలకు 1,816 సీజీహెచ్ఎస్ చికిత్స ప్యాకేజీలను అమలు చేస్తున్నారు.

చికిత్సతోపాటు మందులు, పరీక్షలు, వినియోగ వస్తువులు, ఇంప్లాంట్లు, తదుపరి వైద్య సేవలను కూడా ప్యాకేజీల్లో చేర్చారు. అత్యవసర పరిస్థితుల్లో ముందస్తు రిఫరల్ లేకుండానే సమీపంలోని ఎంప్యానెల్డ్ ఆస్పత్రిలో చేరే అవకాశం కల్పించారు. అయితే నిర్ణీత సమయంలో సంబంధిత వివరాలను ట్రస్ట్‌కు తెలియజేయాల్సి ఉంటుంది.

హెల్త్‌కార్డు జారీ కాలేదన్న కారణంతో అర్హులకు వైద్య సేవలను నిరాక రించ రాదని అధికారులు స్పష్టం చేశారు. ఉద్యోగులు, పింఛనుదారులు తమ గుర్తింపు సంఖ్య ఆధారంగా వైద్య సేవలు పొందవచ్చు. సెప్టెంబర్ 28 నాటికి 12,56,962 మంది లబ్ధిదారుల హెల్త్‌కార్డులు అందు బాటులోకి రాగా, 7,56,210 మంది వాటిని డౌన్‌లోడ్ చేసుకున్నారు.

ఉద్యోగులకు సంబంధించిన 3,192 కేసులకు రూ.18.75 కోట్లు, వారి కుటుంబ సభ్యుల 5,669 కేసులకు రూ.39.52 కోట్లు అనుమతించారు. పింఛనుదారుల 4,042 కేసులకు రూ.29.27 కోట్లు, వారి కుటుంబ సభ్యుల 2,492 కేసులకు రూ.17.08 కోట్ల మేర ముందస్తు అనుమతులు ఇచ్చారు. కొత్త పథకం అమల్లోకి వచ్చిన తర్వాత పాత ఈహెచ్ఎస్‌కు సంబంధించిన బకాయిల్లో రూ.70 కోట్లు విడుదల చేశారు. ఇంకా రూ.100.52 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందులో ప్రైవేటు ఆస్పత్రులకు రూ.23.85 కోట్లు,ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.76.67 కోట్లు బకాయి ఉన్నాయి.

ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించేం దుకు రూ.19.23 కోట్ల విలువైన చెక్కులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. లబ్ధిదారులకు ఆస్పత్రుల్లో ఇబ్బందులు తలెత్తకుండా 30 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్, అడ్మిషన్, చికిత్స సమన్వయం నుంచి ఫిర్యాదుల పరిష్కారం వరకు వీటి ద్వారా సహాయం అందిస్తున్నారని సిఎం పేర్కొన్నారు.

## పేదల హృదయాల్లో దీపంలా వెలిగిన మహనీయుడు వెంకటస్వామి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:**పేద ప్రజల హృదయాల్లో దీపంలా వెలిగిన మహనీయుడు కాకా జి. వెంకటస్వామి అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. కాకా జి. వెంకటస్వామి జయంతి (అక్టోబర్ 5) సందర్భంగా ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా జి. వెంకటస్వామి ప్రజలకు విశేష సేవలందించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా సింగరేణి కార్మికుల జీవితాల్లో ఆయన చెరగని ముద్ర వేశారని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని సిఎం అన్నారు.

## కెటిఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం అందింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో నిర్వహించనున్న టిఏఎల్ హెల్త్ ఫెస్ట్- 2026కు విశిష్ట అతిథిగా ఆహ్వానం వచ్చింది. అక్టోబర్ 30న యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగోలో జరగనున్న అంతర్జాతీయ ఆరోగ్య సదస్సుకు కేటీఆర్‌ను ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు. టచ్‌ఎలైఫ్ ఫౌండేషన్ సీఈవో సాయి గుండవెల్లి కేటీఆర్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, భవిష్యత్ వైద్య విధానాలు, ఆవిష్కరణలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు. సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ హెల్త్, పర్సనలైజ్డ్ మెడిసిన్, మెడికల్ టూరిజం తదితర అంశాలపై అంతర్జాతీయ నిపుణులు చర్చించనున్నారు. వైద్యం, సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో చోటుచేసుకుంటున్న మార్పులపై వివిధ దేశాలకు చెందిన ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ కూడా ఆరోగ్య రంగంలో సాంకేతికత వినియోగం, ఆవిష్కరణలు, డిజిటల్ హెల్త్ తదితర అంశాలపై తన ఆలోచనలను అంతర్జాతీయ వేదికపై పంచుకోనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## రేవంత్‌రెడ్డి మన నీళ్లను గిఫ్ట్‌ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు

### టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత



ఆదివారం బంజారాహిల్స్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావే శంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోంద న్నారు. 'నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి' అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరురంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 67 గంటల కోత లతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జులు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

# అశోక్ సింఘాల్ చిరస్మరణీయులు: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అశోక్ సింఘాల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, విహెచ్‌పి కేంద్రీయ ఉపాధ్యక్షుడు, రామ మందిర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ తదితరులు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), అక్టోబరు 4, ప్రభాతవార్త:** అయోధ్య రామజన్మ భూమి మందిర నిర్మాణం కోసం జీవితాన్ని అంకితం చేసి సుదీర్ఘ పోరాటం చేసిన విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ అశోక్ సింఘాల్ చిరస్మరణీయులని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ విహెచ్‌పి ఆధ్వర్యంలో అశోక్ సింఘాల్ జన్మ శతాబ్ధి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం నిరంతరం శ్రమించిన అశోక్ సింఘాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను ముందకు తీసుకెళ్ళినప్పుడే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. హిందూ సమాజం అశోక్ సంఘాల్ జీవితం చూసి చాలా నేర్చుకోవాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. విశ్వ హిందూ పరిషత్ ఒక సంస్థ కాదనీ హిందూ చైతన్య వేదిక అని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. హిందూ సమాజం ఎవరి మీద దాడి చేయదనీ విశ్వగురువుగా ఖ్యాతినొందుతూ సర్వే జనా సుఖినోభవంతు అంటూ ప్రపంచం అంతా వసుదైక కుటుంబంగా భావిస్తుందని అన్నారు. హిందూ ధర్మం, సంస్కృతి పరిరక్షణకు విహెచ్‌పి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అశోక్ సింఘాల్ శత జయంతి సందర్భంగా గుర్తు చేసుకోవడం కాదనీ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. హిందూ సమాజ పరిరక్షణ ప్రతి ఇంటా తీసుకెళ్ళాలన్నదే సింఘాల్‌కు నివాళి అని అన్నారు. అశోక్ సింఘాల్ కలలు గన్న బలమైన హిందూ సమాజ ఆవిష్కరణకు కలిసి కట్టుగా కృషి జరగాలని తెలిపారు. ఈ ధర్మ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. భారతీయుల రక్తంలోనే ధైర్యం, తెగువ ఉంటుందనడానికి పైలట్ స్మిత్ మచ్చార్ సాహసాన్ని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఉదహరించారు.

**హిందూ జాతికి అశోక్ సింఘాల్ ప్రేరణ: చంపత్ రాయ్**

రామజన్మ ఉద్యమంలో అశోక్ సింఘాల్ సేవలు అనిర్వచనీయమని, హిందూ జాతికి ఆయన ప్రేరణ అయ్యారనీ విహెచ్‌పి కేంద్రీయ ఉపాధ్యక్షుడు, రామ మందిర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కొనియాడారు. సింఘాల్ జన్మ శతాబ్ధి ఉత్సవ సభలో ప్రధాన వక్తగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేడు లక్షలాది మంది యువత విహెచ్‌పిలో పని చేస్తున్నారంటే దానికి స్ఫూర్తి అశోక్ సింఘాలని అన్నారు. తన జీవితాన్ని సర్వాన్ని త్యాగం చేసిన మహానుభావుడని పేర్కొన్నారు. వైదిక వారసత్వాన్ని పరిరక్షించడం, సామాజిక సామరస్యాన్ని పెంపొం దించడం వంటి లక్ష్యాలతో దేశవ్యాప్తంగా ప్రజలను సమీకరించేందుకు రామజన్మ భూమి ఉద్యమాన్ని ముఖ్య మాధ్యమంగా చేశా రని ఆయన తెలిపారు. దేశంలోని సాధువు లను ఒకే వేదికపైకి తీసుకు రావడానికి తీవ్రంగా కృషి చేశారని గుర్తు చేశారు. రామజన్మ భూమి ఉద్యమ సమయంలో సింఘాల్‌తో తనకున్న అనుబంధం, సాన్నిహిత్యాన్ని చంపత్ రాయ్ గుర్తు చేసుకొని సభకు వివరించారు. ప్రతిష్టాత్మకంగా జరిగిన అశోక్ సింఘాల్ శత జయంతి సభలో విహెచ్‌పి కేంద్రీయ మార్గదర్శక మండలి సభ్యులు సంగ్రామ్ మహారాజ్, దుర్గానందపూరి స్వామీజీ, విహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహా మూర్తి, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపి ఈటెల రాజేందర్, పలువురు బిజెపి నాయకులు, విహెచ్‌పి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# దేవర సినిమా పాటపై ఎఐ మార్ఫింగ్ వీడియో

### సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ నటించిన దేవర సినిమాలోని చుట్టమల్లే పాటను గుర్తు తెలియని వ్యక్తులు ఎఐ మార్ఫింగ్‌తో అశ్లీలంగా తయారు చేయడంపై నగర సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పాటకు సంబంధించిన ఎఐ మార్ఫింగ్ వీడియో శనివారం నాడు సోషల్ మీడియాలో వైరల్ అవడం తెలిసిందే. సైబర్ నేరగాళ్లు లేదా సినీ వర్గాలకు చెందిన వ్యక్తులు ఈ నేరానికి పాల్పడి వుంటారని భావిస్తున్న పోలీసులు ఆ దిశగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఫేక్ వీడియో మొదట ఎక్కడ అప్‌లోడ్ చేశారు..? దీనిని ఎవరు సృష్టించారు...? ఏ ఏ ఖాతాల ద్వారా ఇది సర్క్యులేట్ అయ్యింది...? అనే అంశాలపై పోలీసుల విచారణ సాగుతోంది. దీనిపై కొందరు అనుమానితులను పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. వీరిని ఒకటి రెండు రోజుల్లో విచారించే వీలుంది. కాగా ఈ ఫేక్ వీడియోపై జూ నియర్ ఎన్టీఆర్ సహా సినీ రంగానికి చెందిన వారంతా తీవ్రంగా స్పందించడం తెలిసిందే. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేయడం విదితమే.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగం**

**చిత్ర పరిశ్రమలో కమిటీ ఏర్పాటు చేయాలి: మెగాస్టార్ చిరంజీవి**

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వినియోగించాల్సిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) దుర్వినియోగం అవుతోందని మెగాస్టార్ చిరంజీవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను కించపరిచే మార్ఫింగ్ వీడియోలను రూపొందించడానికి ఎఐను ఉపయోగించడాన్ని ఖండించారు. అటువంటి కంటెంట్‌ను సృష్టించడం, ప్రచారం చేయడం, విస్తరింప చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో వెల్లడిస్తూ ఒక మహిళలను కించపరచే మార్ఫింగ్ వీడియోలు చేయడం తనను తీవ్రంగా కలవరపరచిందన్నారు. ఇలాంటి చర్యలు క్రూరమైనవని, సిగ్గుచేటని, ఇటువంటివి ఏ మాత్రం ఆమోదయోగ్యమైనవి కావని, వాటిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది కేవలం ఒక వ్యక్తి లేదా ఒక సినిమాకు సంబంధించిన సమస్య కాదని, ఈ రోజు ఒకరికి జరిగింది, రేపు మీకు లేదా నాకు, మనకు తెలిసిన వారికి ఎవరికైనా జరగవచ్చన్నారు. ఈ దురాచారానికి వ్యతిరేకంగా నిలబడాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తెలుగు ఫిల్మ్ ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌తో పాటు, చిత్ర పరిశ్రమలోని అనుబంధ పరిశ్రమ సంస్థల దృష్టికి తీసుకెళతానని వెల్లడించారు. ఎఐ దుర్వినియోగంపై ఒక ప్రత్యేక కమిటీ, సహాయక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ అధికారులతో సన్నిహితంగా పనిచేస్తూ, ఈ బృందం బాధితులకు మద్దతు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలాగే అటువంటి కంటెంట్‌ను తొలగించే ప్రయత్నాలను సమన్వయం చేయడంతో పాటు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రయత్నం కోసం తెలుగు చిత్ర పరిశ్రమ ఏకం కావాల్సి ఉందని చెప్పారు. చిత్రపరిశ్రమలోని సంఘాలు, కళాకారులు, సాంకేతిక నిపుణులు, ప్రేక్షకులు, అభిమానులు అందరూ తమ వంతు పాత్ర పోషించాలని వెల్లడించారు.

## ఓటమి భయంతోనే ఖైరతాబాద్ ఉపఎన్నికను అడ్డుకుంటున్నారు

### బిఆర్ఎస్, కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలి: ఎంపి డికె అరుణ



**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకోవడంతోనే.. ఎన్నిక జరగకుండా అడ్డుకునేందుకు పిటిషన్లు వేయించారని మహబూబ్‌నగర్ బిజెపి ఎంపి డికె అరుణ విమర్శించారు. నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతూ, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నాయని మండిపడ్డారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, అధికారంలోకి రాగానే సిగ్గులేకుండా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకుందని డికె అరుణ ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఫిరాయించిన ఎమ్మెల్యేలు తాము ఏ పార్టీకి చెందినవారమో ప్రజలకు చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలన్నారు. రాష్ట్రంలో తాము బ్రహ్మాండమైన పాలన అందిస్తున్నామని, అన్ని హామీలను అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులకు.. మళ్ళీ ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడగడానికి సిగ్గు ఎందుకు? అని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు మళ్లీ గెలుస్తామనే నమ్మకం ఉంటే.. ఫిరాయింపు ఎమ్మెల్యేలందరితో తక్షణమే రాజీనామాలు చేయించి, ఉప ఎన్నికల్లో పోటీ చేయించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ గుర్తుపై గెలిచి, సిగ్గు లేకుండా కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలకు దమ్ము, ధైర్యం ఉంటే రాజీనామా చేసి తిరిగి గెలవాలని సవాల్ విసిరారు.

**ఖైరతాబాద్‌లో బిజెపి విజయం ఖాయం..**

గతంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని బిజెపి కైవసం చేసుకుందని, రాబోయే రోజుల్లో కూడా అక్కడ బిజెపి మళ్లీ ఘన విజయం సాధిస్తుందనే విశ్వాసం తమకు ఉందని డికె అరుణ స్పష్టం చేశారు. ఖైరతాబాద్ ప్రజలు కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీల వైఖరిని అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. అభివృద్ధిని కుంటుపరిచారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోడీ ఎటువంటి పక్షపాతం చూపకుండా రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఇస్తున్నారని ఆమె గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండింటి పాలనను చూశారన్నారు. ఈ రెండు పార్టీలు కలిసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు వేర్వేరు కాదని, లోపాయికారి ఒప్పందంతో పని చేస్తున్న ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలని విమర్శించారు. అభివృద్ధిని కుంటుపరిచిన ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు.

## చిన్నారుల కోసం ఒకే జాతీయ సైబర్ పోర్టల్ ఏర్పాటు

### హెల్ప్‌లైన్లను సమన్వయం చేస్తూ ఒకే ఉమ్మడి హెల్ప్‌లైన్

### కేంద్ర న్యాయ శాఖ కార్యదర్శి నీరజ్‌వర్మ కీలక ప్రతిపాదన

### విజయవంతంగా ముగిసిన నల్సా సౌత్ జోనల్ కాన్ఫరెన్స్

**హైదరాబాద్,అక్టోబరు4,ప్రభాతవార్త:**అన్ని పోర్టళ్లను ఏకీకృతం చేస్తూ చిన్నారుల కోసం ఒకే జాతీయ సైబర్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని, 112, 1930, 1098 హెల్ప్‌లైన్లను సమన్వయం చేస్తూ ఒకే ఉమ్మడి హెల్ప్‌లైన్ నిర్వహించాలని, నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ ద్వారా చిన్నారులపై జరిగే సైబర్ నేరాల విచారణను నిరంతరం పర్యవేక్షించాలని భారత ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి నీరజ్ వర్మ స్పష్టం చేశారు. నల్సా ఆధ్వర్యంలో మూడు కీలక సంస్కరణలను చేపట్టాలని ప్రతిపాదించారు: హైదరాబాద్ లో నిర్వహించిన రెండు రోజుల నల్సా (నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ) సౌత్ జోనల్ కాన్ఫరెన్స్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల నుండి చిన్నారులను రక్షించడంలో ఎదురవుతున్న చట్టపరమైన అంతరాలు, వ్యవస్థాగత లోపాలు, తీసుకోవాల్సిన విధానపరమైన మార్పులపై సమగ్ర గణాంకాలతో కూడిన విశ్లేషణను సమర్పించారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) విడుదల చేసిన క్రైమ్ ఇన్ ఇండియా 2024 నివేదికను ఉటంకిస్తూ, దేశంలో మొత్తం నేరాలు 10.8శాతం తగ్గినప్పటికీ, చిన్నారులపై జరుగుతున్న నేరాల నమోదులో 46శాతం భారీ పెరుగుదల నమోదైందని ఆయన వెల్లడించారు. చిన్నారులపై నమోదైన సైబర్ నేరాలలో 89శాతం నేరాలు చిన్నారుల లైంగిక వేధింపుల కంటెంట్ (సిఎస్ఏఎం)కు సంబంధించినవేనని, పోక్సో చట్టం క్రింద నమోదవుతున్న కేసులలో 96.6శాతం మంది నిందితులు బాధితులకు ముందే పరిచయమున్న వ్యక్తులేనని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ నేరాలలో 66.4శాతం కేసులు కేరళ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అనే ఐదు రాష్ట్రాల్లోనే నమోదవుతున్నాయని, ఈ ఐదు రాష్ట్రాల్లోనే దేశంలోని 67శాతం సైబర్ పోలీస్ స్టేషన్లు కేంద్రీకృతమై ఉండటమే దీనికి ప్రధాన కారణమని ఆయన వివరించారు. దేశంలోని 800 జిల్లాలకు ప్రస్తుతం కేవలం 441 ప్రత్యేక సైబర్ పోలీస్ స్టేషన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ప్రతి జిల్లాలో కనీసం ఒక సైబర్ పోలీస్ స్టేషన్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయడమే మన మొదటి జాతీయ వ్యూహం కావాలని పిలుపునిచ్చారు. టెలికాం రంగంలో వచ్చిన మార్పులను ప్రస్తావిస్తూ, 1995లో 2జి నుండి నేడు గ్రామాల వరకు 4జి, జిల్లాలన్నింటికీ 5జి విస్తరించిందని, 2030 నాటికి 1 టిబిపిఎస్ వేగంతో 6జి అందుబాటులోకి రానుందని, దీని ద్వారా ఏఆర్/విఆర్ దుర్వినియోగం, క్షణాల్లో వాస్తవంగా కనిపించే సింథటిక్ మీడియా తయారీ వంటి ప్రమాదాలు పెరుగుతాయని హెచ్చరించారు. ప్రస్తుతం నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్, సెర్ట్‌ఇన్, సీడబ్ల్యూసీ, రాష్ట్ర సైబర్ సెల్స్ వంటి సంస్థలు వేర్వేరుగా పనిచేస్తున్నాయని, చిన్నారులు నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఒకే ఒక్క సమీకృత పోర్టల్ లేదా వ్యవస్థ లేకపోవడం పెద్ద లోపమని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ తెలుగులో ముద్రించిన పుస్తకాలను అతిథులు విడుదల చేశారు.

# కోట్లాది ఓట్ల తొలగింపు రాజ్యాంగ ఆత్మను దెబ్బతీస్తుంది

### సుప్రీంకోర్టు జడ్జి ఉజ్జల్ భూయాన్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:**భారీ సంఖ్యలో దేశ పౌరుల ఓటు హక్కును హరించే ఏ ప్రక్రియ అయినా రాజ్యాంగ వ్యవస్థను ఉల్లంఘించడమే అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ స్పష్టం చేశారు. ఏ అధికార వ్యవస్థ అలా చేయరాదు.. ఏ న్యాయస్థానం కూడా దానిని సమర్ధించదు అని ఆయన ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగం పౌరులందర్నీ సమానంగా చూస్తుంది.. ఓటు హక్కు ఉన్నవారు.. ఓటు హక్కులేనివారు అని వర్గీకరించదు అని హైదరాబాద్‌లో నల్సార్ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో జస్టిస్ భూయాన్ అన్నారు. భారత రాజ్యాంగంలో ఓటు హక్కు ఉన్న పౌరులు.. ఓటు హక్కు లేని పౌరులు అని రెండు వర్గాలు లేవు అని ఆయన తెలిపారు. 'ఏదైనా ప్రక్రియ వల్ల కోట్లాది మంది భారతీయ పౌరులు తమ ఓటు హక్కును కోల్పోయి, సొంత దేశంలోనే ద్వితీయ శ్రేణి పౌరులుగా మారితే, అలాంటి ప్రక్రియ ప్రాథమికంగానే అపహాస్యమవుతుంది, ఏ రకంగా దీనిని సమర్థించలేం, ఇది రాజ్యాంగ ఆత్మనే దెబ్బతీస్తుంది అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు సమానత్వ హక్కును ప్రసాదించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, సార్వజనీన వయోజన ఓటు హక్కును కల్పించే ఆర్టికల్ 326ని ఉల్లంఘించడమేనని ఆయన తేల్చిచెప్పారు. భారత రాజ్యాంగం కింద స్వీకరించిన రక్షణలను ఇది తిరస్కరించడమేనని నేను ఖచ్చితంగా చెబుతాను అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. నల్సార్ లా యూనివర్సిటీలో జరిగిన 19వ నల్సారజస్టిస్ బి.ఆర్. సాహ్నే మెమోరియల్ మూట్ కోర్ట్ పోటీల ముగింపు కార్యక్రమంలో జస్టిస్ భుయాన్ ప్రసంగించారు. గతంలో ఆయన ఈ విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరించారు. ఒక భారతీయ పౌరుడికి ఓటు హక్కు లేదా ఓటర్ల జాబితాలో పేరు పొందే హక్కును కాదనలేం.. అలా అయితే అది శరీరం నుంచి ఆత్మను వేరు చేసినట్లే అవుతుంది అని న్యాయమూర్తి అన్నారు. జస్టిస్ భూయాన్ విస్తృత కోణంలో మాట్లాడుతూ, ఓటు హక్కును భారత్ స్వాతంత్ర్య పోరాటంతో ముడిపెట్టారు. భారత పౌరుల ఓటు హక్కు విదేశీ పాలనకు వ్యతిరేకంగా మనం చేసిన సుదీర్ఘ పోరాటంతో ముడిపడి ఉంది. ఎన్నో పోరాటాలు, త్యాగాల తర్వాత సాధించుకున్న స్వేచ్ఛకు ఇది ప్రతీక అని ఆయన అన్నారు. ఆర్టికల్ 326తో ఏ రకమైన ఆటాడకూడదు. ఏ అధికార వ్యవస్థా దానిని దెబ్బతీయలేదు, ఏ కోర్టు దానిని సమర్థించదు. రాజ్యాంగం కంటే ఎవరూ ఎక్కువ కాదు అని ఆయన స్పష్టం చేశారు. చనిపోయిన ఓటర్ల విషయంలో తప్ప ఓటర్ల జాబితాలో నమోదై ఒక ఓటరు పేరును ముందస్తు నోటీసు, విచారణ లేకుండా తొలగించకూడదు అని తెలిపారు. ఓటు హక్కు లేని పౌరుడికి విలువ ఏముంటుంది? అని ఆయన ప్రశ్నించారు. 1979లో మద్రాస్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ప్రముఖ న్యాయకోవిదుడు నానీ పల్కీవాలా చేసిన ప్రసంగాన్ని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి గుర్తుచేశారు. స్వేచ్ఛ అనేది రక్తం ద్వారా వారసత్వంగా సంక్రమించదు. ప్రతి తరం దానిని కాపాడుకోవాలి, దాని కోసం పోరాడాలి. అప్పుడు మాత్రమే అది మనుగడ సాగించి తదుపరి తరానికి అందుతుంది. అలాగే, ప్రజాస్వామ్యంలో అత్యున్నత పదవి అంటే అధ్యక్షుడిది కాదు, పౌరుడిదేనన్న అమెరికా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఫెలిక్స్ ఫ్రాంక్‌ఫర్టర్ వ్యాఖ్యలను జస్టిస్ భుయాన్ ఉటంకిస్తూ ప్రజాస్వామ్యం అనేది ఎల్లప్పుడూ ఆకర్షించే ఒక గమ్యస్థానం తప్ప, సురక్షితమైన ఓడరేవు కాదు; ఎందుకంటే స్వేచ్ఛ అనేది నిరంతర ప్రయత్నం, అదెప్పుడూ ఒక ముగింపు కాదు అని అన్నారు. భారత సుప్రీంకోర్టు ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించకపోయినప్పటికీ, రాజ్యాంగబద్ధమైన హక్కుగా గుర్తించిందని ఆయన చెప్పారు.

## మాజీ మేయర్ అల్లంపల్లి పోచయ్య మృతి

హైదరాబాద్,అక్టోబరు4,ప్రభాతవార్త: హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ అల్లంపల్లి పోచయ్య (80)అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. హైదబాబాద్ పాతనగరం ఛత్రీనాక ప్రాంతానికి చెందిన ఆలంపల్లి పోచయ్య 1986లో జంగమెంట్ డివిజన్ నుంచి ఎంఐఎం కార్పొరేటర్‌గా గెలుపొందారు. 1989 నుంచి 1991వరకు ఆయన హైదరాబాద్ నగర మేయర్ గా పనిచేశారు. ఎంఐఎం పార్టీ తరపున మేయర్‌గా ఎన్నికయ్యారు. ఎంఐఎం పార్టీ అప్పట్లో 'షహర్ హమారా, మేయర్ హమారా' నినాదంతో వరుసగా ఐదేళ్లు తమ అభ్యర్థులను మేయర్లుగా నిలబెట్టింది. ఆ సమయంలో ఎం.ఐ.ఎం ఎంపిక చేసిన ముగ్గురు హిందూ మేయర్లలో అల్లంపల్లి పోచయ్య ఒకరు. సోమవారం నల్లవాగు స్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. మాజీ మేయర్ ఆలంపల్లి పోచయ్య మృతి పట్ల పలువురు త మ ప్ర గా ఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# మదనపల్లి ప్రజల ఉత్సహాన్ని కాంగ్రెస్ తప్పుద్రోవపట్టిస్తుంది

- ముఖ్యమంత్రి చంద్రబాబు
- కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో చేసిన పోస్టుపై

**విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** కాంగ్రె స్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో చేసిన పోస్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఘాటుగా స్పందించారు. జైరాం రమేశ్ మదన పల్లి ఘట నను అర్థం చేసుకున్న తీరు వాస్తవానికి పూర్తి విరుద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజల్లో కని పించింది ఆగ్రహం కాదని అపారమైన ఉత్సా హం, అనూహ్య స్పందన అని చంద్రబాబు తెలి పారు. సభ సజావుగా కొనసాగేందుకు ప్రజల ఉత్సాహం కారణంగా తాను కొద్దిసేపు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని చంద్రబాబు వివరించా రు. ప్రజల ఉత్సాహాన్ని ఆగ్రహంగా చిత్రీకరించిన తీరు చూస్తే, ప్రజల ఆలోచనలకు జైరాం రమేశ్ ఎంత దూరంగా ఉన్నారో అర్థమవుతోందని వ్యా ఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాలతో సోషల్ మీడియాలో చేసే కథనాలు, ప్రజలు స్వయంగా వ్యక్తం చేసిన స్పందనను మార్చలేవని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**జైరాం రమేశ్ తప్పుడు ప్రచారం సరికాదు -మంత్రి లోకేశ్**

కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తప్పుడు ప్రచారం సరికాదంటూ మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో గట్టి కౌంటర్ ఇచ్చారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండానే ఫేక్ న్యూస్‌ను ట్వీట్ చేయడం సీనియర్ నేతగా ఆయన స్థాయికి తగదని మండిపడ్డారు. మదనపల్లిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగాన్ని ఉద్యోగాలు కోరుతూ స్థానిక యువత అడ్డుకున్నారంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని లోకేశ్ స్పష్టం చేశారు.

## తల్లికి వందనం పథకం రెండో విడత
# నిధుల విడుదలకు మార్గం సుగమం



**అమరావతి,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో తల్లికి వందనం పథకం రెండో విడత నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి తుది అనుమతి రావడమే మిగిలి ఉంది. సీఎంవో నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే నిధులను విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విడతలో భాగంగా అర్హులైన సుమారు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 13,000 చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు, గతంలో సాంకేతిక కారణాలు, ఇతర మార్పుల వల్ల డబ్బులు అందని వారికి కూడా ఈ విడతలో నిధులు అందించనున్నారు.

అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌కు ఆర్థిక శాఖ కూడా ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఈ ఫైల్ సీఎంవో వద్ద తుది ఆమోదం కోసం ఉంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అనుమతి లభించిన వెంటనే, ఒకటి రెండు వారాల్లో లేదా వచ్చే వారంలోనే నిధులు జమ అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయ్యిందా లేదా, ఈకేవైసీ పూర్తయిందా అనే వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థి, తల్లి ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వంటివి సరిగ్గా ఉంటే నిధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో జమ అవుతాయని వారు స్పష్టం చేశారు.

## ఉక్రెయిన్‌లో భారత్ ఫార్మాకంపెనీపై రష్యాదాడి

**కీవ్, అక్టోబరు 4:** రష్యాఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న వేళ, ఉక్రెయిన్‌లోని భారతీయ ఫార్మా కంపెనీపై భీకర దాడి జరిగింది. రష్యా ప్రయోగించిన డ్రోన్లు సుమీ నగరంలోని కుసుమ్ గ్రూప్‌నకు చెందిన ఫార్మా ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు తెలిపారు. ఈ దాడిలో ప్లాంట్‌లోని ప్రధాన నిర్మాణం దాదాపు పూర్తిగా ధ్వంసమైంది. డ్రోన్లు దాడి చేసిన ప్రాంతం నుంచి భారీగా పొగ కమ్ముకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ దాడి వల్ల సుమారు రూ.400 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రెండేళ్లకు పైగా యుద్ధం జరుగుతున్నప్పటికీ, ఈ ప్లాంట్ నిరంతరాయంగా ఉత్పత్తిని కొనసాగిస్తూనే ఉంది. తాజా దాడితో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. భారతీయుడైన రాజీవ్ గుప్తా నేతృత్వంలో కుసుమ్ గ్రూప్ నడుస్తోంది. ఈ సంస్థ 1994 లో భారతీయ ఔషధాలను ఉక్రెయిన్‌కు ఎగుమతి చేసే డిస్ట్రిబ్యూటర్‌గా ప్రారంభమై, ఆ తర్వాత సొంత బ్రాండ్లను మార్కె టింగ్ చేసింది. 2009లో సుమీ నగరంలో తయారీ ప్లాంట్‌ను స్థాపించింది. ఈ గ్రూప్ ఉక్రెయిన్, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ వంటి 9కి పైగా దేశాలకు 50 రకాల జనరిక్ ఔషధాలను విక్రయిస్తోంది. గత కొంతకాలంగా రష్యా చవకైన, వేగవంతమైన షాహెద్ డ్రోన్లతో ఉక్రెయిన్‌పై నిరంతరం దాడులు చేస్తోంది.

## ఎపిలో బిపిసిఎల్ ప్రాజెక్టుకు
# కేంద్రం గ్రీన్ సిగ్నల్




**అమరావతి.అక్టోబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (తీశిదిలి) ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.96,862 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు కానుంది. బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టుకు తాజాగా పర్యావరణ అనుమతులు మంజూరయ్యాయి. ఏటా 912 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ రిఫైనరీని ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ ఇప్పటికే ప్రకటించారు. ఈ కాంప్లెక్స్ ద్వారా ఏడాదికి 9 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పెట్రోల్, డీజిల్, ఇతర పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయారు చేయనున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ, ప్రాజెక్ట్ ప్రాంగణంలో 30 శాతం మేర (సుమారు 1,563 ఎకరాలు) గ్రీన్ బెల్ట్‌గా అభివృద్ధి చేసేందుకు బీపీసీఎల్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఈ ప్రాజెక్ట్ రాకతో రాష్ట్ర పారిశ్రామిక రంగానికి మరింత ఊతెక్కనుంది.

## అమరావతి మీదుగా
# ఎర్రుపాలెం- నంబూరు రైల్వేలైన్ ప్రాజెక్టు



**విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి మీదుగా ఎర్రుపాలెం- నంబూరు రైల్వేలైన్ ప్రాజెక్టు నిర్మించనున్నారు. దీనిలో భాగంగా నాలుగో ప్యాకేజీకి రైల్వేశాఖ ఇప్పటికే టెండర్లను ఆహ్వానించింది. ఎర్రుపాలెం నుంచి కృష్ణా నది దాటాక వడ్డమాను వరకు మూడు ప్యాకేజీలకు టెండర్లు పిలవగా, ఇప్పుడు చివరిదైన నాలుగో ప్యాకేజీకి కూడా మోక్షం లభించింది. రాజధాని ప్రాంతంలోని వడ్డమాను నుంచి నంబూరు వరకు 28.35 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణానికి రూ.599.33 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. బిడ్లు సమర్పించేందుకు నవంబరు 23 తుది గడువుగా నిర్ణయించారు. అమరావతి రైల్వేలైన్ నిర్మాణం ఈపీసీ విధానంలో చేయనున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సంస్థ నిర్మాణ పనులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుందని సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఇంజినీర్లు పేర్కొన్నారు. మొత్తం ప్రాజెక్టు 58.10 కిలోమీటర్ల పొడవు ఉండి నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి మూడు ప్యాకేజీలకు ఇప్పటికే టెండర్లు ఆహ్వానించగా, తాజాగా నాలుగో ప్యాకేజీకి కూడా టెండర్ లను ఆహ్వానించారు. ఈ లైన్ పూర్తయితే అమరావతి రాజధాని ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగవడంతోపాటు ఆర్థిక అభివృద్ధికి కూడా ఊతం లభిస్తుంది. వడ్డమాను నుంచి నంబూరు వరకు 28.35 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ రైల్వే ప్రాజెక్ట్ లో మొత్తం తొమ్మిది చోట్ల రైల్వే స్టేషన్లు నిర్మించనున్నారు. పెద్దాపురం, చెన్నా రావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్ప రావు రు ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు కానున్నా యి. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అమరావతి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్న నేపథ్యంలో ఈ రైల్వే ప్రాజెక్టు మరింత ప్రాధాన్యత సంతరించుకుం ది.రాజధానికి మంచి రైలు సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల పెట్టుబడులు, వాణిజ్య కార్యకలా పాలు పెరిగే అవకాశం ఉంది. ఎక్కడైతే రవాణా సదుపాయాలకు ఇబ్బంది లేకుండా ఉంటుందో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది అని భావిం చిన క్రమంలోనే రాజధాని అమరావతి ప్రాంత అభివృద్ధికి రోడ్డు, రైల్వే, ఆకాశ మార్గాలను కూ డా సిద్ధం చేసే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది.

# తూటాల గాయాలకు తేనెతో చికిత్స

## పాక్ ఉగ్రవాదుల ఆయుర్వేద వైద్యం

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్ లోయలో భారత దళాల కాల్పుల్లో గాయపడుతున్న ఉగ్రవాదులు తప్పించుకుని పా రిపోయేందుకు వీల్లేని పరిస్థితుల్లో అడవుల్లో వుంటూనే తమ గాయాలకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా తేనె ద్వారా చికిత్స తీసుకుంటున్నట్లు నిఘా వ ర్గాలకు సమాచారం అందింది. ఆయుర్వేద వైద్యంలోని కొన్ని పద్ధతులను అనుసరించి ఉగ్రవాదులు తేనె ద్వారా చికిత్స తీసుకుంటున్నట్లు ని ఘా వర్గాలకు అందిన సమాచారం ద్వారా పోలీసు ఉన్నతాధికారులు నిర్ధారించారు. కాశ్మీర్‌లోని బడ్‌గామ్ జిల్లాలో ఇటీవల జరిగిన భద్రతా దళాల ఎదురు కాల్పుల్లో పాక్ ఉగ్రవాది, ఆ దేశానికి చెందిన సైనిక స్పెషల్ సర్వీసెస్ గ్రూప్ మాజీ కమాండో మహమ్మద్ ఆసిఫ్ అలిమాస్ హాషీం మూసా హతమయ్యాడు. పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న టెర్రరిస్టుల్లో ఇతను కూడా వుండడంతో పాటు కీలకంగా వ్యవహరించాడు. అయి తే ఎన్‌కౌంటర్‌లో హతమవక ముందు ఆపరేషన్ షేరువాలీలో పేరిట రాజౌరి సెక్టార్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హాషీం మూసాకు తూటా గాయాలయ్యాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు కీలక ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు 45 రోజులకు పైగా ఆపరేషన్ నిర్వహించడం తెలిసిందే.

ఈ ఇద్దరు ఉగ్రవాదుల్లో ఒకడు హాషీం మూసా కాగా మరొకడు యాసిర్‌గా భద్రతా బలగాలు నిర్ధారించాయి. వీరిద్దరు సహచరులుగా తేలింది. రాజౌరి ప్రాంతంలో గల పూంచ్ అడవుల్లో తలదాచుకున్న సమయంలో హాషీం మూసా తన తూటా గాయాలకు తేనె ద్వారా ఆయుర్వేద పద్ధ తుల్లో చికిత్స తీసుకున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందగా ఇది నిజమని భద్రతా బలగాలు నిర్ధారించాయి. తూటా గాయాలకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా వుండేందుకు, గాయాలు పెద్దవిగా కాకుండా వుండేందుకు ఇతను తేనె వాడినట్లు భద్రతా బలగాలు నిర్ధారించాయి. తేనెలోని ఆయు ర్వేద గుణాలు తూటా గాయాలను చాలా వరకు నయం చేస్తుందని ఉగ్రవాదులు విశ్వసించినట్లు భద్రతా బలగాలు నిర్ధారించాయి. గత సెప్టెంబర్ నెలలో యాసిర్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాక అతని వద్ద వున్న ఫోన్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అందులో హాషీం మూసా తూటా గాయాలకు తేనెతో చికిత్స చేసుకుంటున్న దృశ్యాలు వున్నాయి. మూసా ఆరోగ్య పరిస్థితులను తెలిపేందుకు ఈ ఫోటోలను పాక్‌లోని ఉగ్ర హ్యాండ్లర్లకు కాశ్మీర్‌లోని ఉగ్రవాదులు పంపారు. తూటా గాయాలు త్వరగా మానాలంటే స్వచ్ఛమైన తేనె వాడాలని హ్యాండ్లర్లు సూ చించారు. దీని తరువాత హాషీం మూసా కోసం భద్రతా బలగాలు గాలించగా జరిగిన ఎదురు కాల్పుల్లో అతను చనిపోయాడు. మూసా హత మవడంతో అతని కోసం జమ్మూ కాశ్మీర్ పోలీసులు ఐదేళ్లుగా సాగిస్తున్న వేట ముగిసింది. పదికి పైగా ఉగ్రదాడుల్లో పాల్గొన్న మూసా 14 మం ది సైనికులను బలిగొనడంతో పాటు గగన్‌గీర్ సొరంగ నిర్మాణ శిబిరంపై దాడిచేగా స్థానిక వైద్యుడితో పాటు ఏడుగురిని పొట్టన పెట్టుకున్నాడు.దీంతో పాటు సైనిక వాహనంపై దాడిచేసి నలుగురిని చంపాడు.

# సిఇసి తెచ్చిన సర్ చిచ్చు..

## ఆందోళనలతో అట్టుడుకుతున్న దేశ రాజధాని

**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడికిపోతోంది. ఎస్ఐఆర్ లో అక్రమాలకు కారణమైన సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీని ముట్టడిస్తున్నాయి. ఓవైపు ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలు కొనసాగుతుండగా అంతే స్థాయిలో ఢిల్లీలోనూ విపక్షాలు, విద్యార్థి సంఘాలు నిరసనలు తీవ్రతరం చేశాయి. ఇవాళ ముఖ్యంగా ఆదివారం కావడంతో భారీ ఎత్తున తరలివచ్చిన విపక్ష పార్టీలు, విద్యార్థులతో జంతర్ మంతర్, ఇండియా గేట్ వంటి ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఆందోళనకారుల్ని అదుపుచేసేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. సీఈసీ రాజీనామా కోరుతూ గాంధీ జయంతి రోజు ఢిల్లీలో ప్రారంభమైన నిరసనలు ఆదివారంతీవ్ర స్థాయికి చేరాయి. ముఖ్యంగా రెండు రోజులుగా పోలీసుల నిర్బంధాలు, అడ్డంకులతో ఆగ్రహంగా ఉన్న ఆందోళనకారులు ఇవాళ భారీగా తరలివచ్చారు. దీంతో ఢిల్లీలో నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. నిరసనకారులు బారికేడ్లను బద్దలుకొట్టడం, అదుపులోకి తీసుకున్న వారిని తీసుకువెళ్తున్న బస్సులను అడ్డుకోవడం, జంతర్ మంతర్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడం వంటివి చేశారు. ఈ నిరసనల్లో ఆప్ కార్యకర్తలు, దాని విద్యార్థి విభాగం ఏఎస్ఏపీ సభ్యులు, కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యు కార్యకర్తలు,ఎఐఎస్ఎఫ్ ఉద్యమకారులు, ఇతర సంస్థల సభ్యులు పాల్గొన్నారు. దీంతో సెంట్రల్ ఢిల్లీ అంతటా ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ సిబ్బందిని భారీగా మోహరించారు. అయినా నిరసనకారులు ఇవేవీ లెక్కచేయకుండా రోడ్లపై హల్‌చల్ చేశారు. నిరసన సందర్భంగా అదుపులోకి తీసుకున్న వారిని తీసుకువెళ్తున్న బస్సులను ఆప్ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో భద్రతా సిబ్బంది రంగంలోకి దిగి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించేందుకు ప్రయత్నించారు. ఆ తర్వాత నిరసనకారులు బారికేడ్లను బద్దలుకొట్టి జంతర్ మంతర్ వైపు వెళ్లడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. నిరసనకారులను ముందుకు వెళ్లకుండా ఆపేందుకు భద్రతా సిబ్బంది తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది.చివరికి ఢిల్లీపోలీసులు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను రంగంలోకి దిం చారు. ఇండియా గేట్ వద్ద జరిగిన నిరసన ప్రదర్శన సందర్భంగా, ఆప్ ఢిల్లీ యూ నిట్ చీఫ్ సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే సంజీవ్ ఝాతో కార్యకర్తలు అరెస్టయ్యారు.



## మహిళా జర్నలిస్టులపై పోలీసుల లైంగికవేధింపులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం జరిగిన నిరసన కార్యక్రమాన్ని కవర్ చేస్తున్న ముగ్గురు మహిళా జర్నలిస్టులపై పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఢిల్లీ పోలీసులు ఆ ఫిర్యాదులను నిష్పక్షపాత విచారణ కోసం క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల సందర్భంగా ఈ ఘటన జరిగింది. బాధితురాళ్లలో ఒకరైన మహిళా జర్నలిస్ట్, ఓ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) తనతో అనుచితంగా ప్రవర్తించారని, లైంగికంగా వేధించారని ఆరోపించారు. తాను పోలీసుల చర్యలను వీడియో తీస్తుండగా, ఆ అధికారి తనను అసభ్యంగా తాకి పక్కకు నెట్టేశారని ఆమె వాపోయారు. ఘటన అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, వెంటనే కేసు నమోదు చేయడానికి నిరాకరించారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) తీవ్ర దిగ్భ్రాంతి, ఆందోళన వ్యక్తం చేసింది. "ప్రజాస్వామ్యం లో ఇలాంటి ప్రవర్తనను సాధారణ విషయంగా పరిగణించలేం. జర్నలిస్టులు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించేలా చూడాలి. దేశ రాజధాని నడిబొడ్డున ఇలాంటి ఘటనలు జరగడం మీడియా స్వేచ్ఛకు మంచిది కాదు" అని పీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. మహిళా జర్నలిస్ట్ ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, మీడియా ప్రతినిధులు బెదిరింపులు లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేసింది.

# క్రియాశీల రాజకీయాల్లోకి సిబిఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వర్ రావు



**వారణాసి, అక్టోబరు 4:** సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నెం నాగేశ్వరరావు క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రాతినిథ్యం వహిస్తోన్న వారణాసి వేదికగా ఆయన సర్వజన సనాతన పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఐపీఎస్ అధికారిగా దాదాపు నాలుగు దశాబ్దాల పాటు పనిచేసిన ఆయన ఇప్పుడు ప్రజల సమస్యల పరిష్కారం కోసం రంగంలోకి దిగారు. దీనికి వారణాశిని కేంద్రంగా ఎంచుకున్నారు. పరిపాలనా పరమైన సంస్కరణల ద్వారానే దేశ సమగ్ర పునర్నిర్మాణం సాధ్యం కాదని నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. దేశాన్ని ఆధునిక ప్రగతి పథంలో నడిపిస్తూనే ప్రాచీన నాగరికత మూలాలతో దాన్ని అనుసంధానించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సనాతన ధర్మం అనేది ఓ పూజా విధానమో, మతాచారమో కాదని అన్నారు.సత్యం, ధర్మం, కరుణ, సమ న్యాయం, ప్రజా సంక్షేమంతో కూడిన ఒక ఉన్నతమైన జీవన విధానమని స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సర్వజన సనాతన పార్టీ ప్రధానంగా నాలుగు విలువలపై దృష్టి సారిస్తుందని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, సాంస్కృతిక పునరుద్ధరణ అనే అంశాలను పార్టీ నాలుగు ముఖ్య స్తంభాలుగా ఉంటాయని పేర్కొన్నారు. విద్యా విధానంలో భారతీయ ప్రాచీన విజ్ఞానాన్ని, చరిత్రను ఆధునిక ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందనిసిబిఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు ప్రతిపాదించారు. నవ సమాజ నిర్మాణానికి ఈ సమతుల్యమైన విద్యా విధానమే శ్రీరామరక్షగా అభివర్ణించారు. ఆధునిక వైద్య విధానాలతో పాటు భారతీయ సంప్రదాయ వైద్య చికిత్సలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తామని నాగేశ్వరరావు తెలిపారు. యువత, రైతులు, చేతివృత్తుల వారు, దేశీయ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహాలు, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం తమ మూడో ప్రాధాన్యతగా వివరించారు. సాంస్కృతిక పునరుద్ధరణ కింద దేశీయ భాషలు, కళలు, పండుగలు, కుటుంబ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన చెప్పారు. దేవాలయాలను పూజా స్థలాలుగానే కాకుండా సామాజిక పురోగతికి తోడ్పడే సజీవ సంస్థలుగా తీర్చిదిద్దడానికి తమ వంతు ప్రయత్నాలు సాగిస్తామని నాగేశ్వరరావు తెలిపారు. దేవాలయాల నిర్వహణలో పారదర్శకత, భక్తుల భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకుంటామని, టెక్నాలజీ పురోగతిని సాధిస్తూనే సాంస్కృతిక మూలాలను గౌరవించడం ద్వారానే ఆధునిక భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని పునరుద్ఘాటించారు. సర్వజన సనాతన పార్టీ ప్రారంభ కార్యక్రమానికి పలువురు పార్టీ ప్రముఖులు హాజరయ్యారు. ఎస్ఎస్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు మహంత్ తీర్థానంద్, రీతూ రాథోడ్, ప్రధాన కార్యదర్శి రాజా సక్షం సింగ్ యోగి, అధికార ప్రతినిధి బబితా శర్మ, ఉత్తరప్రదేశ్ ఇన్‌చార్జ్ రాకేశ్ తివారీ, సంస్థాగత వ్యవహారాల మంత్రి నరనారాయణ్ సింగ్ ఉన్నారు.

# 90వ యేట జాతీయ బాడీబిల్డింగ్ టైటిల్

## జపాన్‌లో ఓ తాత అరుదైన రికార్డు



**టోక్యో, అక్టోబరు 4:** వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపించే వారు కొందరే ఉంటారు. అలాంటి వారిలో ముందు వరుసలో నిలుస్తారు జపాన్‌కు చెందిన తోషిసుకె కనజావా. 90 ఏళ్ల వయసులో కూడా ఆయన సాధించిన ఘనత చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. తన 90వ పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న మరుసటి రోజే, ఆయన మరో జాతీయ బాడీబిల్డింగ్ టైటిల్‌ను గెలుచుకుని ప్రపంచాన్ని అబ్బురపరిచారు. ఆల్ జపాన్ మాస్టర్స్ ఫిట్‌నెస్ ఛాంపియన్‌షిప్ లో 85 ఏళ్లు పైబడిన విభాగంలో విజేతగా నిలిచి, తన కెరీర్‌లో 19వ జాతీయ టైటిల్‌ను సగర్వంగా అందుకున్నారు. హిరోషిమాకు చెందిన కనజావా ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకం. 1936లో జన్మించిన ఆయన, యుక్తవయసులో ఈతగాడిగా ఒలింపిక్స్‌లో పాల్గొనాలని కలలు కన్నారు. అయితే కండరాల సమస్య కారణంగా ఆ కలను వదులుకుని, తన దృష్టిని బాడీబిల్డింగ్ వైపు మళ్లించారు. తన 24, 27వ ఏట ఖిమిస్టర్ జపాన్ఖి టైటిళ్లను గెలుచుకుని సత్తా చాటారు. 34 ఏళ్ల వయసులో పోటీలకు వీడ్కోలు పలికారు. కానీ విధి ఆయనను మళ్లీ పోటీల వైపు నడిపించింది. ఆరోగ్యం బాగోలేని తన భార్యలో స్ఫూర్తి నింపడానికి, 50 ఏళ్ల వయసులో మళ్లీ కండల ప్రదర్శనకు సిద్ధమయ్యారు. ఆ పునరాగమనం ఆయన జీవితంలో చారిత్రాత్మకంగా నిలిచింది. అప్పటి నుంచి వెనుదిరిగి చూడని ఆయన, 80 ఏళ్లు దాటిన తర్వాత ఆరు వరల్డ్ మాస్టర్స్ టైటిళ్లను గెలుచుకోవడం విశేషం. కనజావా విజయ రహస్యం ఆయన జీవనశైలిలోనే దాగి ఉంది. ఆయన పూర్తి శాకాహారి. గత 50 ఏళ్లుగా మాంసం, చేపలకు దూరంగా ఉంటున్నారు. బ్రౌన్ రైస్, పులియబెట్టిన సోయాబీన్స్‌తో చేసే నాటో, మిసో సూప్ వంటి సంప్రదాయ జపనీస్ ఆహారంతో పాటు ప్రొటీన్ సప్లిమెంట్లు తీసుకుంటారు. వయసు మీద పడుతున్నా, క్రమశిక్షణ మాత్రం వీడలేదు. వారంలో ఆరు రోజులు, రోజుకు రెండు గంటల పాటు జిమ్‌లో కఠోరంగా శ్రమిస్తారు. వయసును దృష్టిలో ఉంచుకుని భారీ బరువులకు బదులుగా మెషీన్లపై ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. ప్రముఖ హాలీవుడ్ నటుడు, బాడీబిల్డర్ ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగ్గర్‌ను కలవాలనేది తన చిరకాల కోరిక అని కనజావా చెబుతారు. "చనిపోయే వరకు బాడీబిల్డర్‌గా ఉంటాను" అని ఆయన చెప్పే మాటలు ఆయన పట్టుదలకు, క్రీడ పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనం. ప్రస్తుతం హిరోషిమాలో సొంతంగా జిమ్ నడుపుతున్న ఈ ఉక్కు మనిషి, వృద్ధాప్యంలో శారీరకంగా, మానసికంగా ఎలా దృఢంగా ఉండవచ్చో ప్రపంచానికి చాటిచెబుతూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

## ఆధార్‌లో పేరు అప్‌డేట్‌కు కొత్త ఎస్‌వోపిలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 4:**ఆధార్‌లో పేరు అప్డేట్‌కు సంబంధించి యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా కొత్త స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను జారీ చేసింది. పేరు సవరణ లేదా మార్పు చేసే వివిధ సందర్భాలను ఈ ఎస్‌వోపిలో ప్రత్యేకంగా పేర్కొని, వాటికి అవసరమైన ప్రక్రియ, పత్రాలను స్పష్టం చేసినట్లు అందించిన సమాచారం చెబుతోంది. డేటా ఎ ఆధార్‌లో పేరు డేటా ఎంట్రీ పొర పాటు వల్ల తప్పుగా నమోదై, గతంలో సమర్పించిన గుర్తింపు లేదా సంబంధిత పత్రంలో సరైన పేరు ఉన్నట్లయితే ప్రత్యేక ప్రక్రియను అనుసరించాలి. పెద్ద లకు అన్నెక్చూర్ బి అఫిడవిట్, మైనర్లకు అన్నెగ్జూర్ అఫి డవిట్. సంబంధిత గుర్తింపు లేదా రిలేషన్‌షిప్ డాక్యుమెంట్‌తో పాటు సమర్పించాల్సి ఉంటుంది. పేరు లేదా గుర్తింపులో పెద్ద మార్పు చేయాలనుకుంటే సాధారణ పేరు సవరణతో పని పూర్తికాకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో నిర్ణయించిన విధానం ప్రకారం గెజిట్ నోటిఫికేషన్ అవసరం కావచ్చు.

## గత ఎన్నికల్లో బరేలినుంచి పోటీకే భయపడిన రాహుల్

**ఎస్పీనేత శివపాల్‌సింగ్ పటేల్ సంచలన ఆరోపణ**

**లక్నో, అక్టోబరు 4:**గత లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)తో పొత్తు పెట్టుకోకపోతే కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలిచేది కాదని ఎస్పీ ఎంపీ శివపాల్ సింగ్ పటేల్ అన్నారు. రాహుల్ గాంధీరాయ్‌బరేలీలో పోటీ చేయడానికి భయపడా ్డరని, ఒకానొక దశలో పోటీ నుంచి తప్పుకోవడానికి సిద్ధమ య్యారని, అఖిలేష్ యాదవ్ హామీ తర్వాతే అక్కడ నుంచి పోటీ చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక వేళ రాహుల్ గాంధీ పోటీచేయకపోతే అక్కడి నుంచి ఎస్పీ అభ్యర్థి పోటీలో నిలబడే వారని అన్నారు. 2024 ఎన్నికల్లో ఎస్పీ, కాంగ్రెస్‌కు అండగా నిలిచిందని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థులు నిలబడిన చోట ఎస్పీఓటర్లు వారికి ఓటేశారని అన్నారు. దీని వల్లే కాం గ్రెస్‌కు యూపీలో 6లోక్‌సభ సీట్లు గెలిచిందని అన్నారు.

## ఎన్నిసీట్లు అనేది కాదు, గెలుపే లక్ష్యం కావాలి: అఖిలేష్ యాదవ్

**లక్నో, అక్టోబరు 4:** ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు మరికొన్ని నెలలే సమయం ఉంది. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంచాయతీ ఉద్రిక్తంగా మారింది. యూపీలో మొత్తం 403 అసెంబ్లీ స్థానాలు ఉంటే, తమకు కనీసం 150 సీట్లు కావాలని కాంగ్రెస్ కోరుతోంది. మరోవైపు అన్ని సీట్లు ఇచ్చేందుకు ఎస్పీ సుముఖంగా లేదు. కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే అని ఎస్పీ నేతలు ఫైర్ అవుతున్నారు. ఇదిలా ఉంటే, ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ కాంగ్రెస్‌కు క్లియర్ మెసేజ్ ఇచ్చారు. కూటమిలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు దక్కాయి. ఏ సీటు ఎవరికి కేటాయించారన్న దాని కన్నా కూటమి గెలుపే ప్రధాన లక్ష్యం కావాలని ఆయన అన్నారు. లక్ష్యం స్పష్టంగా ఉన్నప్పుడు మనం చేయి చేయి కలిపిముందుకు సాగుతాం. గమ్యంపై దృష్టి ఉంటే ప్రయాణం సులభం అవుతుందని ఆయన అన్నారు.

# ఒంటరి అవుతున్న అమెరికా

## కేంద్ర విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్

**మ్యూనిచ్, అక్టోబరు 4:** అమెరికా తనంతట తానే ఒంటరి శక్తిగా మారిందని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వాషింగ్టన్ తీసుకున్న సమూలమైన విధానపరమైన మార్పులు చైనా ఎదుగుదల, ప్రపంచ పరిస్థితులను మారుస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. 62వ మ్యూనిచ్ భద్రతా సదస్సులో ఆయన కీలక ప్రసంగం చేశారు. అమెరికాచైనాల మధ్య తీవ్ర పోటీ, అభివృద్ధి చెందుతున్న, మధ్యస్థ స్థాయి దేశాలలో పెరుగుతున్న స్వయం సమృద్ధి, అలాగే భాగస్వామ్యాలను విస్తరించుకోవడం, ప్రమాదాలను తగ్గించుకోవాలనే ప్రయత్నాలు అంతర్జాతీయ వ్యవస్థను నిర్దేశిస్తున్నాయని జైశంకర్ స్పష్టం చేశారు.నేటి ప్రపంచ పరిస్థితులలో అమెరికా తీసుకున్న సమూలమైన విధానపరమైన మార్పులే ప్రధాన లక్షణంగా ఉన్నాయన్న వాస్తవంతో ఎవరూ విభేదించరని, ఈ విధాన మార్పును స్వచ్ఛందంగా ఎంచుకున్న వైఖరిగా జై శంకర్ అభివర్ణించారు. దీంతో అమెరికా ఉద్దేశపూర్వకంగానే ఒంటరి శక్తిగా మారిందని జైశంకర్ తెలిపారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలలో రెండవ ప్రధాన లక్షణం చైనా ఎదుగుదల అని గుర్తుచేశారు. ప్రపంచ తయారీ రంగంలో మూడింట ఒక వంతు వాటా చైనాదేనని, దాని ఆర్థిక సామర్థ్యాలు రాజకీయ పలుకుబడిగా మారుతున్నాయని తెలిపారు.అమెరికా, చైనాల మధ్య ప్రపంచం తీవ్రమైన పోటీని చూస్తోందని, ఈ వైరం ఆ రెండు దేశాలకే పరిమితం కాకుండా విస్తరించిందని జైశంకర్ వెల్లడించారు. అదే సమయంలో, ఈ పోటీ పరస్పర ఆధారపడటంలోని సంక్లిష్టతతో పాటుగా కొనసాగుతోందని జైశంకర్ తెలిపారు.

ఈ పరిస్థితుల్లో మధ్యతరగతి శక్తులు మరింత స్వావలంబనను కోరుకుంటున్నాయన్నారు. వర్ధమాన, మధ్యతరగతి శక్తులు తమ సొంత ప్రయోజనాల పట్ల మరింతగా అవగాహన పెంచుకుంటున్నాయని, అధిక స్వావలంబనను కోరుకుంటున్నాయని భారత్ ను ఉద్దేశించి జైశంకర్ వ్యాఖ్యానించారు. వాటిలో ప్రతి ఒక్కటీ ఒక విధంగా మరింత స్వయం సమృద్ధిని సాధిస్తున్నాయని, ఖిఆత్మనిర్భర్ఖి అనే పదం భారతదేశంలో కూడా ప్రస్తుతం బాగా ప్రాచుర్యంలో ఉందని జై శంకర్ తెలిపారు.

# 'తులసి' మిల మిల !



మచ్చలేని సౌందర్యాన్ని సొంతం మార్కెట్లో లభించే వివిధ సౌందర్య ఉత్పత్తులు కాదు.. సహజసిద్ధమైన పదార్థాలు కూడా ఉపయోగ పడతాయి. మన ఇంట్లో ఉంటే తులసి ఆకులు కూడా ఇదే కోవకు చెందుతాయి. మొటిమలకు.. తాజా తులసి ఆకులను తినడం వల్ల మొటిమలు క్రమంగా తగ్గ ముఖం పడతాయి. తాజా ఆకులను మెత్తగా చేసుకొని మొటిమలపై రాసినా ఫలితం ఉంటుంది. తులసి ఆకులను నీటిలో ఉడికించి చల్లార్చి ఆ ద్రావణాన్ని టోనర్ కూడా వాడుకోవచ్చు. దీనివల్ల మొటిమలు తగ్గడమే కాదు.. ముఖం కాంతివంతంగా మారుతుంది. తులసి పొడిని రోజ్‌వాటర్‌తో కలిపి ముఖానికి పట్టిస్తే చర్మం రంధ్రాలు తెరుచుకొని మొటిమలు, ఇతర చర్మ సంబంధిత సమస్యలుక్రమంగా తగ్గుముఖం పడతాయి. తులసి రసానికి పుదీనా ఆకుల రసం కలిపి ముకానికి పట్టిస్తే మొటిమల నుంచి ఉపశమనం కలుగుతుంది.

**నల్లమచ్చలుంటే..!** ముఖంపై నల్ల మచ్చలను నివారించడంలో తులసి బాగా పని చేస్తుంది. తులసి ఆకుల రసానికి అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో కడగాలి. ఇలా క్రమం తప్పకుండా రోజుకో సారి చేయడం వల్ల ముఖంపై ఉన్న నల్ల మచ్చలు తగ్గడంతో పాటు చర్మం కాంతి వంతంగా మారుతుంది. □

# కలశారాధనతో..

**హైందవ ధర్మంలో** కలశాన్ని దైవస్వరూపంగా ఆరాధించటం ఆనవాయితీ. దీని వెనుక పౌరాణిక నేపథ్యం ఉంది. శ్రీమహావిష్ణువు నాభి నుంచి పద్మం పుట్టింది. అందులో సృష్టి కారకుడైన చతుర్ముఖ బ్రహ్మ ఉద్భవించాడు. ఆయన ఈ జనావళిని సృష్టించాడు. 'కలశం'లోని నీరు సృష్టి ఆవిర్భవించటానికి కారణభూతమైన జలానికి ప్రతీక. అది అందరికీ జీవశక్తి ప్రదాత. కలశం మీద ఉంచిన మామిడాకులు, నారికేళం ఈ సృష్టికి ప్రతీకలు. కలశం చుట్టూ కట్టిన దారం ఈ సృష్టితో కలిపి ఉంచే ప్రేమకు సూచన. అందుకే కలశాన్ని శుభప్రదంగా భావించి, ఏ దైవ కార్యక్రమంలోనైనా స్థాపన చేసి ఆరాధిస్తారు. ఆ కలశంలోకి సమస్త నదుల జలాల్ని ఆహ్వానిస్తారు. సర్వ వేద



విజ్ఞానాన్నీ, సకల దేవతల ఆశీస్సుల్ని అందులోకి ఆవాహన చేస్తారు. అలా చేసిన తర్వాత కలశంలోని జలాన్ని అభిషేకంతో సహా అన్ని రకాల క్రతువులకూ వాడతారు. దేవతలు, రాక్షసులు క్షీ రసాగరాన్ని మధించినప్పుడు.. అందులోంచి ధన్వంతరి స్వామి అమృత కలశంతో ప్రత్యక్షమ య్యాడు. ఆ కలశంలోని అమృతం జరామరణ భయం లేకుండా చేస్తుంది. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు తమ భార్యలైన సరస్వతి, లక్ష్మి ్మ, పార్వతీదేవిలతో కలశంలో నివసిస్తారని పురాణాలు చెబుతు న్నాయి. అలాగే లక్ష్మీ ్మదేవి పద్మంలో కొలువై ఉండగా.. ఆమెకు చెరో వైపున రెండు ఏనుగులు తమ తొండాలతో కలశ జలాన్ని అభిషేకిస్తున్న దృశ్యం చిత్రాల్లో కనిపిస్తుంది. □

# పని తగ్గాలంటే ..

తెల్ల వారింది మొదలు, నిద్రపోయే వరకూ ఎన్ని పనుల్లో కొన్ని చిట్కాలతో జీవితాన్ని సులభతరం చేసుకోవచ్చిలా! నిమ్మ, బత్తాయి నుంచి ఎక్కువ రసం తీయాలనుకుంటున్నారా... అయితే వాటిని ముందు వేడినీళ్లలో వేసి తీయండి. చల్లారాక పిండితే మెత్తగా ఉండటమే కాదు, ఎక్కువ రసం కూడా వస్తుంది. 5-10 నిమిషాలు తీరిక ఉంది... చేయడానికి పెద్ద పని లేదని అనుకుంటు న్నారా? అయితే దాన్ని చెక్‌ఇట్ టైం పెట్టుకోండి. సాధారణంగా ఉపయో గించే



పరికరాలను పరీక్షి ంచండి. దానివల్ల జరిగే పెద్ద ఇబ్బందిని ముందే గుర్తించినట్లవుతుంది. ప్లాస్టిక్ టబ్బు లీక్ అయినా, అంచులు విరిగినా చెత్తలో పడేస్తున్నారా? వాటిని ఎన్ని రకాలుగా పునర్వినియోగించవచ్చో తెలుసా? మట్టి నింపి గార్డెన్‌గా మార్చొచ్చు. శాండ్‌బాక్స్ మార్చి... చిన్నారులను ఫోన్‌కు దూరంగా ఉంచొచ్చు. పిల్లలు బొమ్మలతో ఆడుకున్నాక వాటిని ఈ టబ్లో పెట్టమంటే సర్దే పని తగ్గుతుంది. బట్టలు ఉతకడం, ఆరబెట్టడం, మడత బెట్టడం... వీటి నుంచి విముక్తి లేదా అనిపిస్తుంది. కొన్నిసార్లు! మొదటి దాని సంగతేమోగానీ, మడత పని కొంతవరకూ తగ్గించుకోవచ్చు. ఎలాగంటే... కొన్ని చీరలూ, డ్రెస్సుల్ని హ్యాంగ్‌కు తగిలించండి. పైజామాలూ, పిల్లల బట్టల్ని బాస్కెట్లలో వేయండి. నిర్విరామంగా పనిచేసినప్పుడు ఒత్తిడిగా ఉన్నా... వెంటనే ఇంటి నుంచి బయటకు, బాల్కనీలోకి లేదంటే కిటికీ తెరిచి.. దీర్ఘమైన శ్వాస తీసుకోండి. మెదడుకు అధిక మోతాదులో ఆక్సిజన్ అందితే, ఒత్తిడి నుంచి ఉపశమన అని పరిశోధనలు చెబుతున్నాయి. □

# ఇలా ఎదుగుదాం !



కెరియర్లో ఎదగాలని అనుకోని అమ్మాయుం డదు. కానీ దానికోసం సాధారణంగా ఏం చేస్తాం? కష్టపడతాం, అందరికంటే ఎక్కువ పనిచేస్తాం. గంటలు కేటా యిస్తాం. చివరికి ఏమవుతుంది? ఒకానొక దశకి వచ్చేసరికి అలసట ఆవహి స్తుంది. అందుకే స్మార్ట్‌గా ఆలోచించాలి, పనిచేయాలి. ముఖ్యంగా 5 అలవాట్లు చేసు కోవాలి అంటున్నారు నిపుణులు. అవేంటంటే..

**ముందే నేర్చుకోవాలి:** కెరియర్‌లో ఒక్కో టడుగూ ముందుకు వేసేటప్పుడు కొన్ని నైపుణ్యాలు కావాల్సి వస్తుంది. చాలామందికి ఆ దశకి చేరుకున్నాక నేర్చుకోవచ్చులే అని అనిపిస్తుంది. కానీ... కోర్సు, టెక్నాలజీ, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్... ఇలా ఏదైనా ప్రమోషన్, అవసరంతో సంబంధం లేకుండా నేర్చుకోండి. అప్పుడే అవకాశం వచ్చేనాటికి సిద్ధంగా ఉంటారు. నలుగురిలో ప్రత్యేకంగా కనిపిస్తారు.

**టాలెంటే సరిపోదు:** చాలాసార్లు ప్రతిభ మాత్రమే సరిపోదు. సహోద్యోగులు, మెంటార్లు నిపుణులు.. ఇలా చాలామంది తోడ్పాటే కావాలి. అందుకే వాళ్లందరితో సత్సంబంధాలను పెంచుకోండి. బలమైన ప్రొఫెషనల్ నెట్వర్క్ ఉంటే కొత్త ఆలోచనలు వస్తాయి. మార్గనిర్దేశం దొరుకుతుంది. మంచి అవకాశాల వివరాలు తెలుస్తాయి.

**విమర్శ కావాలి:** విమర్శ కోపాన్నీ, బాధనీ కలిగిస్తుంది వాస్తవమే! చెడుగా చూసినప్పుడే ఇలా. సానుకూలంగా చూడండి. సద్విమర్శలా తీసుకోండి. మీ లోపాలను తేలిగ్గా గుర్తించొచ్చు. వేగంగా వాటిని మార్చుకునే అవకాశమూ దొరుకుతుంది. విమర్శలను స్వీకరించిన వారే త్వరగా ఎదుగుతారు కూడా. కాబట్టి, వాటినీ పట్టించుకోండి.

**నిరంతరం కావాలి:** రోజూ పర్ఫెక్ట్‌గా ఉండాల్సిన పని లేదు. కానీ కొన్ని అలవాట్లు మాత్రం నిరంతరం సాగేలా చూసుకోవాలి. ఈ సమయంలో పని పూర్తిచేయడం, ప్రతివారం ఏదో ఒకటి నేర్చుకోవడం, సానుకూలంగా ఆలోచించడం అలవాటు చేసుకోండి. ఇవి దీర్ఘకాల విజయానికి నాంది వేరు పలుకుతాయి.

**సరిచూసుకోండి:** నువ్వు బాగా చేశావ్, 'నీకిది రాదు'... చాలామంది ఇలాంటివి మనకి చెబుతూనే ఉంటారు. మిమ్మల్ని మీరు అడిగారా? అడగండి. నేనెక్కడున్నా? నేనేం మార్చుకోవాలి? ఎక్కడ వెనకబడ్డ అని స్వీయ సమీక్ష చేసుకోండి. పరిశ్రమ ఏదైనా మార్పు అనివార్యం. వాటికి తగ్గట్టుగా మీరున్నారా లేదా అని ఎవరో చెప్పేదాకా ఆగొద్దు. మీరు మీరే పరిశీలించుకోవాలి. అవసరమైతే మారాలి. వీటన్నింటికే డ్రైవ్ రూల్ అని పేరు. గంటలకొద్దీ పనిచేస్తూ పోవడం కాదు. పరిస్థితులను గమనించుకుంటూ వాటికి అనుగుణంగా ఎవరికి వారు తమని తాము మార్చుకుంటూ వెళ్లాలని సూచించండి. అనుసరించే నైపుణ్యాలను పెంచుకోవచ్చు, అవకాశాలు అందుకోవచ్చు. ముఖ్యంగా ఆత్మవిశ్వాసంతో కెరియర్‌లో దూసుకెళ్లొచ్చు. □

# దానిమ్మ జ్యూస్ !



ఎర్రటి దానిమ్మ గింజలు చూడ్డానికి భలే ఆకర్షణీ యంగా ఉంటాయి కదా. తినడానికి రుచి గానూ ఉంటాయి. కానీ బలుచుకుని తినాలంటేనే ఎక్కడలేని నీరసం ముంచు కొస్తుంది. పోనీ మిక్సీలో వేసి జ్యూస్ తీసుకోవాలంటే జార్ సిద్ధం చేసుకోవాలి. సమయానికి కరెంటు లేకపోతే మరో ఇబ్బంది కానీ ఇలాంటి జ్యూసర్ ఒకటి ఉంటే ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. గింజలను దీంట్లో వేసి చేత్తో ఒత్తుతూ పైభాగాన్ని తిప్పితే చాలు జ్యూస్ కింది పాత్రలోకి దిగుతుంది. తర్వాత దీన్ని సులువుగా శుభ్రం చేసుకోవచ్చు కూడా. □

# మునగతో పోషకాల చపాతి



ఆరోగ్యానికి మంచిదని మునక్కాడలు లేదా మునగాకుతో చారు చేస్తే.. పిల్లలు ససేమిరా తినరు. ఆ ఆకును పిండిలో కలిపి..చపాతి చేశారనుకోండి. వంక పెట్టకుండా తినేస్తారు. మునగ చపాతి ఎలా చేయాలంటే.. మునక్కాడలను ముక్కలు కోసం, ఉడికించి, పప్పుగుత్తితో మెత్తగా మెదపాలి. గుజ్జును ఉంచి, పిప్పిని తీసేయాలి. ఇందులో కప్పు గోధుమపిండి, అరకప్పు వేయించిన మునగాకు, రెండు చెంచాల కొత్తిమీర, చెంచా నూనె వేసి బాగా కలపాలి. దానికి కారం, ఉప్పు, పసుపు, జీలకర్ర పొడి, ధనియాల పొడి, వేయించిన నువ్వులు జతచేయాలి. గుజ్జులో ఉన్న తడి సరిపోలేదంటే.. కొన్ని నీళ్లు చిలకరిస్తూ కలిపి పక్కన ఉంచాలి. అరగంట నాననిచ్చి చపాతీలు ఒత్తుకుని పెనం మీద నూనె లేదా నెయ్యితో కాల్చు కోవాలి. అంతే.. నోరూరించే మునగ చపాతీలు రెడీ. మునగలో ఐరన్, పొటాషియం, జింక్.. ఇలా శరీరానికి అవసరమైన పోషకాలు అనేకం ఉన్నాయి. ఇది రక్తహీనతను తగ్గిస్తుంది. ఊబకాయం రానివ్వదు. రుచి మాత్రమే కాదు..కాకుండా ఇంత మేలు చేస్తుంది కనుక. మీరూ ప్రయత్నించండి. □

తెర

# భోగి

## హై ఇంటెన్స్ టీజర్



**చా**ర్మింగ్ స్టార్ శర్వా డిఫరెంట్ ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సంపత్ నంది దర్శ కత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ భారీ స్థాయిలో నిర్మి స్తున్నారు. లక్ష్మీ ్మ రాధామోహన్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. మిగిలిన షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి. గ్రామీణ జానపద శైలిలో సాగే వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. బొగ్గుల గుట్ట అనే గ్రామాన్ని పరిచయం చేస్తూ.. పాలేగాళ్ళు కమ్మరి గంగను తీసుకెళ్లారని అనుపమ పరమేశ్వరన్ పాత్ర చెబుతుంది. హీరో, అతని ప్రేమకథకు సంబంధించిన పాత్రలను పరిచయం చేయడమే కాకుండా.. ఒక రా, ఇంటెన్స్, రూటెడ్, ర్యాజింగ్ ప్రపంచానికి టీజర్ ప్రజెంట్ చేసింది. 1960ల ప్రారంభంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. సంపత్ నంది ఈ కథను ఎంతో సహజంగా, నేటివిటీతో తెరకెక్కించినట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది.

# కామ్రేడ్ కళ్యాణ్

## టైటిల్ సాంగ్



**కిం**గ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా కామ్రేడ్ కళ్యాణ్‌తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా మాస్ మహారాజా రవితేజ ఖికామ్రేడ్ కళ్యాణ్ఖి టైటిల్ సాంగ్ లాంచ్ చేశారు. విజయ్ బుల్గానిన్ ఫన్ ఫుల్ గా ఈ పాటను కంపోజ్ చే శారు. రాహుల్ సిప్లిగంజ్ వాయిస్‌తో పవర్‌ఫుల్ ఎనర్జీని అందిం చగా, భాస్కరభట్ల రాసిన లిరిక్స్ కామ్రేడ్ గా హీరో క్యారెక్టర్ ను ఎంటర్టైనింగ్ గా ప్రజెంట్ చేశాయి. విడుదలైన వెంటనే ఈ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్ర ల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అంది స్తుండగా, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కామ్రేడ్ కళ్యాణ్ అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# అక్టోబర్ 30న కల్ట్



**వి**శ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో, హీరోగా భారతీయ చలన చిత్రాల్లో నే మొట్ట మొదటి స్లాశర్‌గా రూపొందుతున్న కల్ట్ సినిమా భారీ బడ్జెట్‌తో రూపొందుతోంది. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ రవి బసూర్ గారు అందించిన పాటలతో పాటు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మరో సంచలనం కాబోతుంది. ఈ సినిమా షూటింగు పూర్తి చేసుకుంది. ఇప్పుడున్న యూత్‌లో ప్రత్యేకమైన కల్ట్ ఫాలోయింగ్ ఉన్న సన్సెషన్ తరుణ్ భాస్కర్ అందించిన మాటలు మరో హైలైట్. తారక్ సినిమా బ్యానర్ పై సందీప్ కాకరాల ఖర్చుకు వెనకాడకుండా అత్యంత భారీగా టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ కల్ట్ సినిమాలో సినీ దిగ్గజలందరూ పాలు పంచుకుంటున్నారు, సచిన్ అందిస్తున్న సౌండ్ డిజైన్ ఒక ప్రత్యేక స్థాయిలో నిలబెట్టింది, భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషలలో రూపొందుతున్న కల్ట్ సినిమాలో విశ్వక్ సేన్, గాయత్రి భరద్వాజ్, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, పుష్ప ఫేమ్ తారక్ పొన్నప్ప, ప్రజు, లాంటి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబర్ 30 కి విడుదలకు సిద్ధం అవుతున్న ఈ కల్ట్ సినిమా ప్రేక్షకులకు నెవర్ బిఫోర్ ఎక్స్పీరియన్స్ అందించబోతోంది.



# ధరణి ఐ లవ్ యు మూవీ పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రొడ్యూసర్ ఎస్‌కెఎన్

**ధ**రణి ఐ లవ్ యు మూవీ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాత, ప్రొడ్యూసర్ ఎస్‌కెఎన్.... ఘనంగా ఆవిష్కరించారు. చిత్ర బృందం సమక్షంలో జరిగిన ఈ పోస్టర్ లాంచ్ కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌కెఎన్ మాట్లాడుతూ..ధరణి ఐ లవ్ యు సినిమా పోస్టర్ ఆసక్తికరంగా ఉందని, టైటిల్‌తోనే సినిమాపై క్యూరియాసిటీ కలుగుతోందని అన్నారు. డైరెక్టర్ సాయికృష్ణ కె.వి కి ఇది సెకండ్ మూవీ.. తను రాజమౌళి గారి దగ్గర మగధీర మూవీకి అసోసియేట్ గా వర్క్ చేసారు.. నిర్మాత రాజ శేఖర్ గారికి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షి ంచారు. డైరెక్టర్ సాయికృష్ణ కె.వి మాట్లాడుతూ ప్రొడ్యూసర్ ఎస్‌కెఎన్ గారి చేతులు మీద మా ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ అవ్వటం చాలా సంతోషంగా ఉంది.. ఆయన ఇండస్ట్రీ లో టైమింగ్ ఉన్న ప్రొడ్యూసర్.. బేబీ, చెన్నై లవ్ స్టోరీ.. ఇలా వరుస విజయలతో బిజీ ఉండి ధరణి ఐ లవ్ యు పోస్టర్ లాంచ్ చేసినందుకు చాలా థాంక్స్.. ఆయన స్టేజ్ మీద ఒక రైమింగ్ తో టైమింగ్ లో ఇచ్చే స్పీచ్ కి చాలా మంది ఫ్యాన్స్ ఉంటారు.. అందులో నేను ఒకడిని అన్నారు..



# లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్

## ఫన్ ఫుల్ ట్రైలర్ రిలీజ్

**హ**ర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'. బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చవాన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి వి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు. అక్టోబర్ 9 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక నిగిజు ఙ్ఞూలో 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' స్ట్రీమింగ్ కానుంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ రిలీజ్ చేశారు. తన కొడుకుని ప్రేమించని హర్ష తండ్రి అమ్మాయిలని రిక్వెస్ట్ చేసే సన్నివేశంతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. హర్ష ఫన్ టైమింగ్ అలరించింది. హైపర్ క్యారెక్టర్ మరో హైలైట్‌గా నిలిచింది. జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, శ్రావ్య చౌదరి ఇతర కీలక పాత్రల్లో ఆకట్టుకున్నారు. అజయ్ అరసాడ సంగీతం ఎంటర్టైమెంట్ ని మరింత ఎలివేట్ చేసింది. చిత్రానికి శక్తి అరవింద్ సినిమాటోగ్రఫీ అందించారు. జానీ షేక్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, లిఖిత్ లీ ఎడిటర్‌గా, సాయి ప్రావలిక కాస్ట్యూమ్ డిజైనర్‌గా, పీవీజీ విశ్వనాథ్ లైన్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు.



# ఎన్టీఆర్‌కు మద్దతుగా విజయ్ దేవరకొండ

**మా**నవీయ విలువల్లో మనం పూర్తిగా దిగజారిపోతున్నామంటూ పోస్ట్ ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమాలోని చుట్టమల్లే పాటను ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ తో మహిళల్ని కించపరిచేలా రూపొందించిన ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈ ఘటనపై హీరో ఎన్టీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన ఆగ్రహాన్ని వెల్లడిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఎన్టీఆర్ కు మద్దతుగా నిలబడేందుకు ముందుకొచ్చారు విజయ్ దేవరకొండ. మానవీయ విలువల్లో మనం పూర్తిగా దిగజారిపోయామంటూ ఆయన ట్వీట్ చేశారు. హీరో విజయ్ దేవరకొండ స్పందిస్తూ విలువల పరంగా మనం నీచమైన స్థాయికి దిగజారిపోతున్నాం. ఈ ఘటనకు బాధ్యతలైన వారిని వదిలిపెట్టకూడదు. చట్టపరంగా వారిని కఠినంగా శిక్షి ంచాలి. మరొకరు ఇలాంటి తప్పు చేయకుండా గుణపాఠం నేర్పాలి. పిల్లల్ని ఎలా పెంచుతున్నాం, మనం ఎలాంటి సమాజంలో జీవిస్తున్నామనే సందేహాన్ని ఈ ఉదంతం రేకెత్తిస్తోంది. మరొకరిని బాధపెట్టడంలో సంతోషాన్ని వెతుక్కునేలా మారిపోవడం బాధాకరం. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని ప్రపంచమంతా భయపడుతుంటే మరోవైపు ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని కొందరు ఇలాంటి తప్పుడు పనులకు ఉపయోగించుకుంటున్నారు. డిజిటల్ వేదికలపై జరిగినా దీన్ని లైంగిక దాడితో సమానంగా పరిగణించాలి. చట్టప్రకారం తీవ్రంగా శిక్షి ంచాలి. ఈ ఘటనను వ్యతిరేకిస్తున్న ప్రతి ఒక్కరికీ నా పూర్తి మద్దతు ఉంటుంది. అన్నారు.

## జపాన్ ఓపెన్: సెమీఫైనల్‌కు అల్కరాజ్



**టోక్యో:** జపాన్ ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్‌లో క్వార్టర్‌ఫైనల్ పోరులో డెనిస్ షపోవలోవ్ రెండవ సెట్ ప్రారంభంలోనే వైదొలగడంతో, టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాడు. ఆదివారం హోరాహోరీగా సాగిన తొలి సెట్ తర్వాత, 82 నిమిషాల అనంతరం డిఫెండింగ్ ఛాంపియన్ 7-6(3), 2-1 ఆధిక్యంలో ఉండగా షపోవలోవ్ ఆట నుండి వైదొలగాల్సి వచ్చింది. షపోవలోవ్ అద్భుతంగా ప్రారంభించి, 5-3 ఆధిక్యం సాధించి, 5-4, 30/40 వద్ద సెట్ పాయింట్‌ను సంపాదించాడు. అయితే అల్కరాజ్ ఒక డ్రాప్ షాట్‌తో ఆ అవకాశాన్ని కాపాడుకుని తిరిగి పోటీలోకి వచ్చాడు. ఆ తర్వాత ఆ స్పానిష్ ఆటగాడు టైబ్రేక్‌లో ఆధిపత్యం చెలాయించి తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. మొదటి సెట్‌లో ఆరుసార్లు సర్వ్ బ్రేక్‌లు జరగ్గా అల్కరాజ్ మూడుసార్లు బ్రేక్ అయినప్పటికీ ప్రతిసారీ కోలుకోగలిగాడు. రెండవ సెట్ ప్రారంభంలో షపోవలోవ్ తుంటికి గాయం కావడంతో ఆటను కొనసాగించలేకపోయాడు. దీంతో అనూహ్యంగా అల్కరాజ్ సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. సెమీఫైనల్స్‌లో అల్కరాజ్ తన తోటి స్పానిష్ ఆటగాడైన జౌమ్ మునార్‌తో తలపడనున్నాడు.

### ఫిఫా ఫుట్‌బాల్ మ్యాచ్‌లో..

## భారత్ ఓటమి

### 4-0 తేడాతో బ్రెజిల్ గెలుపు



**కోల్‌కతా:** తొలి 25 నిమిషాల పాటు భారత్ వీరోచితంగా పోరాడినా, ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన బ్రెజిల్ జట్టు ఇక్కడ జరిగిన ఫిఫా అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లో 4-0 తేడాతో సునాయాసంగా గెలిచింది. భారత్ తొలి 25 నిమిషాల్లో కొన్ని మంచి అవకాశాలను దక్కించుకున్నప్పటికీ గోల్ చేయలేకపోయింది. అత్యుత్తమ ప్రదర్శన చేయకపోయినా ఆటను తమ నియంత్రణలో ఉంచుకున్న దక్షిణ అమెరికా జట్టు తరఫున ఎస్టెవావో (28వ నిమిషం), పెడ్రో (42వ), శామ్యూల్ లినో (58వ, 90+5వ) గోల్స్ చేశారు. ఆట ఆరంభ దశలో భారత్ బ్రెజిల్‌ను నిరాశకు గురిచేయడం కొనసాగించింది. మన్వీర్ సింగ్ అవకాశాలను కల్పించగా, ర్యాన్ విలియమ్స్, అషిక్ కురునియన్ ఎదురుదాడిలో ప్రయత్నించాడు. కానీ భారత గోల్ కీపర్ మొదటి ప్రయత్నాన్ని సమర్థవంతంగా అడ్డుకున్నాడు. బాక్స్ అంచున బంతిని అందుకున్న ఎస్టెవావో, అషిక్‌ను తప్పించుకుని సమీప పోస్ట్ వైపు బంతిని కొట్టడంతో చివరకు గోల్ లభించింది. ఆ శక్తివంతమైన కిక్‌ను గుర్‌ప్రీత్ చేతితో అడ్డుకున్నప్పటికీ, దానిని ఆపలేకపోయాడు, దీంతో సులభమైన గోల్ అయింది.

## ఇరానీ కప్ విజేతగా రెస్ట్ ఇండియా

### జమ్మూ కశ్మీర్‌పై 167 రన్స్‌తో గెలుపు

**శ్రీనగర్:** రంజీ ట్రోఫీ ఛాంపియన్ జమ్ము కశ్మీరోతో జరిగిన ఇరాని కప్ ఫైనల్లో రెస్ట్ ఆఫ్ ఇండియా అద్భుతమైన ప్రదర్శనతో తిరుగులేని విజయం సాధించింది. మ్యాచ్ నాలుగో రోజు ఆదివారం భారత పేసర్లు ముఖేష్ కుమార్ (6/33), ఆకాశ్ దీప్ (3/25) కిరాక్ బౌలింగ్‌తో చెలరేగడంతో జమ్ము కశ్మీర్ బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. ఫలితంగా రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు 167 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి ఇరాని కప్‌ను ముద్దాడింది. మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా 279 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జమ్ము కశ్మీర్ జట్టు ఆరంభంలో గట్టిగానే పోరాడింది. ఓపెనర్లు శుభమ్ ఖజురియా (36), ఖమ్రాన్ ఇక్బాల్ (32) తొలి వికెట్‌కు 54 రన్స్ జోడించి మంచి ఆరంభాన్నిచ్చింది. మ్యాచ్ నాలుగో రోజు లంచ్ సమయానికి జేఅండ్కే 3 వికెట్ల నష్టానికి 89 పరుగులతో పటిష్ట స్థితిలో ఉన్నట్లు కనిపించింది. కానీ తర్వాత మ్యాచ్ పూర్తిగా మారిపోయింది. ఆకాశ్ దీప్ వేసిన తొలి



బంతికే శుభమ్ ఖజురియా ఔట్ కావడం మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారింది. ఆ తర్వాత కేవలం 22 రన్స్ వ్యవధిలోనే జమ్ము కశ్మీర్ తన చివరి 6 వికెట్లను కోల్పోయి కేవలం 111 పరుగులకే ఆలౌట్ అయింది.

ఈ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా పేసర్ ముఖేష్ కుమార్ కేవలం 33 రన్స్ మాత్రమే ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా 15వ ఓవర్లో శుభమ్ పుండిర్, కెప్టెన్ పరస్ డోగ్రాను వరుస బంతుల్లో పెవిలియన్‌కు పంపి మ్యాచ్‌ను పూర్తిగా రెస్ట్ ఆఫ్ ఇండియా వైపు తిప్పేశాడు. మరోవైపు ఆకాశ్ దీప్ (3/25) కూడా అత్యంత కసిగా బౌలింగ్ చేసి కీలక వికెట్లు పడగొట్టాడు.




## చైనా ఓపెన్‌లో నికోలా సంచలనం

### వరుస సెట్లలో సబలెంకా ఓటమి

**బీజింగ్:** చెక్ రిపబ్లిక్‌కు చెందిన నికోలా బార్టుంకోవా చైనా ఓపెన్‌లో ఒక పెద్ద సంచలనం సృష్టించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ నంబర్ 2 అరీనా సబలెంకాను వరుస సెట్లలో ఓడించి నాలుగో రౌండ్‌కు చేరుకుంది. ప్రపంచ నంబర్ 1 ఎలెనా రైబాకినా కూడా టోర్నమెంట్ నుండి నిష్క్రమించిన ఒక రోజు తర్వాత, ప్రపంచ 34వ ర్యాంకర్ అయిన 20 ఏళ్ల క్రీడాకారిణి ఒక గంట 35 నిమిషాల పోరులో 6-4, 6-3 తేడాతో విజయం సాధించింది. బార్టుంకోవా సబలెంకా సర్వ్‌ను మూడుసార్లు బ్రేక్ చేసి, ఒక్క బ్రేక్ పాయింట్‌ను కూడా కోల్పోకుండా, టాప్ 10 క్రీడాకారిణిపై తన కెరీర్‌లో రెండవ విజయాన్ని నమోదు చేసింది. తొలి సెట్‌లో సబలెంకా సర్వ్‌ను బ్రేక్ చేసి బార్టుంకోవా ఆరంభంలోనే ముందంజ వేసింది. ఆ తర్వాత ఆరో గేమ్‌లో ఐదు బ్రేక్ పాయింట్లను కాపాడుకుని 4-2 ఆధిక్యం సాధించింది. తర్వాతి గేమ్‌లో మరో బ్రేక్ సాధించే మూడు అవకాశాలను కోల్పోయినప్పటికీ, చెక్ క్రీడాకారిణి తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని, చివరి రెండు గేమ్‌లలో ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా తన సర్వ్‌ను నిలబెట్టుకుని సెట్‌ను 6-4తో కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో కూడా సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసి 3-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బార్టుంకోవా తన సర్వీస్‌పై నిలకడగా ఉంటూ, తొమ్మిదవ గేమ్‌లో బెలారసియన్ క్రీడాకారిణి సర్వీస్‌ను మళ్లీ బ్రేక్ చేసి 6-3 తేడాతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

### వరల్డ్ కప్: టీమిండియా స్క్వాడ్ ఫిక్స్!

## రోహిత్, కోహ్లి ఇన్..

### బ్యాటింగ్, పేస్, ఆల్‌రౌండర్లకు సమాన ప్రాధాన్యం

**న్యూఢిల్లీ:** వన్డే వరల్డ్ కప్ 2027 కోసం టీమిండియా ఎలా ఉండబోతుందనే దానిపై భారత్ క్రికెట్ బోర్డు కసరత్తు చేస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా నిర్వహించే ఈ టోర్నీకి సంబంధించి అధికారిక షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆఫ్రికా పిచ్‌లపై ఉండే వేగం, బౌన్స్‌ను దృష్టిలో ఉంచుకుని బ్యాటింగ్, పేస్, ఆల్‌రౌండర్లకు సమాన ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. వన్డే ఫార్మాట్‌లో శుభ్‌మన్ గిల్ టీమిండియా కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. అతడితో కలిసి రోహిత్ శర్మ ఓపెనర్‌గా ఆడే అవకాశం ఉంది. కొత్త బంతిని ఎదుర్కొంటూ వేగంగా పరుగులు చేయగల రోహిత్ అనుభవం జట్టుకు ఉపయోగపడుతుంది. మిడిల్ ఆర్డర్‌లో విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, రుతురాజ్ గైక్వాడ్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. రాహుల్ బ్యాటింగ్‌తో పాటు వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా తీసుకునే ప్రధాన ఎంపికగా కనిపిస్తున్నాడు. బ్యాకప్ కీపర్, ఫినిషర్ పాత్ర కోసం ఇషాన్ కిషన్, ధ్రువ్ జురెల్‌లో ఒకరికి అవకాశం దక్కొచ్చని తెలుస్తోంది. ఆల్‌రౌండర్లలో హార్దిక్ పాండ్యా కీలకంగా ఉండే అవకాశం ఉంది. అతడికి తోడుగా నితీష్ కుమార్ వంటి సీమ్ ఆల్‌రౌండర్‌ను తీసుకునే అవకాశం ఉంది. స్పిన్ ఆల్‌రౌండర్ విభాగంలో అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా పేర్లు ఉన్నాయి. వీరిద్దరూ బ్యాటింగ్‌లోనూ ఉపయోగపడగలగడం జట్టు కూర్పుకు అదనపు బలం కావొచ్చు. పేస్ విభాగానికి జస్ప్రీత్ బుమ్రా నాయకత్వం వహించే వీలుంది. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ లేదా హర్షిత్ రాణా లో ఒకరికి చోటు దక్కొచ్చని అంచనా.

ఎడమచేతి పేసర్‌గా అర్ష్‌దీప్‌సింగ్ జట్టులో వైవిధ్యం తీసుకురాగలడు. డెత్‌ఓవర్లలో అతడి బౌలింగ్ ఉపయోగపడుతుందని సోర్స్ పేర్కొంటోంది. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్‌కు చోటు దాదాపు ఖాయంగా భావిస్తున్నారు. మిడిల్ ఓవర్లలో అతడి బౌలింగ్ కీలకంగా మారొచ్చని అంచనా.




## పరిశోధన అభివృద్ధిలో ప్రైవేటు వ్యయం పెరగాలి: ఆర్థిక మంత్రి



**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** భారత ఆర్థిక వ్యవస్థలో తదుపరి దశ వృద్ధికి ప్రైవేట్ పెట్టుబడులే ప్రధాన చోదక శక్తిగా మారాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రైవేట్ రంగం మూలధన వ్యయంతో పాటు పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ)పై పెట్టుబడులను కూడా పెంచాలని పిలుపునిచ్చారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహించిన కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్లో సీతారామన్ మాట్లాడుతూ ఇకపై వృద్ధి చక్రానికి ప్రైవేట్ పెట్టుబడులే నాయకత్వం వహించాలి. పరిశోధన, ఆవిష్కరణల రంగంలోనూ ప్రైవేట్ పెట్టుబడులు పెరగాలని అన్నారు. భారత్‌లో పరిశోధన, అభివృద్ధి వ్యయం జిడిపిలో కేవలం 0.83 శాతంగా ఉంది. అదే ఒఇసిడి దేశాల్లో ఈ వ్యయం సగటున 2.7 శాతంగా ఉంది. దేశంలోని మొత్తం ఆర్ అండ్ డి వ్యయంలో ప్రైవేట్ రంగం వాటా కేవలం 36 శాతం మాత్రమేనని సీతారామన్ వెల్లడించారు.ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంచుకోవాలంటే పెట్టుబడుల పరిమాణాన్ని పెంచడంతో పాటు ఆర్ అండ్ డిలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని కూడా గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.1 లక్ష కోట్ల పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల నిధిని ప్రకటించింగని అన్నారు. ప్రైవేట్ రంగం కూడా పరిశోధన, అభివృద్ధిపై అధికంగా ఖర్చు చేసేలా ప్రోత్సహించడం ఈ నిధి ప్రధాన ఉద్దేశం. మేడ్ ఇన్ ఇండియా నుంచి ఇమాజిన్డ్ అండ్ మేడ్ ఇన్ ఇండియా వైపు దేశాన్ని తీసుకెళ్లేందుకు ఈ పథకం దోహదపడుతుందని సీతారామన్ చెప్పారు. అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని విధానాలను రూపొందించాల్సి ఉంటుందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థకు స్థైర్యం కల్పించడం ఒక్కసారి చేపట్టి ముగించే కార్యక్రమం కాదని, నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. రానున్న సంవత్సరాల్లో వ్యూహాత్మక వనరుల భద్రత, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో నిరంతర అనుసంధానం, నైపుణ్యాల అభివృద్ధి ప్రధాన ప్రాధాన్యతలుగా ఉంటాయని ఆర్థిక మంత్రి తెలిపారు. వ్యూహాత్మక వనరుల భద్రత స్థూల ఆర్థిక విధానంలో కీలక అంశంగా మారుతుందని చెప్పారు. భారత్ ఇప్పటికే నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్, రేర్ ఎర్త్ కారిడార్స్, ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 వంటి కార్యక్రమాలను ప్రారంభించిందని తెలిపారు. చిన్న మాడ్యులర్ అణు రియాక్టర్ల అభివృద్ధిపైనా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ.12.22 లక్షల కోట్ల మూలధన వ్యయాన్ని బడ్జెట్‌లో కేటాయించింది.

## 5.75-6 శాతానికి చేరే రెపో రేటు

### యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా



**ముంబయి, అక్టోబరు 4:** ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, పెరుగుతున్న ముడిచమురు ధరలు, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ అధికంగా కొనసాగుతున్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్టోబర్‌లో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొంది. మరో ఒకటి లేదా రెండు విడతల్లో రేట్ల పెంపు జరిగే అవకాశముందని, దీంతో రెపో రేటు 5.75-6 శాతానికి చేరవచ్చని అంచనా వేసింది. ద్రవ్యోల్బణానికి సంబంధించిన ప్రమాదాలు కొనసాగడం, క్రూడ్ ఆయిల్ ధరలు అధిక స్థాయిలో ఉండటం, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ పెరగడం వంటి అంశాలు కఠిన ద్రవ్య విధానానికి అనుకూలంగా మారవచ్చని బ్యాంక్ తెలిపింది. దీనివల్ల ప్రభుత్వ సెక్యూరిటీల రిటర్నులపై మరింత ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. సెప్టెంబర్‌లో ప్రభుత్వ బాండ్లపై ఒత్తిడి కొనసాగిందని యూనియన్ బ్యాంక్ తెలిపింది. ముడిచమురు ధరలు పెరగడం, అంతర్జాతీయ ఈల్డ్స్ అధికం కావడంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచవచ్చన్న అంచనాలు బలపడ్డాయని దేశీయ బాండ్ సరఫరా పెరగడం కూడా రాబడులు అధికంగా ఉండటానికి మరో కారణమని నివేదిక వివరించింది. ఆర్‌బీఐ చేపట్టిన ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ విక్రయాలు, ఈ యేడాది ద్వితీయార్థ రుణ కార్యక్రమంలో దీర్ఘకాలిక సెక్యూరిటీల వాటా పెరగడం వల్ల బాండ్ సరఫరాపై ఒత్తిడి పెరిగిందని తెలిపింది. మొత్తం ప్రభుత్వ రుణ సమీకరణ తగ్గినప్పటికీ ఈ ప్రభావం కనిపించిందని పేర్కొంది. ఈ ప్రభావం ముఖ్యంగా ఐదేళ్ల ప్రభుత్వ బాండ్ల విభాగంలో ఎక్కువగా కనిపించింది. సెప్టెంబర్‌లో ఐదేళ్ల బాండ్ రాబడులు 45 బేసిస్ పాయింట్లు పెరిగింది. ఇదే సమయంలో పదేళ్ల బాండ్ ఈల్డ్ 24 బేసిస్ పాయింట్లు మాత్రమే పెరిగింది.దీంతో పదేళ్ల, ఐదేళ్ల సెక్యూరిటీల మధ్య ఈల్డ్ వ్యత్యాసం 36 బేసిస్ పాయింట్ల నుంచి 16 బేసిస్ పాయింట్లకు తగ్గిందని యూనియన్ బ్యాంక్ తెలిపింది.

## సెప్టెంబరులో రూ.35,861 కోట్ల ఎఫ్‌పిఐలు విత్‌డ్రా




**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల నిధుల విత్‌డ్రా కలవరం పుట్టిస్తోంది. సెప్టెంబర్‌లో భారత ఈక్విటీల్లో ఎఫ్‌పిఐలు ఏకంగా రూ.35,861 కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించారు. అక్టోబర్ కూడా ప్రతికూలంగానే ప్రారంభమైంది. ఈ నెలలో ఇప్పటివరకు రూ.9,232 కోట్ల మేర నికర అమ్మకాలు నమోదయ్యాయి.అంతకు ముందు జూలై, ఆగస్టు నెలల్లో ఎఫ్‌పీఐలు భారత మార్కెట్లలో భారీగా పెట్టుబడులు పెట్టారు. జూలైలో రూ.20,200 కోట్లు, ఆగస్టులో రూ.29,631 కోట్లను నికరంగా ఇన్వెస్ట్ చేశారు. ముడిచమురు ధరలు తగ్గుతాయన్న అంచనాలతో వచ్చిన ఈ పెట్టుబడులు తాత్కాలిక పరిణామంగానే మిగిలిపోయాయి. ముడిచమురు ధరలు తగ్గుతా యన్న అంచనాలతో జూలై, ఆగస్టులో నమోదైన సానుకూల ఎఫ్‌పిఐ ప్రవాహాలు తాత్కాలికమేనని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వికె విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అమెరికా బాండ్ రిటర్నులు భారీగా పెరగడం భారత మార్కెట్లపై ఒత్తిడి పెంచుతోంది. 30 యేళ్ల అమెరికా ట్రెజరీ రాబడి వారం క్రితం 5.48 శాతానికి చేరింది. ఇది రెండు దశాబ్దాల గరిష్ఠ స్థాయిగా నమోదైంది. అదే సమయంలో 10 ఏళ్ల ట్రెజరీ ఈల్డ్ కూడా గత వారం 5.3 శాతానికి చేరింది. అమెరికాలో ఉద్యోగాల కల్పన అంచనాల కంటే మందగించినప్పటికీ, దీర్ఘకాలిక ఆర్థిక పరిస్థితులపై ఉన్న ఆందోళనల కారణంగా ఇన్వెస్టర్లు ఈ పరిణామాలను పెద్దగా పట్టించుకోలేదు" అని ఛాయిస్ వెల్త్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ ఆఫీసర్ ధీరజ్ గౌర్ తెలిపారు. ముడిచమురు ధరలు వరుసగా పెరుగుతున్నాయి. సెప్టెంబర్‌లో ఎక్కువ కాలం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగానే కొనసాగింది.సౌదీ అరేబియా కీలక పైప్‌లైన్ మూసివేతను భర్తీ చేసేందుకు హార్ముజ్ జలసంధి మీదుగా కొంత ముడిచమురును రవాణా చేసినట్లు వార్తలు రావడంతో ధరల పెరుగుదలకు కొంత విరామం లభించింది. అధిక ముడిచమురు ధరలు దిగుమతులపై ఆధారపడే భారత్‌కు ఆందోళనకరంగా మారాయి. ఇరువైపుల నుంచి కాల్పుల విరమణ లేదా శాంతి చర్చలు తిరిగి ప్రారంభమయ్యే స్పష్టమైన సంకేతాలు కనిపించకపోవడంతో విదేశీ ఇన్వెస్టర్లకు ప్రధాన రిస్క్‌గా మారి భారత ఈక్విటీల్లో పెట్టుబడుల పరంగా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. రూపాయి విలువ పలుమార్లు డాలర్‌కు రూ.96 స్థాయిని దాటింది. రూపాయి పతనం దేశ ఆర్థిక వ్యవస్థ ముడిచమురు ధరల పెరుగుదల, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ వంటి అంశాలకు ఎంత సున్నితంగా ఉందో వెల్లడి స్తోందని నిపుణులు చెబుతున్నారు. ఎఫ్‌పీఐల అమ్మకాలకు మరో ముఖ్య కారణంగా పోర్ట్‌ఫోలియో రొటేషన్ కీలకం. డాలర్ ఆధారిత ఆస్తులు, ఆసియాలోని టెక్నాలజీ ఆధారిత మార్కెట్లలో ఆకర్షణీయమైన పెట్టుబడి అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో విదేశీ పెట్టుబడుల కోసం భారత్ ఇతర మార్కెట్లతో మరింత తీవ్రంగా పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది."నాన్‌ఏఐ ట్రేడ్ గణనీయంగా తగ్గిపోవడంతో అదనపు విదేశీ మూలధనం కోసం భారత్ మరింతగా పోటీ పడాల్సి వస్తోంది" అని ధీరజ్ గౌర్ పేర్కొన్నారు.




## హెచ్‌డిఎఫ్‌సి నుంచి న్యూఫండ్ ఆఫర్

**ముంబయి, అక్టోబరు 4:** ప్రముఖ మ్యూచువల్ ఫండ్ హౌస్ హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్ల కోసం ఒక సరికొత్త పాసివ్ ఇండెక్స్ ఫండ్‌ను అందుబాటులోకి తెచ్చింది. హెచ్‌డిఎఫ్‌సి నిఫ్టీ లార్జ్ మిడ్ క్యాప్ 250 ప్లస్ 8-13 ఇయర్స్ జీసెక్ 70:30 ఇండెక్స్ ఫండ్ పేరుతో వచ్చిన ఈఫండ్, డెట్, ఈక్విటీ మిశ్రమ ఇండెక్స్ ఆధారంగా పని చేసే ఒక ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. కేవలం రూ.100 నామమాత్రపు కనీస పెట్టుబడితో ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసే సౌకర్యం ఉంది. హెచ్‌డిఎఫ్‌సి తీసుకొచ్చిన ఈ ఫండ్ ఒక పాసివ్ ఫండ్. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సోమవారం ప్రారంభమై ఈనెల 19 వరకు కొనసాగనుంది. డెట్ ఆధారిత ఇండెక్స్ ఫండ్. ఇందులో కనీస పెట్టుబడి రూ.100గాఉంది. ఆతర్వాత రూ.100 చొప్పున ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. సబ్‌స్క్రిప్షన్ సమయంలో యూనిట్ వాల్యూ రూ.10గా ఉంటుంది. సబ్‌స్క్రిప్షన్ ముగిసిన తర్వాత యూనిట్లకేటాయింపు ఉంటుంది. ఈ ఫండ్ పోర్ట్‌ఫోలియోలోని నిధులను 70శాతం ఈక్విటీ, 30 శాతం సురక్షితమైన బాండ్లకు కేటాయిస్తారు.

## రెపోరేట్, త్రైమాసిక ఫలితాలే ఈ వారం కీలకం

### మార్కెట్లకు దిక్సూచి అవుతున్న ఇన్వెస్టర్ల ధోరణులు




**ముంబయి, అక్టోబరు 4:** రిజర్వుబ్యాంకు వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయం, టిసిఎస్ త్రైమాసిక ఫలితాలు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్ల గమనాన్ని నిర్దేశించడంలో కీలకంగా మారనున్నాయి. స్థూల ఆర్థిక గణాంకాల విడుదల, విదేశీ పెట్టుబడిదారుల ట్రేడింగ్ కార్యకలాపాలు కూడా మార్కెట్ ధోరణిపై ప్రభావం చూపిస్తాయి. ఆర్బీఐ ద్రవ్య విధాన సమావేశాన్ని మార్కెట్ వర్గాలు అత్యంత ఆసక్తిగా గమనించనున్నాయి. పాలసీ వైఖరి, ద్రవ్యోల్బణ అంచనాలు, ఆర్థిక వృద్ధి అంచనాలు దేశీయ వడ్డీ రేట్లు, ఆర్థిక మార్కెట్ల సమీపకాల గమనంపై కీలక సంకేతాలను అందిస్తాయని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. ఈ వారం నుంచి కంపెనీల త్రైమాసిక ఫలితాల సీజన్ కూడా ప్రారంభం కానుంది. సూచీల్లో కీలకమైన ఐటీ దిగ్గజం టిసిఎస్, రిటైల్ రంగంలోని ప్రముఖ సంస్థ డీమార్ట్ సహా పలు ప్రధాన కంపెనీలు తమ ఫలితాలను ప్రకటించనున్నాయి.సెప్టెంబర్ నెలకు సంబంధించిన హెచ్ఎస్‌బిసి సర్వీసెస్ పిఎంఐ, కాంపోజిట్ పిఎంఐ,తుది గణాంకాలు అక్టోబర్ 6న విడుదల కానున్నాయి. టిసిఎస్ త్రైమాసిక ఫలితాలను అక్టోబర్ 8న ప్రకటించనుంది. ప్రస్తుతం స్థూల ఆర్థిక పరిస్థితుల్లో ముడి చమురు ధరలు అత్యంత తక్షణ ఆందోళన కలిగిస్తున్న అంశం. బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా కొనసాగుతున్న బ్రెంట్ క్రూడ్ ధరలు భారత బాహ్య ఆర్థిక సమతుల్యత, ద్రవ్యోల్బణ అంచనాలపై ఒత్తిడిని పెంచుతున్నాయి. అనిశ్చితి కొనసాగడం వల్ల ఇంధన ధరల్లో రిస్క్ ప్రీమియం అధిక స్థాయిలో ఉంటుందని ఆన్‌లైన్ ట్రేడింగ్, వెల్త్‌టెక్ సంస్థ ఎన్‌రిచ్ మనీ సిఇఒ పొన్ముడి ఆర్. తెలిపారు. వరుసగా ఎనిమిదో వారమూ నష్టాల్లో మార్కెట్లు విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు, రూపాయి బలహీనత, అధిక ముడి చమురు ధరలు, పెరుగుతున్న అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ కారణంగా భారత ఈక్విటీ మార్కెట్లు వరుసగా ఎనిమిదో వారాన్ని నష్టాలతో ముగించాయి. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశ మినిట్స్, సెప్టెంబర్ వడ్డీ రేట్ల పెంపు తర్వాత మరింత కఠిన ద్రవ్య విధానానికి అమెరికా పాలసీ మేకర్లలో ఎంతమేర మద్దతు ఉందో చెపుతాయని రీసెర్చ్ అనలిస్ట్ సంస్థ హెచ్ఎస్‌టి వెల్త్ వ్యవస్థాపకుడు, సిఇఒ హరిసెల్వన్ రాధాకృష్ణన్ తెలిపారు.



## డీమార్ట్ నికర రాబడులు రూ.19,206 కోట్లు

**ముంబయి, అక్టోబరు 4:** రిటైల్ దిగ్గజం డీమార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్ మార్ట్స్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. దిగ్గజ ఇన్వెస్టర్ రాధాకిషన్ దమానీకి చెందిన ఈ మల్టీబ్యాగర్ కంపెనీ, జులై సెప్టెంబర్ త్రైమాసికంలో తన విక్రయాల్లో మెరుగైన వృద్ధిని నమోదు చేయడంతో పాటు నెట్ వర్క్ విస్తరణలో భాగంగా కొత్త స్టోర్లను సైతం ప్రారంభిస్తోంది. జులై సెప్టెంబర్ త్రైమాసికంలో డీమార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్ మార్ట్స్ ఏకీకృత రాబడి రూ.19,206.18 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.16,218.79 కోట్లుగాఉండగా ఇప్పుడు ఏకంగా 18.4 శాతం వృద్ధి కనబరిచింది. త్రైమాసిక ప్రాతిపదికన చూస్తే ఏప్రిల్ జూన్ 2026 త్రైమాసికంతో పోలిస్తే డీమార్ట్ ఆదాయం 4.7 శాతం పెరిగింది. రాధాకిషన్ దమానీ కుటుంబం నేతృత్వంలోని డిమార్ట్ అనేక రాష్ట్రాలలో నిత్యవసర గృహోపకరణాలు, వ్యక్తిగత వినియోగ ఉత్పత్తులను విక్రయిస్తోంది. క్యూ2 సమయంలో కంపెనీ దేశవ్యాప్తంగా కొత్త స్టోర్లను జోడించింది. దీంతో మొత్తం డీమార్ట్ అవుట్ లెట్ల సంఖ్య మరింత పెరిగింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.